అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 29-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 | సంచిక : 36 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

దేశం అప్పు 155.8 లక్షల కోట్లు



వడ్డీరూపంలో చెల్లింపు 9.4 లక్షల కోట్లు: కేంద్రం





న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.8 లక్షల కోట్లకు చేరిందని, దీనికి వడ్డీనే రూ.9.4 లక్షల కోట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23 సవరించిన బడ్జెట్ అంచనాల్లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.8 లక్షల కోట్లు కాగా, అందులో రూ.148.8 లక్షల కోట్లు దేశీయ అప్పు, రూ.7 లక్షల కోట్లు విదేశీ అప్పు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అప్పు కూడా ఏడాదికి ఏడాది భారీగా పెరుగుతోంది. 2017-18లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.82.9 లక్షల కోట్లు కాగా, 2018-19లో రూ.92.5 లక్షల కోట్లకు, 2019-20లో రూ.105.2 కోట్లకు, 2020-21లో రూ.122.1 లక్షల కోట్లకు, 2021-22లో రూ.138.9 కోట్లకు, 2022-23లో అది కాస్తా రూ.155.8 లక్షల కోట్లకు పెరిగింది. దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో అప్పుల వాటా 2017-18లో 48.5 శాతం, 2018-19లో 49 శాతం, 2019-20లో 52.4 శాతం, 2020-21లో 58.7 శాతం, 2022-23 (సవరించిన బడ్జెట్ అంచనా)లో 57.3 శాతం ఉంది. దీన్ని బట్టీ చూస్తే జీడీపీలో అప్పుల వాటా కూడా ఏడాదికి ఏడాది పెరుగుతోంది.

రూ. 82కి పడిపోయిన రూపాయి విలువ

అమెరికా డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ రూపాయి ...9లో

ఐదేండ్లలో కార్పొరేట్లకు రూ.8.72 లక్షల కోట్లు మాఫీ

- కేంద్ర మంత్రి భగవంత్ ఖరాడ్

న్యూఢిల్లీ : గత ఐదేండ్లలో దేశంలోని కార్పొరేట్లు తీసుకున్న రుణాలు రూ.8,72,778 కోట్లు మాఫీ చేసినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖరాడ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2017-18 నుంచి 2021-22 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 6,31,693 కోట్లు, ప్రయివేట్ రంగ బ్యాంకులు రూ.2,24,855 కోట్లు, విదేశీ బ్యాంకులు రూ.16,230 కోట్లు మాఫీ చేశాయని తెలిపారు

2.38 లక్షలకు పైగా డొల్ల కంపెనీలు

నిర్దిష్ట నిర్వచనం లేనివిగా గుర్తింపు

న్యూఢిల్లీ: 'షెల్ కంపెనీల' గురించి ఎటువంటి సమాచారం లేదని గతంలో మోడీ ప్రభుత్వం చెప్పినప్పటికీ.. 2018-2021 మధ్య 2,38,223 కంపెనీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే షెల్ కంపెనీలుగా లేబుల్ చేసి వాటి గురించి ఎలాంటి సమాచారాన్ని పంచుకోకపోవడం గమనార్హం. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ జూలై 27, 2021న రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీ మహువా మిత్రా దీనిని ఎత్తిచూపారు. "చట్టంలో నిర్దిష్ట నిర్వచనం లేకుండా 2018 మరియు 2021 మధ్య ప్రభుత్వం 2,38,223 షెల్ కంపెనీలను గుర్తించడం విచిత్రంగా ఉంది" అని అన్నారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన పత్రికా ప్రకటనలో "షెల్ కంపెనీ' అనే పదం కంపెనీల చట్టంలో నిర్వచించబడలేదని పేర్కొన్నది. సాధారణంగా యాక్టివ్ బిజినెస్ ఆపరేషన్‌లో లేని లేదా గణనీయమైన ఆస్తులు లేని కంపెనీని సూచిస్తుందని వివరించడంత గమనార్హం. భారతీయుల ఆఫ్‌షోర్ ఖాతాలకు సంబంధించిన డేటా తమ వద్ద లేదని కేంద్రం ఇప్పుడు పార్లమెంటుకు తెలిపింది. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా అదానీకి చెందిన 'షెల్ కంపెనీల'లో రూ.20,000 కోట్లు 'అకస్మాత్తుగా వచ్చాయని' రాహుల్ గాంధీ ప్రకటించిన వెంటనే ఈ విషయం వెల్లడి కావడం గమనార్హం.

పంట నష్టపరిహారమివ్వండి



అర్హులైన వారికి పోడు భూముల పంపిణీకి సిద్ధం

- గృహలక్ష్మి విధివిధానాలను ఖరారు చేయండి
- సీఎస్‌కు సీఎం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అకాలంగా కురిసిన వడగండ్ల వానలతో నష్టపోయిన పంటలకు, ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలనీ, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పంట నష్టం, పోడు భూములు, గొర్రెల పంపకం, పేదలకు ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం..తదితర అంశాలపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, సీఎం కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలకు ఆర్థికసాయం

నష్ట పోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ సీఎం ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని ...9లో

పేదల ఇండ్ల నిర్మాణానికి సాయం



ఖాళీ జాగాలు ఉన్న అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి, విధి విధానాలను రూపొందించి జారీ చేయాలని స్పష్టం చేశారు.

సీతారాముల కళ్యాణ నిర్వహణకు కోటి రూపాయలు

శ్రీరామ నవమి సందర్భంగా 30 న భద్రాచలంలో జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల నిర్వహణకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి కోటి రూపాయలను సీఎం మంజూరు చేశారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాలుగా భద్రాచల దేవస్థానం ఆదాయం కోల్పోయిన నేపథ్యంలో దేవాదాయ శాఖ అభ్యర్థన మేరకు కళ్యాణ నిర్వహణకోసం సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు

మెట్రో విస్తరణపై కేంద్రం వివక్ష

ఫీజుబులిటీ లేదనడం విడ్డూరం



- నగరంలోకి 500 ఎలక్ట్రానిక్ బస్సులు
- ఖాజాగూడ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో విస్తరణకు కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకున్నా చేపడతామని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని లక్డికాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రో విస్తరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా ఫీజిబులిటీ లేదని నివేదిక ఇచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మెట్రో విస్తరణ పనులు చేపడుతుందన్నారు. మంగళవారం ఖాజాగూడ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్టు కాదా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. నగరంలో ప్రజా రవాణా కోసం 500 ఎలక్ట్రానిక్ బస్సులను తీసుకొస్తున్నట్టు తెలిపారు. నగరంలోని 50 చెరువులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి, సుందరీకరణ చేసేందుకు ...9లో

పీఎఫ్‌పై 5 పైసల వడ్డీ పెంపు

- 2022-23కు 8.15శాతంగా నిర్ణయం



వివరాలు 5లో..

ఈడీ లేఖకు ఎమ్మెల్సీ కవిత సమాధానం

- ఈడీ కార్యాలయానికి వెళ్లిన సోమా భరత్

వివరాలు 9లో..

అత్యాశే కొంపముంచింది

- టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో ముగిసిన నిందితుల సిట్ కస్టడీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజ్ కేసులో నిందితుల సిట్ కస్టడీ ముగిసింది. కస్టడీలో వున్న ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, రాజేశ్వర్ నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. అత్యాశే వారి కొంపముంచిందని తెలుస్తోంది. రేణుక ఇద్దరికి ఏఈ పేపర్ విక్రయించగా, ఆమె భర్త అత్యాశకు పోయి ...3లో

మోడీదంతా ప్రచారమే..

ఒక్క పరిశ్రమా పెట్టలేదు.. ఉన్నవాటినే అమ్మేస్తున్నారు

- భువనగిరిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ - భువనగిరి

ప్రజల్లో మత విద్వేషాలను ప్రేరేపించి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందని, రానున్న కాలంలో బీజేపీ పీడను వదిలించుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రకు ఆ పార్టీ జిల్లా శ్రేణులు ఘన స్వాగతం పలికారు. డప్పు, కోలాటాల కళాకారుల నృత్యాలతో యాత్రకు స్వాగతం పలికారు. ర్యాలీలో భాగంగా డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, బృందం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) భువనగిరి జిల్లా కార్యాలయాన్ని (దుంపల మల్లారెడ్డి భవనం) రాఘవులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ...2లో

నేడే జనచైతన్య యాత్ర ముగింపు సభ

- హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ప్రకాశ్ కరత్

వివరాలు 9లో..

విద్వేష ప్రసంగాలపై చర్యలేవి?

మతసామరస్యానికి కట్టడి అవసరం : సుప్రీం



న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలపై సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు విద్వేషపూరిత ప్రసంగాలను కట్టడి చేయడం అవసరమని పేర్కొంది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

విద్వేష ప్రసంగాలకు సంబంధించి 18 కేసులు నమోదు చేసినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా ధర్మాసనం ...9లో

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

ఎర్రకోట వద్ద శాంతి కాగడా మార్చ్ ... నేతలను అడ్డుకున్న పోలీసులు





న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు వ్యతిరేకిస్తూ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పరిరక్షణ శాంతి కాగడ ప్రదర్శన నిర్వహించాయి. మంగళవారం నాడిక్కడ ఎర్ర కోట నుంచి పాత ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో టౌన్ హాల్ వరకు ప్రతిపక్ష నేతలు కాగడ మార్చ్ నిర్వహించారు. అయితే శాంతి భద్రతల సమస్యలను పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు అనుమతిని నిరాకరించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 144 ఆంక్షలు విధించారు. వేదిక వద్దకు వెళ్లకుండా ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కొంత మంది నేతలను వాహనాల్లోకి కుక్కి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ సహా పలువురు ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నినాదాల హోరెత్తించారు. నియంతకు తాము భయపడమని నేతలు పేర్కొన్నారు.

40 శాతం టికెట్లు యువతకే

కష్టపడినవారికి పార్టీలో గుర్తింపు

- 42 పార్లమెంటు కేంద్రాల్లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు: టీడీపీ పొలిట్‌బ్యూరో తీర్మానం
- పార్టీని మరింత బలోపేతం చేస్తాం: చంద్రబాబు
- జగన్‌ది హీనచరిత్ర: అచ్చెన్నాయుడు
- 119 నియోజకవర్గాల్లో పోటీ: కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో 40 శాతం టికెట్లు యువతకు ఇవ్వాలని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. కష్టపడేవారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ జాతీయ అధినేత ఎన్.చంద్రబాబునాయుడు అధ్యక్షతన పొలిట్‌బ్యూరో భేటీ జరిగింది. దీనికి తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, ఏపీ శాఖ అధ్యక్షులు అచ్చెన్నాయుడుతోపాటు పొలిట్‌బ్యూరో ...9లో

నవచిత్రం



త్రీడీలో థ్రిల్ చేసే శాకుంతలం

- దిల్ రాజు

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌరాణిక ప్రేమకథా చిత్రం 'శాకుంతలం'. సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 14న రిలీజ్ అవుతుంది. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 3డీ టెక్నాలజీతో విజువల్ వండర్‌గా తెలుగు, హిందీ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. మంగళవారం త్రీడీ ట్రైలర్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, 'ఈ సినిమాను 3డీ టెక్నాలజీలోకి మార్చాలనే ఆలోచన దిల్‌రాజుదే. ఇప్పుడు త్రీడీ ట్రైలర్ చూస్తుంటే ఆయన ఆలోచన ఎంత గొప్పదో అర్థమవుతుంది. మన మైథాలజీని ఇలా త్రీడీలో సినిమా చేయటం ఇదే తొలిసారి అనుకుంటా. ఏప్రిల్ 14 కోసం ఎగ్జయిట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నాను' అని అన్నారు. 'ఇప్పుడు తెలుగు సినిమా గ్లోబల్ రేంజ్‌కు చేరుకుంది. తెలుగు సినిమాలను ఇంకా ప్రపంచానికి చూపిస్తూ ఉండాలనే ఉద్దేశంతో నేను వేసిన మొదటి అడుగు 'శాకుంతలం'. బ్యూటీఫుల్ ఫ్యామిలీ డ్రామా.. విజువల్ వండర్‌గా సినిమా తెరెక్కింది. ఓ థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే సినిమా. ఈ సమ్మర్‌లో మా సినిమాని మీ ముందుకు తీసుకొస్తున్నాం. సినిమా చూసి బయటకొచ్చేటప్పుడు అల్లు అర్హ రూపంలో ఓ సర్‌ప్రైజ్ ఉంటుంది' అని దిల్‌రాజు చెప్పారు. దర్శకుడు గుణ శేఖర్ మాట్లాడుతూ, "ఇది సమంత 'శాకుంతలం'. ఆమె ప్రాణం పెట్టి శకుంతల పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేశారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని విజువల్‌గా మీ ముందుకు తీసుకొచ్చే క్రమంలో లింకుల కోసం చిన్న చిన్న ఇంప్రవైజేషన్ చేశాం తప్ప.. దాదాపు 90 ఒరిజినల్ కథనే సినిమాగా తీశాం. దిల్‌రాజు ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత. పైగా ఆడియెన్స్ పల్స్ తెలిసిన నిర్మాత. ఆయన్ని వాడుకోవాల్సిన అవసరం మాకు ఉంది. అలాంటి ఆయన్ని వాడుకోకపోతే మా మూర్ఖత్వం అవుతుంది' అని అన్నారు.

సమంత

అబ్బాయిలంటే పడని పాత్ర



అతుల్య రవి

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 7న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో హీరోయిన్ అతుల్య రవి మీడియాతో మాట్లాడుతూ, "'మీటర్'తో తెలుగు పరిశ్రమలోకి రావడం, మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ లాంటి ప్రముఖ సంస్థలు నిర్మిస్తున్న సినిమాలో అవకాశం దక్కడం చాలా హ్యాపీగా ఉంది. కథ చెప్పినప్పుడే చాలా నచ్చింది. ఇందులో నా పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అబ్బాయిలు అంటే ఇష్టం లేని పాత్ర నాది. చాలా సీరియస్‌గా ఉంటుంది. అయితే అందులో నుంచే కామెడీ జనరేట్ అవుతుంది. ఇది పక్కా కమర్షియల్ మూవీ అయినప్పటికీ ఇందులో అద్భుతమైన ఎమోషన్స్ కూడా ఉన్నాయి. పాటలు, డ్యాన్సులు కూడా బావుంటాయి. మాస్ ఫైట్స్, రొమాన్స్, లవ్‌తో పాటు ఫాదర్ సెంటిమెంట్ కీలకంగా ఉంటుంది. హీరో కిరణ్, నాకు ఉన్న కాంబినేషన్ సీన్స్ చాలా సరదాగా ఉంటాయి. సినిమాల పరంగా ఫీల్ గుడ్ లవ్ స్టోరీస్, రస్టిక్ సినిమాలు, ప్రయోగాత్మక పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం తమిళ్‌లో హరీష్ కళ్యాణ్‌తో 'డీజిల్' సినిమా చేస్తున్నా' అని తెలిపింది.

పిల్లలపై చదువు ఒత్తిడి పెరిగితే..?

షర్మన్ జోషి, శ్రియా శరణ్, షాన్, సుహాసిని మూలే, ప్రకాష్ రాజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. ఇళయరాజా సంగీత సారథ్యం వహిస్తున్న ఈ మల్టీ లింగ్వువల్ మ్యూజికల్ మూవీ మే 12న రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుతో కలిసి మేకర్స్ ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, 'ప్రస్తుతం పిల్లలపై ఎడ్యుకేషన్ సిస్టమ్ వల్ల ఎంత

'మ్యూజిక్ స్కూల్'లో ఒక దృశ్యం



ప్రెషర్ పడుతుందనేది తెలియజేసే చిత్రమే ఇది. ఇదొక సీరియస్ పాయింట్ కానీ దాన్ని వినోదాత్మకంగా, మ్యూజికల్ ఫిల్మ్‌గా చేశారు పాపారావుగారు. ఇళయరాజా సంగీతం అందించిన 11 పాటలతో ఇదొక మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా అలరించనుంది. ఈ సినిమాను తెలుగులో మేం, మిగతా నేషనల్ వైడ్ పి.వి.ఆర్ వాళ్లు రిలీజ్ చేస్తున్నారు' అని తెలిపారు.
ఐఏఎస్ ఆఫీసర్, సినిమా అంటే ప్యాషన్ ఉన్న పాపారావు బియ్యాల ఈ చిత్రం దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన మాట్లాడుతూ, 'పిల్లలపై చదువు పేరుతో ఒత్తిడిని పెంచేస్తున్నారు. దీని వల్ల వారిలో అభివృద్ధి జరగటం లేదు, సరి కదా అదే వారి ఎదుగుదలకు సమస్యగా మారుతోంది అని చెప్పే ప్రయత్నమే ఈ సినిమా' అని చెప్పారు. యామిని ఫిల్మ్స్ బ్యానర్‌పై హిందీ, తెలుగులో చిత్రీకరించి ఈ చిత్రాన్ని తమిళలో అనువాదం చేశారు.

మనోలో రాజీనామా

- హైదరాబాద్ ఎఫ్‌సీతో మూడేండ్ల బంధానికి తెర
- కొత్త కోచ్ అన్వేషణలో హెచ్ఎఫ్‌సీ

నవతెలంగాణ-హైదరాబాద్



భారత ఫుట్‌బాల్ కేంద్రంగా స్వర్ణ యుగం చూసిన హైదరాబాద్‌కు.. సాకర్‌లో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ కృషి ఎనలేనిది!. ఇక మూడేండ్లుగా హైదరాబాద్ ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా మనోలో మార్క్వెజ్ (స్పెయిన్) దక్కన్ టైగర్స్‌ను ఐఎస్ఎల్‌లో బలమైన జట్టుగా నిలిపారు. 2021-22 సీజన్ ఐఎస్ఎల్ చాంపియన్‌ను హైదరాబాద్ ఎఫ్‌సీ నిలిచింది. ఈ ఏడాది ఐఎస్ఎల్ సీజన్లో సెమీఫైనల్స్‌కు చేరుకుని నిలకడ చూపించింది. మనోలో మార్క్వెజ్ శిక్షణ సారథ్యంలో హైదరాబాద్ ఎఫ్‌సీ అగ్రజట్టుగా రూపుదిద్దుకుంటున్న క్రమంలో.. ఫ్రాంచైజీతో బంధానికి మనోలో మార్క్వెజ్ తెరదించారు. ఈ సీజన్లో సూపర్ కప్ అనంతరం హైదరాబాద్ ఎఫ్‌సీ డ్రెస్సింగ్‌రూమ్‌ను వీడనున్నట్టు మనోలో మార్క్వెజ్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎఫ్‌సీ యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇక ఏడాది సీజన్ ఆఖరులో సూపర్ కప్‌లో పోటీపడే హైదరాబాద్ ఎఫ్‌సీకి మనోలో చీఫ్ కోచ్‌గా కొనసాగనున్నారు. ఏప్రిల్ 8-25 వరకు కేరళలో జరిగే సూపర్ కప్‌లో విజయం సాధిస్తే.. ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య కాంటినెంటల్ టోర్నీకి అర్హత సాధించే అవకాశం ఉంది. దీంతో హైదరాబాద్ సహా ఇతర ఐఎస్ఎల్, ఐ-లీగ్ జట్లు సూపర్ కప్‌పై ఇప్పుడు దృష్టి నిలిపాయి.

ఫిబ్రవరిలోనే నిర్ణయం

2022-23 ఐఎస్ఎల్ సీజన్‌లో హైదరాబాద్ రాణించింది. లీగ్ దశలో అగ్రస్థానం కోసం చివరి వరకు పోటీలో నిలిచింది. క్వాలిఫయర్స్‌తో సంబంధం లేకుండా నేరుగా సెమీఫైనల్స్‌కు చేరుకుంది. అయినా, మనోలో మార్క్వెజ్ హైదరాబాద్ ఎఫ్‌సీ వీడాలనే నిర్ణయాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే తీసుకున్నారు. 'హెచ్ఎఫ్‌సీ తరఫున మనోలో మార్క్వెజ్ మూడు సీజన్లు అద్భుతంగా పని చేశారు. హెచ్ఎఫ్‌సీలో ప్రతి ఒక్కరి తరఫున మనోలోకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. హెచ్ఎఫ్‌సీని ఐఎస్ఎల్‌లోనే అగ్రజట్టుగా నిలిపాడు మనోలో' అని హెచ్ఎఫ్‌సీ యాజమాని వరుణ్ త్రిపురనేని అన్నారు. రాజీనామా నిర్ణయాన్ని మనోలో మాకు ఫిబ్రవరి ఆరంభంలోనే తెలియజేశారు. క్లబ్ పట్ల మనోలో అంకితభావం ఎనలేనిది. ముందుగా తెలియజేయటంతో కొత్త కోచ్ అన్వేషణకు తగిన సమయం ఉండేలా జాగ్రత్త వహించారు. క్లబ్ పట్ల మనోలోకు ఉన్న గౌరవం అదని వరుణ్ తెలిపారు. 'హైదరాబాద్ తరఫున మూడు అద్భుత సీజన్లు పని చేయటం గొప్పగా ఉంది. క్లబ్‌లో సహకరించిన అందరికీ ధన్యవాదాలు. అయినా, ఈ ఏడాది సీజన్ ఇంకా ముగియలేదు. సూపర్ కప్‌లో హెచ్ఎఫ్‌సీ టైటిల్ కొట్టేలా ప్రణాళిక చేస్తున్నామని' మనోలో మార్క్వెజ్ పేర్కొన్నారు.

గోవా ఎఫ్‌సీకి మనోలో?

స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్ యూరోప్‌లో పలు ఫుట్‌బాల్ క్లబ్‌లకు పని చేశారు. మూడేండ్ల క్రితం హైదరాబాద్ ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా పని చేసేందుకు భారత్‌కు వచ్చారు. తొలి సీజన్లో అంచనాలు అందుకోకపోయినా.. కోచ్‌గా రెండో సీజన్లోనే టైటిల్ పట్టారు. ఫ్రాంచైజీ, కోచ్ ఇద్దరూ విడిపోయేందుకు అంగీకారానికి వచ్చినట్టు తెలుస్తోంది. హెచ్ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా యువ ఆటగాళ్లను మేటి ప్లేయర్లుగా తీర్చిదిద్దిన మనోలో మార్క్వెజ్ కోసం ఐఎస్ఎల్ ఫ్రాంచైజీ గోవా ఎఫ్‌సీ మంచి ఆఫర్ సిద్ధం చేసినట్టు సమాచారం. గోవా ఎఫ్‌సీతో పాటు ఇతర క్లబ్‌లు సైతం మనోలోకు ఆకర్షణీయ కాంట్రాక్టు ఆఫర్ చేయగా.. సూపర్ కప్ అనంతరం మనోలో కొత్త ఇన్నింగ్స్ వివరాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది.

ఆటలు

సింధుపైనే ఫోకస్!

స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



మాడ్రిడ్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటుంది. ఈ ఏడాది బరిలో నిలిచిన నాలుగు టోర్నీల్లోనూ తేలిపోయిన సింధు.. తాజాగా మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్‌లో మెరిసేందుకు సిద్ధమవుతోంది. ఇండియా ఓపెన్, మలేషియా ఓపెన్, ఆల్ ఇంగ్లాండ్, స్విస్ ఓపెన్‌లో సింధు అంచనాలను అందుకోలేదు. స్విస్ ఓపెన్‌లో ఏకంగా అనామక షట్లర్ చేతిలో పరాజయం పాలైంది. చీలమండ గాయంతో నిరుడు ద్వితీయార్థం సీజన్‌కు పూర్తిగా దూరమైన సింధు.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినా.. కోర్టులో మునుపటి దూకుడు కనిపించటం లేదు. మహిళల సింగిల్స్ విభాగంలో స్విట్జర్లాండ్ షట్లర్‌తో నేడు సింధు తలపడనుంది. ఇటీవల సింధుపై విజయాలు సాధించిన కుసుమ, బ్లిచ్‌ఫిట్‌లు సెమీస్‌కు ముందు సవాల్ విసరనున్నారు. పేలవ ఫామ్‌తో 2016 తర్వాత తొలిసారి డబ్ల్యూబీఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు కోల్పోయిన పి.వి సింధు మాడ్రిడ్‌లో మెరవటంపైనే దృష్టి నిలిపింది. మెన్స్ సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్, బి. సాయి ప్రణీత్ టైటిల్ ఆశలు పెట్టుకోగా.. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ, మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలీ, గాయత్రి పుల్లెల నేడు తొలి రౌండ్ మ్యాచుల్లో బరిలోకి దిగనున్నారు. ఇక వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీకి సైతం దూరమైంది.

రష్మిక, తమన్నా స్టెప్పులతో..!

ఐపీఎల్16 ఆరంభ వేడుకలకు సినీ గ్లామర్



ముంబయి : మూడేండ్ల విరామం అనంతరం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పాత పద్ధతిలో జరుగుతోంది. పది జట్ల అభిమానులు ఐపీఎల్ వినోదం సొంత వేదికల్లో మళ్లీ వీక్షించనున్నారు. దీంతో ఐపీఎల్ 2023 ఆరంభ వేడుకలకు బీసీసీఐ భారీ ప్రణాళికలు రచిస్తోంది. అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో గురువారం (మార్చి 30) సాయంత్రం 6.30 గంటల నుంచే సందడి షురూ కానుంది. పుష్ప ఫేం రష్మిక మందన, బాహుబలి ఫేం తమన్నా భాటియాలు ఈ ఏడాది ఆరంభ వేడుకల్లో నృత్య ప్రదర్శన చేయనున్నారు. ఆరంభ వేడుకలను విజువల్ వండర్‌గా నిర్వహించేందుకు బోర్డు అన్ని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఐపీఎల్ 2023 12 వేదికల్లో 52 రోజుల పాటు జరుగనున్న సంగతి తెలిసిందే.



జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ ప్యాడ్లర్లు మహ్మద్ అలీ, వాన్ష్ సింఘాల్ జోడీ సిల్వర్ మెడల్ గెల్చుకుంది. సిల్వర్ మెడలిస్టులను తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి నాగేందర్ రెడ్డి, కోచ్ సోమ్‌నాథ్ ఘోష్ అభినందించారు

రైళ్లపై రాళ్లేస్తే జైలుకే...

- అలాంటి పనులు చేయకండి :దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నడిచే రైళ్లపైకి రాళ్లు విసరడం విజ్ఞత కాదనీ, ఇలాంటి ఆకతాయి చర్యలకు పాల్పడిన వారిని రైల్వే చట్టం ప్రకారం నేరుగా జైలుకు పంపిస్తామని దక్షిణ మధ్య రైల్వే హెచ్చరించింది. ఇలాంటి ఘటనల వల్ల ప్రయాణీకులకు తీవ్ర గాయాలవుతాయనీ, రైల్వే ఆస్తులకూ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఎవరూ ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ వద్దంటూ ప్రజలకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) విజ్ఞప్తి చేసింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లపై రాళ్ల దాడి శిక్షార్హమైనదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే నేరస్తులపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 ప్రకారం ఐదేండ్లు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట - ఖమ్మం, కాజీపేట - భువనగిరి, ఏలూరు - రాజమండ్రి రూట్లలో 9 ప్రాంతాల్లో వందే భారత్ రైళ్లపై దుండగులు రాళ్ల దాడులు చేశారని గుర్తుచేశారు. ఈ పరిస్థితులు రైళ్ల రీషెడ్యూల్‌కు దారితీశాయనీ, ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారనీ తెలిపారు. ఈ ఘటనల్లో రైలులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణీకుల తలలకు రాళ్లు తగిలి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ఈ ఘటనలకు పాల్పడిన 39 మంది నేరస్తులను గుర్తించి, అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు. ఈ ఘటనల్లో 6 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు కూడా ఉన్నారనీ, తల్లిదండ్రులు ఈ విషయాలను గ్రహించాలని సూచించారు. అటువంటి సంఘటనలను చూసిన వ్యక్తులు 139కి డయల్ చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ విజ్ఞప్తి చేశారు. పెద్దలు తమ పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలనీ, చిన్నపిల్లల చేష్టల కారణంగా తీవ్ర పరిణామాల గురించి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

విధానాలు మార్చుకుంటారా...

మూల్యం చెల్లించుకుంటారా...!

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హెచ్చరిక

- పెండింగ్ బిల్లులన్నీ 31లోగా విడుదల చేయాల్సిందే
- ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ధర్నా చేయడం సిగ్గుచేటు : యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యుల ఆగ్రహం




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలివ్వకపోవడం, ఈ-కుబేర్‌లో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉండడం ప్రమాదకరమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. వారి కడుపుమండే బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ దిశగా విధానాలను మార్చుకుంటారా? లేదంటే తగిన మూల్యం చెల్లించుకుంటారా?అని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. ఎయిడెడ్ జీతాలు, పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ఎన్నో పథకాలకు రూ.వేల కోట్లు కేటాయించే ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.300 నుంచి రూ.500 కోట్లు కేటాయించలేకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఆ బిల్లుల చెల్లింపుల కోసం బడ్జెట్ ఉన్నప్పటికీ గత మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు ఇవ్వక పోవటం సిగ్గుచేటని విమర్శించారు. ధనిక రాష్ట్రమనీ, ఉద్యోగులకు అత్యధిక జీతాలిస్తున్నామనీ పదే పదే చెప్పే పాలకులు సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్ క్లైములు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు వంటి బిల్లులన్నీ నెలల తరబడి మంజూరు చేయకపోవటం వల్ల ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మరో పిఆర్సీ గడువు సమీపిస్తున్నా 18 వాయిదాల్లో ఇస్తామన్న రెండు నెలల గత పీఆర్సీ బకాయిలు 11 నెలలు గడిచినా కేవలం మూడు, నాలుగుకు మించి జమ కాలేదని చెప్పారు. మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ట్రెజరీల్లో పాసైన అన్ని బిల్లులకు సంబంధించిన నగదును ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆర్థిక శాఖ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుందనీ, బిల్లులు పెండింగ్‌లో లేకుండా నిర్దిష్ట విధానం రూపొందించాలనీ డిమాండ్ చేశారు. వచ్చేనెల 11న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై స్టే ఎత్తేసి చేపట్టాలని సూచించారు. లేదంటే ఉపాధ్యాయ నియామకాలపై ప్రభావం పడుతుందన్నారు. జీతాల ఆలస్యం, బిల్లుల పెండింగ్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ గొంతెత్తాలనీ, ఐక్యంగా పోరాడాలనీ ఆయన పిలుపునిచ్చారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ముత్యాల రవీందర్, ఎం సోమయ్య, ఎస్ యాదగిరి, వై విజయకుమార్, ఎస్ హరికృష్ణ, బి కొండయ్య, నజీర్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి కృష్ణమూర్తి మాట్లాడుతూ ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని విమర్శించారు. ఎయిడెడ్ టీచర్లకు మూణ్నెల్లుగా జీతాలివ్వకుంటే ఆ కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఉపాధ్యాయులూ మనుషులేననీ, వారి అవసరాలు తీర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద నెలల తరబడి పెండింగులో ఉన్న బిల్లులన్నీ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాలని డిమాండ్ కోరారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు భద్రయ్య, వివిధ జిల్లాల నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూఎస్‌పీసీ డిమాండ్లు :

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే వేతనాలివ్వాలి.
- ఎయిడెడ్ టీచర్లకు మూడు నెలలుగా బకాయి పడిన వేతనాలను వెంటనే విడుదల చేయాలి.
- ట్రెజరీల్లో పాసై ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్న సప్లిమెంటరీ వేతనాలు, పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు,మెడికల్ రీయింబర్స్‌మెంట్, సెలవు వేతనాలు,పెన్షనరీ బకాయిలు, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్ క్లైములు తదితర బిల్లులన్నీ ఈనెల 31లోగా విడుదల చేయాలి.



మోడీదంతా ప్రచారమే..

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.
స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బీజేపీ లేదు కానీ దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ఉందన్నారు. దానికి హిందూ, ముస్లింల మధ్య ఘర్షణ పెట్టాలని తప్ప ఏనాడూ ఉద్యమంలో పాల్గొనాలన్న ధ్యాస లేదన్నారు. ఫ్యూడల్, వెట్టి చాకిరీ, భూస్వామ్య పాలన నుంచి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం జరిగిందన్నారు. ఆ విప్లవ పోరాటంలో పాల్గొన్న దుంపల మల్లారెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. 1947 తర్వాత కర్ణాటకలో మత ఘర్షణలకు కారణం ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. ఆర్ఎస్ఎస్‌కు పుట్టిన బిడ్డ బీజేపీ నాడు కర్నాటక రాష్ట్రంలో చేసిన విధంగానే నేడు దేశవ్యాప్తంగా మతకల్లోలం సృష్టించాలని చూస్తోందన్నారు. ఎనిమిదేండ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వాన్ని నడిపింది ఆర్ఎస్ఎస్ అని చెప్పారు. మైనార్టీలపై దాడులు చేస్తే హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. బీజేపీ పాలను చూసి ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలుస్తుందన్నారు.
మేకిన్ ఇండియా ప్రభుత్వాన్ని తీసుకొస్తానని చెప్పి చైనా నుంచి, విదేశాల నుంచి పెద్దఎత్తున సరుకులను దిగుమతి చేసుకున్న ఘనత మోడీదేనని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ.. అదానీ లాంటి వారికి దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం వెనుక మోడీ కుట్ర ఉందన్నారు. ఇలాంటి కుట్రలు ఎప్పటికప్పుడూ సీపీఐ(ఎం) ఎండగడుతుందని చెప్పారు. దేశంలో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో మోడీ తన జేబు సంస్థలతో భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాహుల్ గాంధీ విషయంపై స్పందించడం అభినందనీయమన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ కవిత విషయంలో స్పందించలేదన్నారు. గవర్నర్ కేటీఆర్, కేసీఆర్‌పై ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. ఫాసిస్టు విధానాలతో వస్తున్న మోడీని అడ్డుకోవాలంటే ప్రతిపక్షాలన్నీ ఐక్యం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ మాత్రమే పని చేస్తుందని, కాంగ్రెస్ తన స్థాయికి తగ్గ పోరాటం చేయడం లేదని అభిప్రాయపడ్డారు.

అవినీతి పాలనపై సమర శంఖం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

మోడీ అవినీతి పాలనపై సమర శంఖం పూరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్కీం వర్కర్లు తమ డిమాండ్లను, హక్కులను అడుగుతుంటే పరిష్కరించకుండా మోడీ ముసి ముసి నవ్వులు నవ్వుతున్నారని విమర్శించారు. అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు నిధుల కోత పెట్టారన్నారన్నారు. ఐకేపీ, వీఏఓ స్కీం వర్కర్ల వ్యవస్థను రద్దు చేయడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆర్టీసీ లాంటి సంస్థలను నిర్వీర్యం చేయడానికి రవాణా రంగంలో కొత్త చట్టాలు తెచ్చారన్నారు. ఆదిలాబాద్ ప్రారంభమైన ఈ యాత్రలో వేలాదిమంది తమ వినతిపత్రాలు అందజేశారన్నారు. బీజేపీ ఎంపీ సోయం బాపూరావు, బండి సంజయ్, అరవింద్ ఎన్నో మాటలు చెప్పారు తప్ప అమలు చేయలేదని విమర్శించారు. లౌకిక వాదం, సామాజిక వాదం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి ప్రసంగించారు. ఈ యాత్రకు సీపీఐ, బీఎస్పీ మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జన చైతన్య యాత్ర బృందం సభ్యులు జయలక్ష్మి, లెల్లెల బాలకృష్ణ, స్కైలాబ్ బాబు, పైళ్ల ఆశయ్య, జగదీష్, అడివయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విత్‌హెల్డ్‌లో బీబీసీ పంజాబ్ న్యూస్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తితో బీబీసీ పంజాబ్ న్యూస్ ఖాతాను ట్విట్టర్ విత్‌హెల్డ్‌లో ఉంచింది. ఈ విషయాన్ని ఒక ప్రముఖ మీడియా సంస్థ వెల్లడించింది. అయితే ట్విట్టర్ సంస్థ దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు.



ఇబ్రహీంపట్నం గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

పేదవారి నిఖార్సైన జెండాను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలి : జనచైతన్య యాత్రలో తమ్మినేని వ్యాఖ్యలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ సాదాసీదా పార్టీ కాదనీ, సమాజాన్ని శతాబ్దాలకాల వెనక్కి తీసుకుపోయేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కేంద్రంలో బీజేపీ సర్కారు బీసీ గణన విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని పార్టీలు బీసీ గణన అడుగుతుంటే, ఆ పార్టీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కావాలంటే, వారి సంఖ్య తేలాల్సిందేనన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో తమ్మినేని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు బీజేపీ వ్యతిరేకమైనదన్నారు. అందుకే మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కులాలను అణగద్రొక్కేందుకు బ్రాహ్మణాధిపత్య వ్యవస్థను స్థాపించాలని కలలు కంటున్నదనీ, అటువంటి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. దేశంలోని సర్వమతాలు అన్నదమ్ముల్లా బతుకుంటే, వారి మధ్య అగ్గిరాజేసి రాజకీయ లబ్ధిపొందుతున్నదని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను, విలువలను ధ్వంసం చేస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా రాజ్యాంగం పరమ చెత్త అంటూ ఆర్ఎస్ఎస్, బీజేపీ వ్యాఖ్యానిస్తున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం గడ్డపై ఈసారి ఎర్రజెండా ఎగరాలని చెప్పారు. అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి గడప తొక్కాలని సూచించారు. పేదవారి నిఖార్సైన జెండాను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రతి కార్యకర్త పనిలో ఉండాలి... ప్రతి గడప తొక్కాలి

ఏ ఒక్క హామీని బీజేపీ నెరవేర్చలేదు : మల్లు లక్ష్మి



గత ఎన్నికల్లో దేశ ప్రజలకు బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి విమర్శించారు. ఆపార్టీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాల్లో పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్యాస్‌బండ ధర రూ 410 ఉంటే, బీజేపీ వచ్చాక రూ 1250కి పెరిగిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఏకాభిప్రాయం లేదనే సాకుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, మధుసూధన్‌రెడ్డి, జగదీష్, నాయకులు పి.జంగారెడ్డి, రాంచందర్, కందుకూరి జగన్, అంజయ్య, కవిత, ఆలంపల్లి నర్సింహ్మా, రవికుమార్, మంచాల మండల కార్యదర్శి శ్యాంసుందర్, అరుట్ల గ్రామ కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక ప్రధాని గతే మోడీకి..

మోడీవి అచ్చేదిన్ కాదు చచ్చే దిన్

- రైతు ఉద్యమాల వల్లే నల్ల చట్టాలు వెనక్కి
- ఎర్రజెండా ద్వారానే దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జుకృష్ణన్



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి (పరిపూర్ణం)/ వనపర్తి

ప్రజా పోరాటాలను కాలదన్నిన శ్రీలంక ప్రధానికి పట్టిన గతే మోడీకి పట్టడం ఖాయమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జు కృష్ణన్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన చైతన్య యాత్ర మూడోరోజు మంగళవారం గద్వాల నుంచి వనపర్తి, నాగర్‌కర్నూల్ కల్వకుర్తి పట్టణాల మీదుగా జరిగింది. వనపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి విజ్జు కృష్ణన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా డిపో రోడ్డులో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి యం.డి. జబ్బార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో విజ్జు కృష్ణన్ ప్రసంగించారు. మోడీ అధికారంలోకి వస్తే అత్యధిక ఉద్యోగాలు ఇస్తామని నమ్మించారని తెలిపారు. అనేక వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మురిపించి గద్దెనెక్కిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేడు హామీలు మరిచి మతతత్వ రాజకీయాలకు తెర లేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 ఏండ్ల కిందట గ్యాస్ ధర రూ.450 రూపాయలుంటే నేడు 1200కు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 ఉన్న లీటర్ పెట్రోల్ ధర నేడు వంద రూపాయలు దాటిందని చెప్పారు. దేశంలో చాలా మంది ఆసక్తి చూపే ఆర్మీ ఉద్యోగంలోనూ కాంట్రాక్టు వ్యవస్థ తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. గిట్టుబాటు ధర కావాలంటే స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చి రైతుల నడ్డివిరిచే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పెద్దఎత్తున దేశ వ్యాప్త ఉద్యమం చేసి ఆ నల్ల చట్టాలను రద్దు చేయించి మోడీ చేత క్షమాపణ చెప్పించిన ఘనత ఈ దేశ రైతులకే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా నాణ్యమైన వైద్యం అందించి లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఘన చరిత్ర కేరళ రాష్ట్ర ప్రభుత్వానిదని వివరించారు. ఆ సమయంలో 20 రకాల నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు ఇంటింటికీ తిరిగి ఉచితంగా అందించామన్నారు. నేడు ఎర్రజెండా ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మసీదులను కూల్చేందుకు బీజేపీ పలుగు, పార పట్టుకుని తిరుగుతది : పోతినేని



బీజేపీ అధికారంలోకి వస్తే మసీదులను కూల్చేందుకు పలుగు, పార పట్టుకుని తిరుగుతారని జనచైతన్య యాత్ర రథసారధి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ హెచ్చరించారు. రాష్ట్రంలో ఆపార్టీకి అధికారం లేక పోయినా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం గుమ్మటాలను కూల్చేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. అయితే మతోన్మాదం గురించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు చెప్పాల్సిన పనిలేదనీ, ఎందుకంటే పార్టీ నేతలు పాషా, నరహరిని బలితీసుకున్నదని మతోన్మాదులేనని గుర్తు చేశారు. ఒక్క అవకాశం ఇవ్వాలంటూ బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అంటున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే మసీదులను కూలగొట్టి కింద లింగాలొస్తాయో, శవాలు వస్తాయో చూస్తామంటున్నారని చెప్పారు. లింగాలు వస్తే ముస్లింలు ఆలయాలను కూల్చేశారని చెప్పేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. అటువంటి ముర్ఖులను రాష్ట్రం నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి ప్రజల ఆస్తులను, ప్రజా స్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు.

పేదలకు ఒక్క ఇల్లైనా ఇచ్చారా?

తెలంగాణలోని బీజేపీ నాయకులకు దమ్ము.. ధైర్యం ఉంటే నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పేదలకు ఒక్క ఇల్లునైనా తీసుకొచ్చి ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ డిమాండ్ చేశారు. దేశంలో 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ మతోన్మాద, కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ యాత్ర కొనసాగుతోందన్నారు. తొమ్మిదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎంతమందికి ఇండ్లు నిర్మించి ఇచ్చిందని ప్రశ్నించారు. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక కార్మికులను దోచి పెద్దలకు పంచుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్న రాష్ట్రాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు దాడులకు తెగబడుతున్నాయన్నారు. దేశంలో కార్మికవర్గంపై దాడి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, రమ, వెంకట్‌రాములు, భూపాల్, అరుణజ్యోతి, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు ధర్మానాయక్, విజయ్, సోమన్న, ఆంజనేయులు, బాల్ రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డప్పులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కళారూపాలు ప్రదర్శించారు. ప్రతిచోటా జాత బృందానికి ఘనంగా స్వాగతం పలికారు.



అత్యాశే కొంప ముంచింది

(మొదటిపేజీ తరువాయి)

మరికొందరికి పేపర్ విక్రయించినట్టు తెలిసింది. మంగళవారంతో నిందితుల కస్టడి ముగియడంతో వైద్యపరీక్షల అనంతరం నలుగురిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో మరో ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ముగ్గ్రోజుల విచారణలో నిందితులిచ్చిన వివరాలపై దృష్టి సారించిన అధికారులు మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

కీలక విషయాలు వెలుగులోకి..

పేపర్ లికేజీ కేసులో ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, రాజేశ్వర్‌ను మూడో రోజు విచారణలో భాగంగా మంగళవారం ఉదయం పోలీసులు సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. వీరు ఎంతమందికి పేపర్ అమ్మారనే విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో రేణుక, డాక్యా నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు అత్యధికంగా ప్రశ్నాపత్రాలు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఇదిలావుండగా, మేడ్చల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేతావత్ శ్రీనివాస్ ద్వారా గోపాల్, నీలేష్ రేణుకకు పరిచయమయ్యారు. వారికి నీలేష్ సోదరుడు రాజేంద్రనాయక్ డబ్బులు సమకూర్చాడు. ముందుగా ఇద్దరు అభ్యర్థులు కలిసి రూ.20లక్షలు చెల్లించే విధంగా రేణుకతో ఒప్పందం చేసుకున్నారు. కానీ, ఒకరు రూ.9లక్షలు చెల్లించగా, మరో అభ్యర్థి రూ.4.50లక్షలు చెల్లించినట్టు దర్యాప్తులో తేలింది. వారినుంచి మొత్తం రూ.13.50లక్షలు తీసుకున్న రేణుక అందులో నుంచి ప్రవీణ్‌కు రూ.10లక్షలు చెల్లించి ఏఈ పేపర్స్‌ను తీసుకుంది. అయితే, సులువుగా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించొచ్చని ఆశపడిన ఆమె భర్త డాక్యానాయక్ మాత్రం చాలా మందికి ప్రశ్నాపత్రం విక్రయించినట్టు అధికారుల విచారణలో తేలినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీలో పనిచేసే కొంత మంది సిబ్బందితోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురికి రహస్యంగా ప్రశ్నాపత్రాలను విక్రయించినట్టు గుర్తించిన అధికారులు వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో మరో ముగ్గురిని అరెస్టు చేశారు.

ముగ్గురికి ఐదురోజుల కస్టడీ

ఈ కేసులో మరో ముగ్గురికి ఐదు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. కమిషన్ ఉద్యోగులైన షమీమ్, రమేష్, సురేషను విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని గుర్తించిన సిట్ అధికారులు వారిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. అయితే, కోర్టు వారిని ఐదురోజుల కస్టడీకి అనుమతించింది. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని బుధవారం సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

ఒకే కాన్పులో నలుగురు పిల్లలు



నవతెలంగాణ - ముస్తాబాద్

ఒకే కాన్పులో ఒకరు ఇద్దరు పుట్టడం సహజం. కానీ నలుగురు జన్మించడం విశేషం. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పీపుల్స్ ఆస్పత్రిలో జరిగింది. తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్‌కు చెందిన గొట్టేముక్కల లావణ్యకు రెండో కాన్పులో నలుగురు పిల్లలు(ముగ్గురు మగ, ఒక ఆడపిల్ల) జన్మించారు. మొదటి నెల నుంచి కూడా పీపుల్స్ ఆస్పత్రిలోనే లావణ్యకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశామని వైద్యులు శంకర్, అఖిల, తేజస్వి తెలిపారు. పది లక్షల మందిలో ఒకరికి ఇలా ఒకే కాన్పులో నలుగురు జన్మించే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం నలుగురు పిల్లలను సిద్ధిపేటలోని పిల్లల ఆస్పత్రికి పంపించినట్టు తెలిపారు.

చరిత్రలేని పార్టీ బీజేపీ

- రాహుల్ అంటే మోడీకి భయం
- రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న మోడీ
- బీజేపీని ఓడించేందుకు కలిసొచ్చే వాళ్లకు మద్దతు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

చరిత్ర లేని చండాలపు పార్టీ బీజేపీ అని, ఆ పార్టీని గద్దె దించే వరకు కమ్యూనిస్టుల పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనబోమని ప్రకటించి బ్రిటీషోళ్లకు తొత్తులుగా వ్యవహరించి, దేశద్రోహానికి పాల్పడిన హీన చరిత్ర ఆర్ఎస్ఎస్, ఆనాటి హిందూ మహాసభదన్నారు. ఆ సంస్థల వారసులుగా ఉన్న బీజేపీకి జాతీయోద్యమ చరిత్ర లేదని తెలిపారు. ఆ సంస్థలను నడిపిన కేబీ హెడ్గేవార్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనొద్దని ప్రజలకు పిలుపు నివ్వగా సావర్కర్ క్షమాబిక్ష కోరిందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ అంటే మోడీకి భయం పట్టుకుందన్నారు. ఒక రాజకీయ వ్యాఖ్య చేసినందుకు కోర్టు రెండేండ్ల శిక్ష వేసిందని, ఎంపీగా అనర్హత వేటు వేశారని, అదే ప్రధాని మోడీ రాహుల్‌ను ఉద్దేశించి.. 'నీ జన్మ ఎక్కడా..? నీ తండ్రి ఎవరు..? గాంధీ అని ఎందుకు పెట్టుకున్నవ్.. నెహ్రూ అని ఎందుకు పెట్టుకోలేదు' అంటూ వ్యాఖ్యలు చేసినందుకు వందేండ్ల శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అదానీ అంటే మోడీకి పెంపుడు కొడుకని, అదానీ తప్పు చేయలేదని మోడీ నమ్మే దేవుళ్లపై ప్రమాణం చేసి చెప్పగలడా అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు, జాతి సంపదైన పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఎల్ఐసీ, బ్యాంకుల్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నాడని విమర్శించారు. అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ మిత్రులకు రూ.2 లక్షల కోట్ల పన్నులు మాఫీ చేసిన మోడీ, పేదల సంక్షేమానికి మాత్రం రూ.4 లక్షల కోట్లకు మించి ఖర్చు చేయట్లేదని తెలిపారు. లౌకిక, సమాఖ్య విధానాలు, సార్వభౌమత్వం వంటి రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ ధ్వంసం చేస్తుందని విమర్శించారు. పేదల కడుపుకొడుతున్న మోడీని ఓడించే వరకు కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని స్పష్టంచేశారు. బీజేపీని గద్దెదించేందుకు కలిసొచ్చే పార్టీలు, శక్తులకు మద్దతు ఇస్తామని తెలిపారు. అదే క్రమంలో రాష్ట్రంలో పేదల సమస్యలపైనా పోరాటాలు చేస్తామని చెప్పారు. మార్క్సిజం కాలం చెల్లిన సిద్ధాంతం కాదు కాలానికి దశ-దిశ చేసే సిద్ధాంతమని తెలిపారు. మనుషులున్నంత కాలం మార్క్సిజం ఉంటుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జిలాల్, మెదక్ జిల్లా కార్యదర్శి తాలిక్, నాయకులు యూసుప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మినీ మేడారం జాతర హుండీల లెక్కింపు

- వనదేవతల మొత్తం ఆదాయం రూ.1,02,60,605

నవతెలంగాణ -తాడ్వాయి

ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరిగిన మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందర్భంగా సందర్శకులు హుండీలో సమర్పించిన నిధులు, విలువైన బంగారం, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ, తదితరు కానుకలను మంగళవారం ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, రెవెన్యూ అధికారి సునీల్ ఆధ్వర్యంలో మేడారం ఎండోమెంట్ ఆవరణలో తాడ్వాయి కెనరా బ్యాంక్ శాఖ అధికారులు నేతృత్వంలో లెక్కించారు. సమ్మక్క వనదేవత హుండీ ఆదాయం రూ. 52,81,584. సారలమ్మ వనదేవత హుండీ ఆదాయం రూ. 46,34,211. పగిడిద్దరాజు హుండీ ఆదాయం రూ. 1,60,830. గోవిందరాజు హుండీ ఆదాయం రూ. 1,83,980. మొత్తం వనదేవతల ఆదాయం రూ.1,02,60,605. అమెరికా డాలర్లు 37, దినార్ 2 నోట్లు మొత్తం 39 విదేశీ కరెన్సీ నోట్లు, 15 తులాల బంగారం, సుమారు 8 కిలోల చిల్లర వెండి వచ్చినట్టు ఎండోమెంట్ ఈవో రాజేంద్రం ప్రకటించారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ సివిల్ పోలీసుల పహారా మధ్యలో భారీ బందోబస్తు నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతి, అధికారులు జగదీష్, రాజేశ్వరరావు, బాలకృష్ణ, మధు, రమా, రఘుపతి, వీరన్న, అధికారులు, రెవిన్యూ అధికారి సునీల్, పూజారులు, ఎండోమెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు మోడీ జీ..?

- ఉప్పల్‌లో ఐదేండ్లు దాటినా 40 శాతం పూర్తికాని ఎలివేటెడ్ కారిడార్ పనులు
- నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాని బొమ్మతో పోస్టర్లు



నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్‌లో ప్రధాని మోడీ పోస్టర్లు మరోసారి కలకలం సృష్టించాయి. వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ జాప్యంపై ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం ఎలివేటెడ్ కారిడార్ పనులకు 2018లో రూ.675 కోట్లతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల్లో పనుల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇప్పటికీ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో 'మోడీ గారు ఈ ఫ్లైఓవర్ ఇంకెన్ని సంవత్సరాలు కడతారు..? పని ప్రారంభం 5 మే 2018, 5 ఏండ్లు అయినా ఉప్పల్ ఫ్లై ఓవర్ 40 శాతం కూడా పూర్తి కాలేదు' అంటూ గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ఫ్లై ఓవర్ పిల్లర్లకు పోస్టర్లు అంటించారు. దాంతో ఈ పోస్టర్లు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇదిలా ఉండగా, ఈ నిర్మాణ పనులతో ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో జనం నిత్యం ఇబ్బందిపడుతున్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డుని ప్రక్షాళన చేయాలి

చెప్పులు కుడుతూ ఎస్ఎఫ్ఐ నిరసన



నవతెలంగాణ-కంఠేశ్వర్

టీ ఎస్ పీ ఎస్సీ పేపర్లను లీకేజీ చేసిన నిందితులను కఠి నంగా శిక్షించాలని, బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పులు కుడుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. బోర్డు నిర్లక్ష్యం వల్ల నాలుగు లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బోర్డు చైర్మెన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజ్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని కోరారు. పేపర్ల లీకేజీ జరిగి పది రోజులవుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం దుర్మార్గమని, తక్షణమే స్పందించి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం నెలకి రూ.20వేలు ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిస్వాల్ కమిటీ చెప్పిన ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వం నిలబడాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు నిరుద్యోగ భృతిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, నాయకులు వేణు, గణేష్, సాయి కిరణ్, రాహుల్, ఆశీర్వాదం, తదితర నాయకులు పాల్గొన్నారు.

కారుపై పడ్డ జేసీబీ.. ఇద్దరు మృతి

నవతెలంగాణ-భీంగల్

అప్పటి వరకు బంధువులతో సరదగా గడిపిన వారు.. ఊహించని ప్రమాదంలో మృత్యుఒడికి చేరుకున్నారు. ట్రాలిపై నుంచి ప్రమాదవశాత్తు జేసీబీ కారుపై పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్‌పేట్, మోర్తాడ్ మండలాలకు చెందిన వారు మంగళవారం భీంగల్ మండలంలోని బడా భీంగల్ ఎల్లమ్మ వద్ద మొక్కులు తీర్చుకుని విందు కార్యక్రమంలో పాల్గొని తిరిగి ప్రయాణమయ్యారు. భీంగల్ సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా భీంగల్ వైపు వస్తున్న ట్రాలీపై నుంచి జేసీబీ కారుపై పడటంతో అందులో ఉన్న రాజేశ్వర్ (35), రమ (30) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు అందులోనే ఇరుక్కున్నారు. విషయం తెలుసుకున్న భీంగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న వారిని అతికష్టం మీద బయటకు తీసి 108 ద్వారా నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజ్‌భరత్‌రెడ్డి.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతిచెందిన వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సంపాదకీయం

వెన్నంటిన కడుపులు

'మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు..?' యాంకర్ ప్రశ్న. 'నేను, అమ్మా, నాన్నా, ఇంకా మోడీజీ...' చిన్నారి సమాధనం.'ఔను మేలు చేసేవారు మన ఇంట్లోనే కాదు...గుండెల్లో ఉంటారు' అంటూ ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం గుప్పిస్తున్న ఇలాంటి ప్రకటనలు ఎంతటి హాస్యాస్పదమో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ పార్లమెంట్‌కు శనివారం లిఖితపూర్వకంగా

> నేటీ పరిస్థితికి, దేశ పాలకులకు 'ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకీల మోత...' సామెత సరిగ్గా సరిపోతుంది. మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు పేదోడికి ఒక పూట తిండి కూడా పెట్టడం లేదు. వారు ప్రకటనలో చెప్పినట్టు మోడీనే ప్రతి ఇంట్లో ఉంటే ఇలా ఎందుకుండేది? దేశ సంపదను కేంద్రం కార్పొరేట్లకు ధార పోస్తున్నదనేది జగమెరిగిన సత్యం. అప్పుల భారం తీర్చుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలను తన మిత్రులకు అప్పనంగా కట్టబెడుతున్నది. అక్కడి నుంచి తెచ్చిన డబ్బులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఒక వైపు దేశ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది.

ఇచ్చిన సమాధానం తేటతెల్లం చేస్తోంది. పౌష్టికాహార లోపాలున్న పిల్లలు భారతదేశంలోనే అధికంగా ఉండటం దేనికి సంకేతం. దేశంలో ఆరేండ్లలోపు పిల్లలు 22కోట్ల మంది ఉన్నారు. రాబోయే కాలంలో వివిధ రంగాల్లో సేవలు అందించే ఈ తరం ఆరోగ్యంపైనే దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజ పురోభివృద్ధి ఆధారపడి ఉంటుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో... అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో పౌష్టికాహార లోపం ఈ తరాన్ని తీవ్రంగా వేదిస్తోంది.

మిషన్ పోషన్ కింద 'పోషన్ ట్రాకర్' ప్రకారం ఫిబ్రవరిలో 5.6కోట్ల మంది చిన్నారుల్లో 43లక్షల మంది (7.7శాతం మంది) పోషకాహార లోపాన్ని కలిగి ఉన్నట్టు గుర్తించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) సమాచారాన్ని కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు. ఈ సమాచారం ప్రకారం... దేశంలోని ఐదేండ్లలోపు చిన్నారుల్లో పెరుగుదల సమస్యలున్నాయి. 35.5శాతం పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేదు. ఎత్తుకు తగిన బరువులేని వారు 19.3శాతం ఉంటే, అయిదేండ్లలోపు పిల్లల్లో 44.3శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ సర్వే నిర్వహించింది స్వయనా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖే కావడం గమనార్హం.



దేశంలోని మూడేండ్లలోపు పిల్లల్లో 47శాతం తక్కువ బరువుతో ఉన్నారని యునిసెఫ్ అంచనా. ప్రపంచంలోని మొత్తం పౌష్టికాహార లోపాలతో ఉన్న పిల్లల్లో మూడోవంతు మనదేశంలోనే ఉన్నారని యూనిసెఫ్ స్పష్టం చేస్తోంది. మరోవైపు ఆహార సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఈ పౌష్టికాహార సమస్యను మరింత జటిలం చేశాయని నివేదికలు చెబుతున్నాయి. పిల్లల్లోనే కాదు, తల్లుల్లో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని వివిధ అధ్యయనాలు తెలుపుతున్నాయి. దేశంలోని పిల్లల్లో 80శాతం, మహిళల్లో 56శాతం రక్తహీనతతో బాధపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. ఇతర అన్ని రంగాల్లో మాదిరిగానే పౌష్టికాహార లోపాల్లోనూ అణగారిన వర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వెనుకబడి ఉన్నారనేది వాస్తవం. వారిలోనే తక్కువ బరువున్న పిల్లలు 14 నుంచి 20శాతం అధికంగా ఉన్నారు. బాలికల్లో ఇంకాస్త ఎక్కువగా ఇది ఉంది. ఇది వారి పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.

ఆహార ద్రవ్యోల్బణం కూడా పౌష్టికాహార లోపాలకు కారణమవుతోంది. దేశంలోని 30శాతం కుటుంబాలు పెరుగుతున్న ధరల వల్ల ఆహార వినిమయాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది. భారత్‌లో 24శాతం పిల్లలు రోజంతా ఆహారం లేకుండా ఉంటున్నారని 'సేవ్ ది చిల్డ్రన్ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైంది. ప్రజల ఆహార భద్రతను రక్షించడంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం కీలకం. పౌష్టికాహార లోపం కేవలం ఆరోగ్యపరమైన సమస్య మాత్రమే కాదు. వ్యక్తి, కుటుంబం, సమాజంపై ఇది విస్తత దుష్ప్రభావాన్ని చూపుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఇది ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తుంది. పేదరికాన్ని పెంచుతుంది. శారీరక శ్రమ శక్తిని తగ్గిస్తుంది. ఫలితంగా ఉద్పాదకత తగ్గిపోతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) విశ్లేషించింది. రోగనిరోధక శక్తిని తగ్గించి, అంటురోగాల దుష్ప్రభావాన్ని తీవ్రతరం చేస్తుంది. విద్య, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఆహార సబ్సిడీలు, ఆహార భద్రత కార్యక్రమాలపై విమర్శలు చేసేవారు దేశ పౌష్టికాహార స్థితిగతులపై వెల్లడవుతున్న ఈ గణాంకాలను చూసైనా అభివృద్ధి పట్ల సరైన దృక్పథాన్ని పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నేటీ పరిస్థితికి, దేశ పాలకులకు 'ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకీల మోత...' సామెత సరిగ్గా సరిపోతుంది. మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు పేదోడికి ఒక పూట తిండి కూడా పెట్టడం లేదు. వారు ప్రకటనలో చెప్పినట్టు మోడీనే ప్రతి ఇంట్లో ఉంటే ఇలా ఎందుకుండేది? దేశ సంపదను కేంద్రం కార్పొరేట్లకు ధార పోస్తున్నదనేది జగమెరిగిన సత్యం. అప్పుల భారం తీర్చుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలను తన మిత్రులకు అప్పనంగా కట్టబెడుతున్నది. అక్కడి నుంచి తెచ్చిన డబ్బులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఒక వైపు దేశ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. అయినా మేం గొప్పవాళ్లం, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు.

ఎదురుదెబ్బలు తగిలినా ఆగని అమెరికా యుద్ధోన్మాదం!

ఇటీవలి వరకు అమెరికా తొత్తుగా ఉన్న హెండూరాస్ - ఎలా ఉందంటే తైవాన్‌ను ఒక దేశంగా గుర్తించి సంబంధాలు పెట్టుకున్నది - ఆదివారంనాడు దానితో సంబంధాలను తెగతెంపులు చేసుకొని చైనాతో దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. అక్కడ వామపక్షశక్తులు అధికారానికి రావటమే ఈ మార్పుకు కారణం. మారుతున్న బలాబలాలకు నిదర్శనంగా 2016 నుంచి ఇప్పటి వరకు తొమ్మిది దేశాలు తైవాన్‌ను వదలి చైనాతో సంబంధాలు పెట్టుకున్నాయి. హెండూరాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపిన అమెరికా చివరికి చేసేదేమీలేక మీ నిర్ణయాన్ని గౌరవిస్తామంటూ హెండూరాస్‌కు చెప్పింది. ఈ పరిణామం తైవాన్‌ను గుర్తిస్తున్న ఇతర దేశాల మీద కూడా పడుతుందని వేరే చెప్పనవసరం లేదు. తైవాన్‌ను గుర్తించినందుకు ప్రతిఫలంగా అమెరికా, తైవాన్ నుంచి కూడా సదరు దేశాలకు పెట్టుబడులు, ఇతరంగా ప్రతిఫలం ముడుతున్నది. అది ఎంతో కాలం కొనసాగించలేరని ఒక్కొక్కటి జారుకుంటున్న తీరు వెల్లడిస్తున్నది. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ ఏడవ తేదీ వరకు తైవాన్ ప్రాంత పాలకురాలు త్సై ఇంగ్ వెన్ లాటిన్ అమెరికా, అమెరికా తదితర దేశాలను సందర్శించనున్నారు. తైవాన్ వేర్పాటు వాదులకు ప్రపంచంలో ఎంతో మద్దతు ఉందని చెప్పి విశ్వాసం కల్పించేందుకు ప్రధానంగా ఆమె వెళుతున్నారు. పైకి ఏమి చెప్పినప్పటికీ తమకు చైనా నుంచి ముప్పు వస్తున్నదని ప్రచారం చేసేందుకు పూనుకున్నారు. ఇదంతా అమెరికా ఆడిస్తున్న నాటకం అన్నది తెలిసిందే.



ఎం. కోటేశ్వరరావు

ఇటీవలి కాలంలో తమ ఆధిపత్యానికి సవాలు ఎదురవుతున్నదనే భయం అమెరికాను పట్టి పీడిస్తున్నది. 'నడమంత్రపు సిరి నరం మీది పుండు కుదురుగా ఉండనివ్వవు' అన్నట్లుగా అమెరికా ఆయుధ ఉత్పత్తిదారులు నిరంతరం ఎక్కడో ఒక చోట ఉద్రిక్తత, రక్తపాతాన్ని కోరుకుంటారు. దానికి అనుగుణంగా అమెరికా ప్రభుత్వం పని చేస్తుంది. గత వారంలో అమెరికా మిలిటరీ జాయింట్ ఛీఫ్‌ల చైర్మన్ మార్క్ మిలే, అమెరికా రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ రక్షణశాఖ పార్లమెంటరీ ఉపకమిటీ ముందు మిలిటరీ విధానం, ఆలోచనల గురించి మాట్లాడారు. రికార్డు స్థాయిలో మిలిటరీ బడ్జెట్ ప్రధానంగా చైనాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినదని స్పష్టం చేశారు. చైనాతో పోరుకు తమను సన్నద్ధం చేస్తుందని అన్నారు. ఉప సంఘం చైర్మన్ కెన్ క్లవర్ట్ తొలి పలుకులు పలుకుతూ అవసరమైతే ఈ రాత్రికి రాత్రే పోరుకు సిద్ధంగా ఉండాలి. ప్రపంచంలో ఎదురులేని శక్తిగా వేగంగా నవీకరించాలని ప్రకటించాడు. చైనా మిలిటరీతో అమెరికా వ్యూహాత్మక పోటీ దృష్టితో రూపొందించిన బడ్జెట్ అని ఆస్టిన్ చెప్పాడు. మార్క్ మిలే మాట్లాడుతూ రానున్న పది సంవత్సరాల్లో పశ్చిమ పసిఫిక్, ఆసియాలో చైనా పెద్దదిగా ఉంటుందని, 2049 నాటికి మొత్తంగా సామర్థ్యంలో అమెరికా మిలిటరీని అధిగమించనుందని వర్ణించాడు. ప్రస్తుతం మొత్తం 10,330 యూనిట్లు ఉన్నాయని, వాటిలో 4,680 చురుకైన విధుల్లో ఉన్నట్లు, అవి ఎంతగా అంటే వాటిలో అరవైశాతాన్ని 30 రోజుల్లో, పదిశాతాన్ని కేవలం 96గంటల లోపుగానే మోహరించవచ్చని చెప్పాడు. ఈ సన్నద్ధతను కొనసాగించేందుకు జోబైడెన్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. దీనితో ప్రతి విభాగాన్ని సంసిద్ధం గావించవచ్చన్నారు. మొత్తం లక్ష కోట్ల డాలర్లను బైడెన్ సర్కార్ సిద్ధం చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా మిలిటరీ చర్యను అవకాశంగా తీసుకొని ఎలాంటి టెండర్లతో నిమిత్తం లేకుండా అమెరికాతో సహ అనేక దేశాల్లో నేరుగా పరికరాలు, అస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. మిలిటరీ ఎత్తుగడల గురించి కూడా మిలే, ఆస్టిన్ వెల్లడించారు. దేశ ఉద్దేశ్యాలు శాంతియుతమైనవే, హింసాకాండ జరగవచ్చనే బెదిరింపులతో అమెరికా తన ఆలోచనలను రుద్దాలి అవి విఫలమైతే హింసాకాండకు దిగాలి అన్నారు. యుద్ధం కంటే ఖర్చు ఎక్కువ కానప్పటికీ యుద్ధసన్నద్ధత, నిరోధించటం కూడా అసాధారణ రీతిలో ఖర్చుకు దారితీస్తుంది. ఈ భారీ బడ్జెట్ యుద్ధాన్ని నిరోధిస్తుంది, అవసరమైతే పోరుకు మనల్ని సన్నద్ధ పరుస్తుందని మిలే వాదించాడు. ఇలాంటి మాటలతో అమెరికన్లను, ప్రపంచ జనాలను మభ్యపెట్టేందుకు గతంలో అనేక మంది మిలిటరీ అధికారులు చూశారు. దీని వెనుక మిలిటరీ పరిశ్రమల అధిపతులకు లబ్ది చేకూర్చే ఎత్తుగడ ఉంది. నిజానికి చరిత్రలో హిట్లర్ మిలిటరీ అధికారులు కూడా ఇదేవిధంగా మాట్లాడారు, జర్మన్లను మభ్యపెట్టారు. వారిలో ఒకడైన ఎరిక్ రాడెర్ జర్మన్ నావికాదళ అధికారి, రెండవ ప్రపంచ యుద్ధ నేరాలను విచారించిన న్యూరెంబర్గ్ కోర్టులో చేసిన ఇదే వాదనలను తిరస్కరించి జీవితకాల శిక్ష వేశారు. జర్మనీకి దుష్ట ఆలోచనలు లేవని, మిలిటరీ బలంగా ఉంటే కోరుకున్న ప్రాంతాలను యుద్ధంతో నిమిత్తం లేకుండా బలాన్ని చూపి పొందవచ్చని వాదించాడు. నిజానికి మిలిటరీని పెంచటమేగాక, దాడుల పథకంలో కూడా ఎరిక్ రాడెర్ చురుకైన పాత్రధారి అని కోర్టు నిర్ధారించింది. ఆర్థికంగా దిగజారుడును మిలిటరీ హింసాకాండ ద్వారా పూడ్చుకోవచ్చని అమెరికా అధికారులు చెబుతున్నారు. "ఏ దేశంలోనూ లేని విధంగా చైనాలో సంపద, వృద్ధి జరుగుతున్నట్లు మనకు కనిపిస్తున్నది. విపరీతంగా సంపద పెరిగితే ప్రపంచ వ్యాపితంగా అధికారం కూడా అలాగే పెరుగుతుంది. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న మనం ఎల్లవేళలా అదే స్థానంలో ఉండాలని" మిలే చెప్పాడు.

సినిమాలు, టీవీ చిత్రాల ద్వారా అమెరికన్లకు ముప్పు ఎలా ఎటు వైపు నుంచి వస్తున్నదో చూపటం అక్కడ జరుగుతున్నది. వాటిలో గతంలో రష్యన్లు, ఇతర అమెరికా వ్యతిరేకులను ప్రతినాయకులుగా చూపే వారు. వారి మీద అమెరికన్లలో ద్వేషం పుట్టించేవారు. ఇప్పుడు చైనా, ఇతర దేశాల వారిని కూడా ప్రధానంగా చూపుతున్నారు. దానిలో భాగంగానే ఇటీవల కొన్ని అమెరికా సంస్థలు, పార్లమెంటులోని రిపబ్లికన్ పార్టీ సభ్యులు కొన్ని ఊహాజనిత యుద్ధ క్రీడలను కంప్యూటర్లలో సృష్టించి జనానికి చూపుతున్నారు. వాటి ప్రకారం 2025నాటికి తైవాన్ అంశం మీద అమెరికా-చైనా పోరుకు తలపడతాయని, దానిలో చైనా ఓడిపోతుందని చిత్రించారు. ఇది హాలీవుడ్ సినిమా వంటిదే. వాటిలో అమెరికా సిఐఏ గూఢచారులను తెలివిగలవారిగా ఇతర దేశాల వారిని దద్దమ్మలుగా చిత్రిస్తారు. నిజానికి ఇంతవరకు ఏ ఒక్క యుద్ధంలోనూ అమెరికా గెలిచిన ఉదంతం లేదు. దాన్ని సీఐఏ పసిగట్టి తమ నేతలను

> 1959లో టిబెట్‌లో దలైలామా తిరుగుబాటు, అదే ఏడాది చైనా అణుకార్యక్రమానికి సహకరించేది లేదని సోవియట్ ప్రకటించింది. రెండు దేశాల పార్టీల మధ్య సైద్ధాంతిక విభేధాలు తీవ్రమవుతున్న తరుణంలో అన్ని అంశాలను చూసినపుడు వెనక్కు తగ్గటమే మంచిదని నాటి చైనా నాయకత్వం భావించింది. తరువాత దేశాన్ని పటిష్టం గావించటం మీద శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఆ బలహీనతలన్నింటినీ అధిగమించింది. గతంలో ఐసెన్ హోవర్ మాదిరే ఇప్పుడు జో బైడెన్ కూడా ఉక్రెయిన్ మాదిరి కాకుండా అవసరమైతే మిలిటరీని దింపుతామని ప్రకటించాడు. గతంలో మావో మాదిరి ఇప్పుడు షీ జిన్‌పింగ్ వెనక్కు తగ్గేందుకు సిద్దం కాదు. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనేందుకు ధీటుగా దేశాన్ని రూపొందిస్తున్నాడు. అందుకే నిప్పుతో చెలగాటాలాడవద్దని బైడెన్‌తో భేటీలో షీ జిన్‌పింగ్ హెచ్చరించగలిగాడు.

హెచ్చరించి పరువు నిలిపిందీ లేదు. అమెరికా రిటైర్డ్ నావీ అధికారి మార్క్ మాంట్‌గోమరీ ఓర్లాండోలో రిపబ్లికన్ ఎంపీలకు చైనాతో పోరు అనే ఒక ఊహా చిత్రాన్ని చూపాడు. దానిలో వేలాది మంది అమెరికన్లు మరణిస్తారని, విమానవాహక నావలను ముంచివేస్తారని చిత్రించాడు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మిలిటరీలో పని చేస్తున్న వారిలో 15 నుంచి 50 మంది లేదా దేశం మొత్తంగా ఐదు



నుంచి ఇరవైవేల మంది ఒక వారంలో మరణిస్తారని చూపాడు. దానిలో తైవాన్ రక్షణకు అమెరికా దళాలు చైనా ప్రధాన ప్రాంతంపై ఎలాదాడి చేసేది, దాని నౌకలను ఎలా ముంచేది, మిలిటరీని ఎలా చక్రబంధం చేసేది, వివిధ కోణాల్లో జరిగే పర్యవసానాలను చూపారు. ఇలాంటి వాటిని బూచిగా చూపి అమెరికా తన దుర్మార్గాలను జనంతో ఆమోదింప చేసుకునేందుకు చూస్తున్నది. ఉక్రెయిన్ మాదిరి కాకుండా తైవాన్ ఆక్రమణకు చైనా పూనుకుంటే నేరుగా అమెరికా మిలిటరీని దింపుతారా అన్న ప్రశ్నకు జో బైడెన్ అవును అని సమాధానమిచ్చాడు.

ప్రజాబలం, పట్టుదలలో ఎంతో ఉన్నతంగా ఉన్నప్పటికీ మిలిటరీ రీత్యా అమెరికాతో 50సంవత్సరాల నాడు వియత్నాం సరితూగే స్థితిలో లేదు. అయినా బతుకు జీవుడా అంటూ అమెరికా మిలిటరీ ఎలా పారిపోయిందీ ప్రపంచమంతా చూసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిందీ అదే. తాలిబాన్లకు సలాం కొట్టి అమెరికన్లు వెళ్లారు. అలాంటిది చైనాతో ఢీకొనగలమని అమెరికన్లను నమ్మించేందుకు అక్కడి యుద్ధోన్మాదులు చూస్తున్నారు. "నూతన యుగంలో తైవాన్ సమస్య, చైనా పునరేకీకరణ" అనే పేరుతో 2022 ఆగస్టు పదవ తేదీన చైనా ఒక శ్వేత పత్రాన్ని ప్రకటించింది. తైవాన్ తనలో అంతర్భాగమే అని మరోసారి స్పష్టం చేసింది. ఒకే చైనా సూత్రానికి ఐరాస సాధారణ అసెంబ్లీ 2758వ తీర్మానం ద్వారా కల్పించిన చట్టబద్దతపై ఎలాంటి సందేహం లేదని, ప్రపంచమంతటా గుర్తింపు పొందిందని దానిలో పేర్కొన్నారు. శాంతియుతంగా పునరేకీకరణ జరగాలని, తప్పనిసరైతే బలప్రయోగం తప్పదని కూడా స్పష్టం చేశారు. ఒకే దేశం-రెండు వ్యవస్థలనే విధానం కింద తైవాన్‌కు హామీ ఇస్తున్నట్లు తెలిపింది.

ఏడు దశాబ్దాల నాడున్న చైనాకు నేటి చైనాకు ఏ విధంగానూ పోలికే లేదు. ఇరాన్-సౌదీ ఒప్పందాన్ని కుదిర్చి తన పలుకుబడి ఏమిటో ప్రదర్శించింది. ఇక గతానికి సంబంధించి చూస్తే1949లో చైనా విముక్తి జరిగినప్పటికీ దాన్ని సుస్థిరం కావించుకొనేందుకు కమ్యూనిస్టులకు పది సంవత్సరాలు పట్టింది.డేనియల్ ఎల్స్‌బర్గ్ బహిర్గతపరచిన పెంటగన్ పత్రాల్లో ఉన్న సమాచారం తైవాన్ విలీనం గురించి కొన్ని అంశాలను వెల్లడించింది. 1958లో తైవాన్ విలీనానికి పూనుకోవాలని మావో నిర్ణయించారు. దాన్ని గ్రహించిన అమెరికన్లు వెంటనే సప్తమ నౌకా దళాన్ని దాడికి వీలైన దూరానికి నడిపించారు. ఒక వేళ మిలిటరీ తైవాన్‌ను కాపాడలేకపోతే అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు అధ్యక్షుడు ఐసెన్ హోవర్ అనుమతి ఇచ్చాడు. తైవాన్ పాలకుడు చాంగ్‌కై షేక్‌ను, తైవాన్‌ను ఎలాగైనా కాపాడటం అమెరికాకు ప్రాముఖ్యత కలిగిన అంశం. అందుకు పూనుకొని విఫలం కావటం ఆసియాలో పరువు తక్కువ, దాన్ని కాపాడుకొనేందుకు ఎంతకైనా తెగించాల్సిందేనని మిలిటరీ జనరల్స్ చెప్పారు. అప్పటికే అవసరం లేకున్నా జపాన్‌పై అణు దాడి జరిపిన అమెరికా కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనేందుకు ఎంతకైనా తెగించేందుకు పూనుకుంది. తైవాన్‌కు సమీపంలోని ప్రధాన భూభాగంలో ఒక చిన్న మిలిటరీ కేంద్రం తప్ప చైనా వద్ద అప్పటికి అణుబాంబులు గానీ, విమానవాహక నౌకలుగానీ లేవు. ఆర్థికంగా పటిష్టత కూడా లేదు. సోవియట్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. 1959లో టిబెట్‌లో దలైలామా తిరుగుబాటు, అదే ఏడాది చైనా అణుకార్యక్రమానికి సహకరించేది లేదని సోవియట్ ప్రకటించింది. రెండు దేశాల పార్టీల మధ్య సైద్ధాంతిక విభేధాలు తీవ్రమవుతున్న తరుణంలో అన్ని అంశాలను చూసినపుడు వెనక్కు తగ్గటమే మంచిదని నాటి చైనా నాయకత్వం భావించింది. తరువాత దేశాన్ని పటిష్టం గావించటం మీద శ్రద్ద పెట్టింది. ఇప్పుడు ఆ బలహీనతలన్నింటినీ అధిగమించింది. గతంలో ఐసెన్ హోవర్ మాదిరే ఇప్పుడు జో బైడెన్ కూడా ఉక్రెయిన్ మాదిరి కాకుండా అవసరమైతే మిలిటరీని దింపుతామని ప్రకటించాడు. గతంలో మావో మాదిరి ఇప్పుడు షీ జిన్‌పింగ్ వెనక్కు తగ్గేందుకు సిద్దం కాదు. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనేందుకు ధీటుగా దేశాన్ని రూపొందిస్తున్నాడు. అందుకే నిప్పుతో చెలగాటాలాడవద్దని బైడెన్‌తో భేటీలో షీ జిన్‌పింగ్ హెచ్చరించగలిగాడు.

సెల్: 8331013288



గూడు చెదిరిన పక్షులు

పొద్దున్నే మోగే అలారం
సడీ సప్పుడులేకుండా
ఆగిపోయింది
గుప్పెడు కోరికల గింజల్ని
నాటుకున్న నిరుద్యోగ పక్షిపిల్లలు
గూడు చెదిరి
అల్లకల్లోలమయ్యాయి

భుజాల మీది కలలపావురాలను
ఎవడో ఎత్తుకెళ్ళాడు
ఎవరి దేహం వారికి బరువయ్యి
ఒకటే నరకయాతన

సందేహాలు
నీలినీడల్లా కమ్ముకొని
వేయాల్సిన అడుగులను
కత్తిరిస్తున్నాయి
దుప్పటి కప్పుకుని
నిద్రిస్తున్న వ్యవస్థలన్నీ
ఎవడి చేతిలోనో
పావులయి కలవరపెడుతున్నాయి

లోలోపలి దిగుల్ల దూగుళ్ళన్ని
సూర్యుని వైపు చూస్తూ
స్వచ్ఛమైన కిరణాలను కాసే
ఒకానొక ఉదయాన్ని కాంక్షిస్తూ
వేచిచూస్తున్నాయి.

- తండ హరీష్ గౌడ్
8978439551

పెత్తనం కేంద్రానిది... బాధ్యతలు రాష్ట్రాలకు... భారాలు ప్రజలకు...

పెత్తనం కేంద్రానిది. లాభాలు ఆశ్రిత పెట్టుబడిదారులవి, కార్పొరేట్ సంస్థలవి. బరువు బాధ్యతలు రాష్ట్రాలవి. భారాలు ప్రజలకు. విద్యుత్ రంగంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, విధానాల పర్యవసానాల సారాంశం ఇది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రాలపై బాధ్యతలు పెరుగుతున్నాయి. వినియోగదారులపై భారాలు పెరుగుతున్నాయి. కేంద్రం ఎటువంటి బాధ్యతను వహించటం లేదు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను (డిస్కామ్) గట్టెక్కించే పేరుతో షరతులతో కూడిన పథకాలను కేంద్రం ప్రవేశపెడుతున్నది. డిస్కాముల పేరుకుపోయిన నష్టాలు, అప్పులలో అధిక భాగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించటం ఈ పథకాల సారాంశం. ఆర్థిక పునర్నిర్మాణ పథకం, ఉజ్వల్ డిస్కాం ఎస్యూరెన్స్ యోజన (ఉదయ్), అందరికి విద్యుత్ వంటి పథకాలను కేంద్రం ప్రతిపాదించింది. వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి డిస్కాములతో ఒప్పందాలపై సంతకాలు చేయించింది. ఈ పథకాల ప్రకారం ఉభయ తెలుగు రాష్ట్రాలు గత ఎనిమిదేళ్ళుగా వేల కోట్ల రూపాయల మేరకు వాటి డిస్కాముల పేరుకుపోయిన నష్టాలను, అప్పులను భరిస్తూ వస్తున్నాయి. 2015 నవంబరు 20న ప్రవేశపెట్టిన ఉదయ్ పథకం కింద తెలంగాణ ప్రభుత్వం 2022-23 వరకు రూ.15,976.80 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు సమకూర్చింది. ఇందులో రూ.8015.91 కోట్లు గ్రాంటు కాగా, రూ. 7960.89 కోట్లు ఈక్విటీగా చేసిన సర్దుబాటు. ఈ మొత్తాలు మన రాష్ట్ర ప్రభుత్వం ఏటేటా సమకూర్చుతున్న వేల కోట్ల రూపాయల సబ్సిడీలకు అదనం. 2023-24లో తెలంగాణ ప్రభుత్వం రూ.9124.82 కోట్ల మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం టిఎస్ఇఆర్‌సి నిర్ధారించిన ట్రూఅప్ (2022-23 వరకు ఏడేళ్ళ కాలానికి) నిమిత్తం రూ.12718.40 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు చెల్లించేందుకు అంగీకరించింది. ఈ భారాల పెరుగుదలకు తన విధానాలు ప్రధాన కారణమైన మోడీ ప్రభుత్వం మాత్రం తానుగా ఇందుకు దమ్మిడీ ఆర్థిక సహాయం చేయటం లేదు. గత ఎనిమిదేళ్ళ మోడీ ప్రభుత్వ కాలంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాల పారుబకాయిలు దాదాపు పదకొండు లక్షల కోట్ల రూపాయల మేరకు మాఫీ అయ్యాయి. ఇందులో అత్యధిక భాగం ప్రయివేటు కార్పొరేట్ సంస్థల పారుబకాయిలే. రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌ల రుణాల బకాయిలలో ఈ విధంగా ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు.




ఎం. వేణుగోపాలరావు
9441193749

షరతులతో... కేంద్రం దోపిడీ!

డిస్కామ్‌లు వాటికి విద్యుత్ సరఫరా చేస్తున్న ఉత్పత్తిదారులకు, ముఖ్యంగా ప్రయివేటు ఉత్పత్తిదారులకు, భారీగా బకాయి పడటంతో కేంద్రం అప్పులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదించి, అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ గ్యారంటీ ఇచ్చేందుకు షరతు విధించింది. కేంద్రానికి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుత్ సంస్థలతో అలా మంజూరు చేయించిన రుణాల మొత్తాలను విద్యుత్ ఉత్పత్తిదారులకు నేరుగా ఆ రుణ సంస్థలతో చెల్లింపచేసింది. డిస్కాములకు మంజూరు చేసిన ఆ సంస్థలు ఈ రుణాలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేట్లు వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారుల అవసరాలు తీరుతున్నాయి. రుణాలిచ్చిన కేంద్ర ఆర్థిక సంస్థలకు లాభదాయక వడ్డీ వ్యాపారం జరుగుతున్నది. ఇలాంటి పథకాల వల్ల విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కాముల బకాయిలు కేంద్ర రుణ సంస్థలకు చెల్లించాల్సిన రుణాల బకాయిలుగా మారుతున్నాయి. డిస్కాముల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ఇలాంటి ఏర్పాట్లు ఏ మాత్రం దోహదం చేయటం లేదు.

మంత్రివర్గంలో, పార్లమెంటులో, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా ప్రధానమంత్రి మోడీ



అంతర్జాతీయ వేదికలపై ఏకపక్షంగా పునరుత్పత్తి విద్యుత్తును (ఆర్.ఇ) దేశం అదనంగా చేర్చే లక్ష్యాలుగా ప్రకటించారు. వాటికి అనుగుణంగా, అవసరం లేని ఆర్.ఇ ని ఆర్‌పిపిఓ పేరుతో, దాని కింద నిర్ణయించిన మితిమీరిన లక్ష్యాలకు మించి డిస్కాములు కొనుగోలు చేయటం వల్ల నివారించదగిన అదనపు భారాలు వినియోగదారులపై పడుతున్నాయి.

అవసరం లేని ఆర్ఇ కొనుగోలు వల్ల విపరీతంగా మిగులు విద్యుత్ తేలి, వినియోగదారులపై ట్రూఅప్ రూపంలో భారాలు పడుతున్నాయి. వాటిని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు. మిగులు విద్యుత్తుతో విద్యుత్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న మేరకు రాష్ట్రాలు పిపిఎల ప్రకారం పొందని విద్యుత్‌కు స్థిర ఛార్జీలను వేల కోట్ల రూపాయల మేరకు చెల్లించాల్సి వస్తున్నది. ఆ భారాలు వినియోగదారులపై పడుతున్నాయి. ఇది ఆందోళనకర అంశమని పేర్కొంటూ, అలా చెల్లిస్తున్న స్థిర ఛార్జీల నిమిత్తం కేంద్రం సహాయం అందించాలని ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ సిఫార్సు చేసింది. కేంద్ర ప్రణాళికా నిధులను సమకూర్చుతున్న పద్ధతిలోనే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఈ భారాన్ని 60:40 నిష్పత్తిలో భరించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం నుండి దీనిపై చలనం లేదు.

స్వచ్ఛ ఇంధన సుంకాన్ని (సియిఎస్) టన్ను బొగ్గుకు రూ.400 చొప్పున కేంద్రం వసూలు చేస్తున్నది. దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందని, పరిసరాల నియమాలను పాటించేందుకయ్యే ఖర్చుల నిమిత్తం సియిఎస్ మొత్తాన్ని విద్యుత్ రంగానికివ్వాలని ఫోరం సిఫార్సు చేసింది. సియిఎస్‌ను కేంద్రం జిఎస్‌టిలో చేర్చి వసూలు చేస్తున్నది. బొగ్గు, సహజ వాయువు ధరలను సహేతుకంగా నిర్ణయించాలని, ఇందుకు స్వతంత్ర రెగ్యులేటర్ను నియమించాలని ఫోరం సిఫార్సు చేసింది. బొగ్గు రవాణాకు రైల్వే ఛార్జీలలో కేంద్రం సబ్సిడీ యిచ్చే అంశాన్ని పరిగణించాలని సిఫార్సు చేసింది. కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు సహజ వాయువును సరఫరా చేయించక పోవటంతో, ఆ ఇంధనంతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు నిరుపయోగంగా ఉన్నాయి. అయినా, పిపిఎల నిబంధనల ప్రకారం డిస్కాంలు వాటికి స్థిర ఛార్జీలను చెల్లించాల్సి వస్తున్నది. ఈ స్థిర చార్జీలను చెల్లించేందుకు కేంద్రం డిస్కాంలకు సహాయం అందించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం ఈ సహేతుక సూచనలను పట్టించుకోకుండా యథావిధిగా మొరాయిస్తున్నది. బొగ్గు దిగుమతి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశిస్తున్న మోడీ ప్రభుత్వం, అందుకయ్యే అధిక వ్యయ భారాన్ని వినియోగదారులపై తగ్గించేందుకు ఎలాంటి సహాయం చేయటం లేదు.

వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లకు ముందస్తు చెల్లింపు (ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయటం, మొత్తం సాంకేతిక, వాణిజ్య (ఎ.టి అండ్ సి) నష్టాలను 12-15 శాతానికి తగ్గించటం, సగటు కాస్ట్ ఆఫ్ సర్వీస్ (ఎసిఎస్) కు, మొత్తం రెవెన్యూ అవసరానికి (ఎఆర్ఆర్)కు మధ్య తేడాను పూర్తిగా తగ్గించి వేయటం రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం లక్ష్యాలు. డిస్కామ్‌లు ఈ పథకాన్ని అమలు చేస్తే, ప్రీ పెయిడ్ మీటర్ల కొనుగోలుకు మీటరుకు రూ. 900 చొప్పున గ్రాంట్‌గా ఇస్తామని కేంద్రం ప్రతిపాదించింది. ప్రీ పెయిడ్ మీటర్ల వల్ల వినియోగదారులకు చేకూరే లాభం ఏమీ లేదు. పైగా వినియోగదారులకు చేతి చమురు వదులుతుంది. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా విద్యుత్ పంపిణీ రంగంలోకి ప్రవేశించే ప్రైవేటు పెట్టుబడిదారుల పబ్బం గడిపేందుకే ఈ ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయించేందుకు పై గ్రాంటును కేంద్రం ఎరగా వేసింది. కొనుగోళ్లు అంటే అధికార వర్గాలు ఉబ్బితబ్బిబ్బు అవుతాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కంకణం కట్టుకున్న మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌లను నేరుగా ప్రయివేటీకరించే అధికారం తనకు లేకపోవటంతో, ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నది.

> సాంకేతిక కారణాలను మినహాయించి, డిస్కాంలు వినియోగదారులకు విద్యుత్తును నిరంతరం సరఫరా చేయటంలో విఫలమైతే జరిమానాలను చెల్లించాలనే దాకా మోడీ ప్రభుత్వం వెళ్ళింది. విద్యుత్ ప్రాజెక్టులకు తాను చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో విఫలమౌతూ, వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, వాటి ధరలను సహేతుకంగా నియంత్రించటంలో, తగు రవాణా ఏర్పాట్లు చేయించటంలో విఫలమౌతూ, విద్యుత్ కొరతకు కారణమవుతున్న తన వైఫల్యాలకు మాత్రం మోడీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం వహించటం లేదు.

సాంకేతిక కారణాలను మినహాయించి, డిస్కాంలు వినియోగదారులకు విద్యుత్తును నిరంతరం సరఫరా చేయటంలో విఫలమైతే జరిమానాలను చెల్లించాలనే దాకా మోడీ ప్రభుత్వం వెళ్ళింది. విద్యుత్ ప్రాజెక్టులకు తాను చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో విఫలమౌతూ, వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, వాటి ధరలను సహేతుకంగా నియంత్రించటంలో, తగు రవాణా ఏర్పాట్లు చేయించటంలో విఫలమౌతూ, విద్యుత్ కొరతకు కారణమవుతున్న తన వైఫల్యాలకు మాత్రం మోడీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం వహించటం లేదు. తన విధానాలు, వైఫల్యాల వల్ల డిస్కామ్‌లపై, వినియోగదారులపై పడుతున్న భారాలను తగ్గించేందుకు ఎలాంటి సహాయం అందించటం లేదు



ఉమ్మనేని సేవా ఫౌండేషన్, సీపీఐ(ఎం) గ్రామ శాఖ సహకారం

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోనే గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన షేక్ మౌలాలి అలియాస్ వెంకయ్యకు ఉమ్మనేని సేవా ఫౌండేషన్ సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను మంగళవారం గోవిందాపురం (ఎల్) గ్రామంలో అందజేశారు. షేక్ మౌలాలి వెన్నుపూస దెబ్బ తినడం వల్ల రెండు కాళ్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్న సమయంలో ఉమ్మనేని లక్ష్మీనారాయణ, వెంకట్రావుల సేవ ఫౌండేషన్, సత్యసాయి ధ్యాన మండలి ఖమ్మం శాఖ సెక్రెటరీ దామా స్వరూపకి సిపిఎం గ్రామ శాఖ ఉమ్మనేని రవి, కళ్యాణపు బుచ్చయ్య, వల్లంకొండ సురేష్ కలిసి సమస్యను వివరించారు. గతంలో వెంటనే స్పందించి ఖమ్మం మమత హాస్పిటల్‌లో నెల రోజులపాటు వైద్యం చేపించేందుకు హాస్పటల్‌కు తీసుకెళ్లారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో సిపిఎం గ్రామ శాఖ, ఉమ్మనేని ఫౌండేషన్ సేవ ద్వారా కొంత ఆర్థిక సహాయం ఆనాడు అందజేశారు. అదేవిధంగా మంగళవారం మమత హాస్పిటల్ నుంచి మౌలాలి డిశ్చార్జ్ అయ్యాడు. ఇంటికి వెళ్తున్న సందర్భంగా సత్యసాయి ధాన్య మండలి శాఖ సెక్రెటరీ సభ్యులతో కలిసి నిత్యావసర సరుకులు వారు అందజేశారు. ఈ సందర్భంగా మౌలాలి అలియాస్ వెంకయ్య మాట్లాడుతూ తనకు సహకారం అందించిన ఉమ్మనేని సేవ ఫౌండేషన్‌కు, సత్యసాయి ధాన్య మండల శాఖ సెక్రెటరీ దామా స్వరూపకు, సభ్యులకు సిపిఎం పార్టీ గ్రామ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ సభ్యులు, సేవా ఫౌండేషన్, సత్యసాయి ధ్యాన మండలి ఖమ్మం శాఖ సెక్రెటరీ దామా స్వరూప పాల్గొన్నారు.



జన చైతన్య యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ - మధిర

మధిర మండలం దెందుకూరు గ్రామంలో వివిధ ప్రజాసంఘాల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వూట్ల శంకర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, దేశ వినాశకార ప్రమాదకర మతోన్మాద విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ సాగిన జన చైతన్యయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, పోరాటాల పురిటిగడ్డ తెలంగాణలో మతోన్మాద రాజకీయాలకు చోటు లేదని వివిధ పోరాట, లౌకిక పార్టీలు వివిధ ప్రజా సంఘాలు సంఘీభావంతో మద్దతు తెలిపాయని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అల్లూరి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు మధు, గోపి లక్ష్మణ్ ఉదయ్ కిరణ్, ఆనంద్ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు



పేద కుటుంబానికి పీఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

నవతెలంగాణ- సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన నిరుపేద నాగూర్‌బీ కుటుంబానికి పర్సా సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ (పీఎస్ఆర్) వ్యవస్థాపకులు పర్సా పుల్లయ్య రూ.10వేల విలువగల గ్రైండర్‌ను సోమవారం అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అందించారు. ఖమ్మం వాసి అయిన పుల్లయ్య కుటుంబ ఆర్థిక నేపథ్యాన్ని తెలుసుకొని వీరికి గ్రైండరు అవసరమని గ్రహించి ఎన్టీఆర్‌నగర్ హైస్కూలులో పీఎస్ఆర్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నాగూర్‌బీ కుటుంబానికి ఈ సాయాన్ని అందించారు. ఇటీవల నాగూర్‌బీ కుటుంబ దీనస్థితిని తెలుసుకొని ఆర్కే ఫౌండేషన్ తరఫున ఇనుపనూరి రాధాకృష్ణ హోటల్ నిర్వహణకు చేయూతను అందించారు.

పీఎస్ఎస్ ప్రథమ వార్షికోత్సవ వేడుక

స్థానిక ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వీర్ల సరోజిని అధ్యక్షతన పీఎస్ఆర్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిచారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు పర్సా పుల్లయ్య మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసి ఖమ్మం జిల్లా కేంద్రంలో బహుమతులను అందజేయడం జరుగుతుందని ఆయన ప్రకటించారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎస్కే చాంద్‌పాషా, కో-ఆప్షన్ సభ్యుడు తడికమళ్ల ప్రకాశరావు, ఎస్కే జాని, ఉపాధ్యాయులు దయాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవికుమార్, రాంబాబు, రాహుల్, అలీం, ట్రస్ట్ సభ్యులు మధుసూదనరాజు, పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో కాంగ్రెస్ సంకల్ప సత్యాగ్రహ దీక్ష

నవతెలంగాణ- సత్తుపల్లి

దేశంలో మతతత్వం విషం జిమ్ముతోందని, దానిని అంతమొందించకుంటే ప్రజాస్వామ్య మనుగడకు పెను ప్రమాదం పొంచి ఉందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై అనర్హత అనే అస్త్రాన్ని సంధించి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేయడం అప్రజాస్వామిక చర్యని సంభాని తీవ్రంగా విమర్శించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ అధికారంలోని వచ్చిందన్నారు. బ్రిటిష్ కాలంలో లేనటువంటి ఆంక్షలు ప్రస్తుతం దేశంలో కొనసాగడం దేశప్రజలు ప్రమాదంలో పడనున్నారన్నారు. బీజేపీ అంతం ప్రారంభమైందనడానికి వారు చేస్తున్న చేష్టలే నిదర్శనమన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్రపాటి సాల్మన్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ దీక్ష కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ నాయకులు కొత్తా సీతారాములు, పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహరరెడ్డి, రాష్ట్ర జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శివా వేణు, నాయకులు కాలం కృష్ణ, గోళ్ల అప్పారావు, కిరణ్, సోమిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని విమర్శించే అర్హత బీజేపీకి లేదు

కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీని విమర్శించే అర్హత బీజేపీకి లేదని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాయుడుపేటలో మంగళవారం సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసి, ఎనిమిదేళ్ళ ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, కేతినేని వేణు, మొక్క శేఖర్‌గౌడ్, కందుకూరి వెంకటనారాయణ, పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి జాగ్రత్త : కలెక్టర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ వెనుక భాగాన ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్ ను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం తెరిచారు. ఇసిఐఎల్ నుండి 2,197 వివి ప్యాడ్స్ జిల్లాకు చేరినట్లు, వాటిని భద్రపరచుటకు గోడౌన్ తెరచామని అన్నారు. వివి ప్యాడ్‌లను స్కాన్ చేసి భద్రపరచాలన్నారు. గోడౌన్ లోపల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెదలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక పరికరాలు పనిచేసేలా చూడాలన్నారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, జెడ్పి సిఇఓ వివి. అప్పారావు, పీఆర్ ఇఇ కెవికె. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు రాంబాబు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కమర్తపు మురళి, బిజెపి పార్టీ ప్రతినిధి జి.విద్యాసాగర్, సీపీఐ పార్టీ ప్రతినిధి జి.లక్ష్మీనారాయణ, సిపిఎం ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్సిపార్టీ ప్రతినిధి ఎస్కె.తాజోద్దీన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మర్రి శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

మిషన్ భగీ‘వ్యథ’లపై ఆగ్రహం

- ఎస్ఈ గైర్హాజరీపై జడ్పీ సభ్యుల మండిపాటు
- ప్రొటోకాల్ పై సభ్యురాలి నిలదీత
- రూ.10వేల పంట నష్ట పరిహారంపై సీఎంకు ధన్యవాదాలు
- ఖమ్మం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



జిల్లాలో మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని జడ్పిటిసిలు, ఎంపీపీలు వండిపడ్డారు. మిషన్ భగీరథ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సమావేశాలకు రెగ్యులర్‌గా గైర్హాజరవుతుండడంపై జిల్లా పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ లింగాల కమల్ రాజు అధ్యక్షతన జరిగింది. మిషన్ భగీరథ నీటి సరఫరా లో సమస్య ఉత్పన్నమైన 48 గంటల్లోనే పరిష్కారిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలపడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య మండలంలో మిషన్ భగీరథ తీరుపై మండిపడ్డారు. ఈ పథకం నిర్వహణకు ప్రతినెల వేలకు వేల కరెంట్ బిల్లు వస్తుందని తెలిపారు. మిషన్ భగీరథ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఓ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసిన విషయం కూడా తమకు తెలియదు అన్నారు. మండలంలో ఏడు గ్రామాలకు అసలు నీరందట్లేదని జడ్పిటిసి మోహన్‌రావు ఆరోపించారు. టాప్స్ లేకపోవడంతో భగీరథ నీరు వథాగా పోతుందని ఎంపీపీ వరలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు లీక్ అవడం నిత్యకృత్యంగా మారిందన్నారు. ఈ శాఖ ఎస్ఈ ఉన్నారా? ఉంటే ఒక్క సమావేశానికి కూడా హాజరు కారా? అని ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ప్రశ్నించారు. సమావేశం విషయంలో ఎస్ఈ నిర్లక్ష్య ధోరణితో ఉన్నట్లు అవగతం అవుతుందని డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు ఆరోపించారు. దీనిపై చైర్మన్ కమల్ రాజ్ స్పందిస్తూ ఒక్క సమావేశానికి కూడా ఎస్ఈ హాజరు కావడం లేదని, వచ్చే సమావేశానికి హాజరుకాని పక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే వేసవి దృష్ట్యా నీటి సరఫరా పకడ్బందీగా జరిగేలా చూడాలని చైర్మన్ ఆదేశించారు.

ప్రొటోకాల్‌పై సభ్యురాలి నిలదీత

హెల్త్ సబ్ సెంటర్ల ఏర్పాటు విషయమై తమకు ఎలాంటి సమాచారం ఉండడం లేదని, పంగిడిలో సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయం జడ్పీటీసీనైన తనకు తెలియదని, ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రఘునాథపాలెం జడ్పీటీసీ ప్రియాంక ప్రశ్నించారు. డీఎంహెచ్‌వో మాలతీని నిలదీశారు. మండలంలో ఏ కార్యక్రమం చేపట్టినా సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, ప్రొటోకాల్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు.

పంట పరిహారంపై సీఎంకు ధన్యవాదాలు

ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను జిల్లాలోని బోనకల్ మండలంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పరిశీలించారని, దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10,000 చొప్పున పరిహారం ప్రకటించడంపై సమావేశం సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేసింది. అలాగే కౌలు రైతులకు కూడా పరిహారం ప్రకటించడంపై హర్షం వెలిబుచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కేంద్రాల్లో అందించే వైద్యసేవలపై నివేదికను వివరించారు. సబ్ సెంటర్లు ఎక్కడ అవసరమున్నవో సభ్యులు ప్రతిపాదించాలని కోరారు. సంక్షేమ శాఖాధికారి మహిళాభివృద్ధి, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని ఏడు ఐసిడియస్ ప్రాజెక్టులలో 1605 మెయిన్ (235) మినీ మొత్తం 1840 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నామని వివరించారు.



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి 81.16 లక్షల పని దినాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. 3,03,797 కుటుంబాలలోని 6,44,673 మందికి జాబ్‌కార్డులు జారీచేశామని తెలిపారు. దీనికి గాను రూ.115.13 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఆసరా పింఛన్లపై సభ్యులు ప్రశ్నించారు. సుమారు 600 దరఖాస్తుల్లో ఈకెవైసి సమస్య ఉందని, ఆధార్ అప్‌డేట్, ఐరిస్ సరిచేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, డిసిఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వివి.అప్పారావు, విద్యుత్, వైద్య ఆరోగ్య, సంక్షేమ, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల జిల్లా అధికారులు, జడ్పీటిసీలు, ఎంపిపిలు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ఇంటి పర్మిషన్లు

- విలేకరి అరెస్టు...రిమాండ్‌కు తరలింపు
- విలేకర్ల సమావేశంలో ఏసీపీ బస్వారెడ్డి

నవతెలంగాణ- ఖమ్మంరూరల్



పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఇంటి నిర్మాణ పత్రాలు తయారు చేసిన ఖమ్మం రూరల్ దిశ పత్రికా విలేకరి లక్ష్మారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఖమ్మంరూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సత్యనారాయణపురంలో గల ఏసీపీ కార్యా లయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. గతంలో ఏదులాపురం, గుర్రాలపాడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చిన వ్యవహారంలో మండలంలోని నాయుడు పేటలో నివాసం ఉంటున్న ఖమ్మం రూరల్ దిశ పత్రికా విలేకరి యాసా లక్ష్మారెడ్డి పాత్ర ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, లక్ష్మారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ కేసులో తనగంపాడు గ్రామానికి చెందిన నాగరాజు పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. లక్ష్మారెడ్డి ఒక్కడే అరెస్టు కాగా, నాగరాజు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల మండలంలో తనగంపాడు రెవెన్యూ పరిధిలోని 5.38 ఎకరాల భూమిని కాజేసేందుకు భూ యజమాని జీవించి ఉండగానే అతను, అతని భార్య చనిపోయారని నకిలీ మరణధ్రువపత్రాలు సృష్టించిన కేసులో మొత్తం 9 మంది పాత్ర ఉన్నట్లు గుర్తించామని, వారిలో ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. మిగతా ఇద్దరిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు. మండలంలో భూముల ధరలు పెరగడంతో నేరస్తులు ఏదో విధంగా భూములపై కన్నేసి వాటిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని, దానికి అనుగుణంగానే తప్పుడు పత్రాలు, నకిలీ స్టాంప్స్ తయారుచేసి వాటి ద్వారా అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఖరీదైన భూములను సొంతం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఫోర్జరీ చేసే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా వివిధ బ్యాంకులలో నకిలీ ధ్రువపత్రాలు, పహానీలు, భూమి పానుపుస్తకాలు చూపించి రుణాలు కూడా తీసుకున్నట్లు సమాచారం ఉందని వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సిఐ రాజిరెడ్డి, ఎస్ఐ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి డబుల్ ఇండ్లు ఇవ్వాలి

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి
- తహసీల్దారుకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ- సత్తుపల్లి



అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లి తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ఇండ్లు నిర్మించి పేదలకు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం, యేడాదికి లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి 9 యేండ్లు దాటినా పేదల ఇండ్ల నిర్మాణాల్లో విఫలం చెందారని విమర్శించారు. సొంతస్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణాలకు తొలుత రూ. 5లక్షలు ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడేమో రూ. 3లక్షలకు కుదించడం సరైంది కాదన్నారు. అది కూడా అమలుకు నోచుకుంటుందో లేదో అనుమానమేనన్నారు. సత్తుపల్లి మండలంలో సొంతస్థలాలు లేని పేదలు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. స్థలాలు లేని వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాలని, స్థలాలున్న వారికి ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే కట్టిన డబుల్ నిర్మాణాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. తుంబూరు గ్రామంలో సర్వే నెంబరు 34లో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అట్టి భూమిని భూమిలేని పేదలకు పంచాలన్నారు. కార్యక్రమంలో వ్యకాస మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, గద్దల వెంకటేశ్వరరావు, సాంబయ్య, ముత్తిని శ్రీను, తుమ్మలపల్లి యేసమ్మ, కంభంపాటి రామకృష్ణ, ఉంజునూరి విష్ణువాసు, మురళి, ఇస్తరయ్య, సుజాత, త్రివేణి, కళావతి పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం...అంగరంగ వైభవంగా తెప్పోత్సవం

నవతెలంగాణ- ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన స్వయం భుజమలాపురం మహా ద్వి క్షేత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు జరుగుతున్న శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి సంవత్సరం వలె నిర్వహించే చైత్ర శుద్ధ సప్తమిన ఆలయ సంప్రదాయ ప్రకారం మంగళవారం అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీనివాసుని కళ్యాణం అత్యంత వైభోవపేతంగా ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారు జాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమములు, వేద పారాయణం అర్చకులు నిర్వహించారు. స్వామి వారిని అమ్మ వార్లను నూతన వధూవరులుగా అలంకరణ చేసి పల్లకిలో కళ్యాణ మండపంనకు మంగళ వాయిద్యముల నడుమ తోడుకొని వచ్చారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, సుముహూర్తం, తలంబ్రాలు వంటి వైదిక ప్రక్రియలను అత్యంత వైభవంగా మురళీమోహన్‌శర్మ దంపతులు శుభలగ్న కార్యక్రమమును నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవానికి ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్ మోహన్‌రావు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కళ్యాణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మల దంపతులు, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎస్సై ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం వలే జమలాపురం గ్రామ పంచాయతీ నుండి గ్రామ సర్పంచ్ మూల్పూరి స్వప్న, మూల్పూరి శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్ బాబు, ఎంపీటీసీ మూల్పూరి శైలజ, ఉప సర్పంచ్ ఉయ్యూరు మల్లిక ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రములు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కెఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తు ళ్లూరు కోటేశ్వరరావు నిర్మల దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన జమలాపురం పెద్ద చెరువు నందు స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా తయారు చేసిన హంస వాహనంపై ఉంచి అంగరంగ వైభవంగా తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కుటుబ సభ్యులు ఉప్పల కృష్ణ మోహన్‌శర్మ, ఉప్పల శ్రీరామ చంద్ర మూర్తి, ఉప్పల వెంకట జయదేవ శర్మ, విజయ్ దేవశర్మ, రాజీవ్‌శర్మ ఆలయ సీనియర్ అసిస్టెంట్ కె.విజయకుమారి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో నాలుగేళ్ల పాపకు గాయాలు

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని సోమలింగారెడ్డి రోడ్డులో నాలుగు సంవత్సరాలు పాపపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం శీలం కారుణ్య (4) పాఠశాలకు వెళ్లి వచ్చి ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క వచ్చి దాడి చేయడంతో పాప కేకలు విని తండ్రి శీలం నాగరాజు తల్లి అంజలి వెంటనే రావడంతో కుక్క అక్కడి నుండి వెళ్లిపోయింది. పాప ముఖానికి, కాలికి గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో డాక్టర్లు ఎవరు లేకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు కలిసి ఆందోళన దిగటంతో అక్కడ ఉన్న సిబ్బంది 108 పిలిపించి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కుక్కల నిర్మూలన కార్యక్రమం చేపట్టి చిన్నారులకు భద్రత కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రిటైర్డ్ రేంజర్ గార్లపాటి కృష్ణదాసు మృతి

నవతెలంగాణ- సత్తుపల్లి

అటవీశాఖలో సుదీర్ఘకాలం పాటు రేంజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గార్లపాటి కృష్ణదాసు (79) మంగళవారం మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణదాసు సత్తుపల్లిలోని కృషి బైపాస్ రోడ్డులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య నాగేశ్వరి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కృష్ణదాసు భౌతికకాయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా, డివిజన్ నాయకులు వనమారెడ్డి చెంచిరెడ్డి, కేశవరెడ్డి, బద్రుద్దీన్, ప్రకాశరావు, బోడేపూడి బాబు, అద్దంకి వెంకటరత్నం, గార్లపాటి రామకృష్ణ, బొల్లేపల్లి మధుసూదనరాజు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

వికలాంగులకు టిఆర్ ఆర్టీసీ బస్సు పాసు మేళా

నవతెలంగాణ-వైరాటౌన్

టిఆర్ ఆర్టీసీ మధిర డిపో వారి ఆధ్వర్యంలో 29వ తేదీ బుధవారం ఉదయం 9:30 గంటలకు రెబ్బవరం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు వికంగులకు బస్ పాస్ మేళ నిర్వహిస్తామని డిపో మేనేజర్ ఎస్.దేవదానం, ఐకేపీ ఎటిఎం శామ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వికలాంగులందరూ సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్ ఫోటో, 50/- రూపాయలు తీసుకుని గ్రామ పంచాయతీ ఆఫీసుకు రాగలరని తెలియ జేశారు. ఈ బస్‌పాసుతో సంవత్సరం పాటు 50% శాతం రాయితీతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ప్రయాణం చేయవచ్చునని తెలియజేశారు.

వైరాలో కాంగ్రెస్ సంకల్ప సత్యాగ్రహ దీక్ష

నవతెలంగాణ-వైరాటౌన్

రాహుల్ గాంధీ పైన అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ వైరా నియోజకవర్గ కేంద్రంలో వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన సంకల్ప సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో వ్యవస్థలు అన్నింటినీ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని, చివరకు దేశంలో అత్యంత గౌరవనీయమైన న్యాయవ్యవస్థను వాడుకొని రాహుల్ గాంధీ మీద అనర్హత వేటు వేశారని అన్నారు. న్యాయస్థానాలను సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని అన్నారు. కనీసం న్యాయ నిపుణుల సలహా గానీ, సీనియర్ అధికారుల సలహా గానీ లేకుండా 24 గంటల లోపు పార్లమెంట్ సెక్రటరీ ద్వారా అనర్హత వేటు వేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైరా నియోజకవర్గ పిసిసి సభ్యులు వడ్డే నారాయణ రావు, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, వైరా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, జులురుపాడు మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణయ్య పాల్గొన్నారు.

పోలీస్ అధికారులను ప్రశంసించిన డీజీపీ

నవతెలంగాణ- ఖమ్మం

నిర్దిష్టమైన ప్రణాళికతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించిన పోలీస్ అధికారులను డీజీపీ అంజనీకుమార్ ప్రశంసించారు. నెలవారీ ఆన్‌లైన్ నేర సమీక్ష సమావేశంలో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఏస్పీలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ నిర్వహించారు. పారదర్శకతను విస్తరింపజేయడం లక్ష్యంగా అమలవుతున్న ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరును సమీక్షించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బందిని ప్రతినెల నిర్వహించే మెగా రివార్డ్ మేళాలో ప్రోత్సహిస్తూ రివార్డ్స్ అందజేయాలని డీజీపీ సూచించారు. జిల్లాలో సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ సుభాష్ చంద్రబోస్, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు ప్రసన్నకుమార్, రామోజీ రమేష్, గణేష్, బస్వారెడ్డి, వెంకటస్వామి, రహెమాన్, రవి, వెంకటేశ్వర్లు, ఏవో అక్తరూనీసాబేగం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాపోరు యాత్ర

నవతెలంగాణ- ఖమ్మం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం నినాదంతో యాత్ర నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ ఖమ్మం నియోజకవర్గ సమావేశం ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, వగడాల మల్లేష్, మాజీ ఎంపిపి బండి సత్యం, జిల్లా నాయకులు యానాలి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది మహానంది జాతీయ పురస్కారానికి ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

తెలుగు, వెలుగు సాహితీ వేదిక ఉగాది మహానంది జాతీయ పురస్కారానికి మండల పరిధిలోని మంగళగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత పంజాల ఐలయ్య ఎంపికయినట్లు వేదిక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న త్యాగరాజ గాన సభలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐలయ్యకు పలువురు ఉపాధ్యాయులు, అధికారులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.



ఎంఎస్పీ చట్టాన్ని ఎప్పుడు తీసుకొస్తారు?

అసలు చట్టం తెచ్చే ఉద్దేశం ఉందా? లేదా?

ఎంపీ నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయ పంటలకు మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించేందుకు ఉద్దేశించిన చట్టాన్ని తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అసలు చట్టాన్ని ఎప్పుడు తీసుకొస్తారు? తీసుకువచ్చే ఉద్దేశం ఏమైనా కేంద్రానికి ఉందా? లేదా అని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరావు కేంద్ర ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. డిసెంబర్, 2021లో రైతులు రోడ్ల మీదకు వచ్చి చేసిన ఆందోళన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఎంఎస్పీ చట్టానికి హామి ఇచ్చిందని, కానీ ఇంత వరకు చట్టాన్ని మాత్రం తీసుకురాలేదన్నారు. ఈ విషయమై తానడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మంగళవారం ఇచ్చిన సమాధానం పట్ల నామ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చట్టాన్ని ఎప్పుడు తీసుకువస్తారని అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే పద్ధతిలో సమాధానం ఇవ్వడం పట్ల నామ తీవ్రంగా ఆక్షేపించారు. ఎంఎస్పీ కింద మరిన్ని ఉత్పత్తులను పెంచాలని యోచిస్తున్నారా? అన్న ప్రశ్నకూ సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. రైతులపై కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానం తేటతెల్లం చేస్తుందని నామ మండిపడ్డారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హోరెత్తిన పార్లమెంట్ ఉభయ సభలు

మహిళా రిజర్వేషన్ బిల్లుపై మంగళవారం పార్లమెంట్ ఉభయ సభలు బీఆర్ఎస్ ఎంపీల ఆందోళనతో హోరెత్తాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించాలని లోక్ సభలో ఎంపీలు నామ నాగేశ్వరరావు, మాలోత్ కవిత వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ అంశంపై చర్చకు పట్టుబడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులతో కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టారు. లోక్ సభ ప్రారంభం కాగానే నామ నాగేశ్వరరావు నాయకత్వంలో ఎంపీలంతా సీట్లలో నుంచి లేచి నిలబడి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరపాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అందుకు ప్రభుత్వం మొండికేయడంతో ఎంపీలు మరింత పట్టుదలతో ఆందోళన కొనసాగించడంతో స్పీకర్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మళ్ళీ మధ్యాహ్నం కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభను తిరిగి బుధవారానికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ బయట బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి మహిళల పట్ల, మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల చిత్త శుద్ధి లేదని, ఉంటే ఈరోజు ఖచ్చితంగా పార్లమెంట్లో చర్చకు అవకాశం ఉండేదని పేర్కొన్నారు. కానీ పార్లమెంట్లో బిల్లు పాస్ అయ్యేంత వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.



ఆళ్ళపాడు రామాలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే ఆళ్ళపాడు గ్రామంలో గల రామాలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం సోమవారం రాత్రి ఆళ్లపాడు గ్రామంలో జరిగింది. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎండోమెంట్ ఆఫీసర్ సమత నూతన పాలకవర్గం చైర్మన్ పారా ద్రాక్షవతి కమిటీ సభ్యులుగా బుంగా వెంకయ్య, జంపాల పూర్ణయ్య, మండితోక కొండ, బుంగ లక్ష్మయ్యలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కమల్ రాజు చైర్మన్ పారా ద్రాక్షవతితో పాటు కమిటీ సభ్యులందరినీ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయం నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కోరారు. దేవాలయానికి దాతలు ఇచ్చిన భూమిని దేవాలయానికే వినియోగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక దేవాలయాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. దేవాలయ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా న్యాయంగా నిర్వహించాలని చైర్మన్ ద్రాక్ష వతిని కమిటీ సభ్యులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ మరీదు బరకయ్య ఆ గ్రామ సర్పంచ్ మర్రి తిరుపతిరావు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున రావు మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు రైతు బంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్ రావు తమ్మారపు బ్రహ్మయ్య, గద్దల వెంకటేశ్వర్లు, గుడి చైర్మన్ కుమారుడు పారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీ పరీక్షలలో శ్రీ చైతన్య ప్రభంజనం

నవ తెలంగాణ-మధిర



మధిర పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన జాతీయస్థాయి పోటీ పరీక్షలో ఐఎన్టిఎస్ఓ ఫైనల్ లెవెల్ నందు జాతీయస్థాయి 3, 4, 5 ర్యాంకులతో పాటు 33 కాన్సోలేషన్ ప్రైజ్, గోల్డ్ మెడల్, 17 గోల్డ్ మెడల్, 60 ప్రశంసా పత్రాలు మొత్తంగా 115 మంది విద్యార్థులు బహుమతులు సాధించారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థుల అభినందన సభలో ప్రిన్సిపల్ ఆకెళ్ళ భారతి మాట్లాడుతూ ఇంతటి విజయాన్ని అందించినటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను, విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య ఏజీఎం చేతన్, ఆర్ఐ జయప్రకాష్, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీన్ నరేష్, ఒలంపియాడ్ ఎగ్జామ్స్ ఇంచార్జ్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూమి అమ్మి దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-పెనుబల్లి

మండల కేంద్రంలోని సాయి నగర్లో వడిత్య వెంకటేశ్వరరావు అనే వ్యక్తి భూమి అమ్మి దౌర్జన్యానికి పాల్పడినందుకు బాధితుడు ఫిర్యాదు మేరకు పెనుబల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సాయి నగర్ కు చెందిన వడిత్య వెంకటేశ్వరరావు టేకులపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలు అనే వ్యక్తికి 10 గుంటల భూమిని విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. అట్టి భూమిని ఏడుకొండలు 2018లో తన బంధువులకు విక్రయించాడు. ఇటీవల భూమి యజమాని తన కొనుగోలు చేసిన స్థలం పరిశీలించిగ తన భూమిపై ఉన్న కొతరాళ్లను పీకి వేసి చదును చేసి ఉండగా అట్టి విషయంపై ఆరా తీయగా వెంకటేశ్వరరావు ఈ దౌర్జన్యానికి పాల్పడినట్టు తేలడంతో దీనిపై పెనుబల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారించి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

జన చైతన్య యాత్ర ముగింపు సభను జయప్రదం చేయండి

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు పిలుపు ఇచ్చారు. మంగళవారం స్థానిక బోడెపూడి భవనం నందు వారు మాట్లాడుతూ మార్చి 29 హైదరాబాదు ఇందిరాపార్క్ వద్ద జరిగే ముగింపు సభకు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు పాల్గొన్నారు.

కిలాడీ లేడీ

- రూ.7.80 లక్షలు లూటీ
- రెట్టింపు డబ్బులు వస్తాయని బురిడి
- సెల్ఫోన్ మెసేజ్లతో వైరాలో ఘరానా మోసం

నవతెలంగాణ-వైరా



అత్యాశకు పోయిన ఓ యువకుడు లక్షలాది రూపాయలను నష్టపోయిన ఉదంతం వైరా పోలీస్ స్టేషన్కు చేరింది. వైరా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరాలోని పాత బస్టాండ్కు చెందిన యువకుడు చౌడవరపు ఫణి కుమార్ సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఫణికుమార్ తండ్రి చౌడవరపు రాజమోహన్ రావు వెంకటరమణ మెడికల్ షాపును నిర్వహిస్తున్నారు. ఫణి కుమార్ ఫోన్ కు ఈ నెల 23వ తేదీన రేష్మ అనే యువతి (మొబైల్ నెం. 9666596428) ఫోన్ నెంబర్ నుంచి ఓ మెసేజ్ వచ్చింది. మీరు హెచ్సీఎల్ టెక్నాలజీ నుండి పార్ట్ టైం ఉద్యోగం ద్వారా రోజుకు రూ.1000 నుండి రూ.2500/- డబ్బులు సంపాదించే ఒక అవకాశం ఉందని ఆ మెసేజ్ లో రేష్మ పోస్ట్ చేసింది. అనంతరం ఫణి కుమార్ కు ఉన్న మరో ఫోన్ నెంబర్ ను టెలిగ్రామ్ గ్రూపు అయిన 999 గ్లోబల్ వర్క్ గ్రూప్ లో యాడ్ చేసింది. తరువాత ఆ గ్రూపులో ఆ యువతి యూట్యూబ్ వీడియోలు పంపించి ఫణి కుమార్ ను ఆ వీడియోలు చూడమని చెప్పింది. ఆ వీడియోలు ఫణి కుమార్ చూడగా ఒక్కొక్క వీడియోకు రూ.50/- చొప్పున 20 వీడియోలకు రూ.1000/- నగదును ఫణి కుమార్ బ్యాంకు అకౌంటుకు ట్రాన్స్ఫర్ చేసింది.

ఆ తరువాత మీరు ఒక వెబ్సైట్లో రిజిష్టర్ కావాలని టెలీగ్రామ్ ద్వారా అ యువతి మరలా మెసేజ్ చేసింది. మీరు ఇందులో పెట్టుబడి పెడితే తాము మీ డబ్బును రెట్టింపు చేసి ఇస్తామని ఆ యువతి ఫణి కుమార్ కు అత్యాశ చూపించింది. దాంతో అతను మార్చి 23వ తేదీనే రూ.5,000/- యూపీఐ ద్వారా ఆమెకు పంపారు. ఆ తరువాత రూ.30,000/- యూపిఐ ద్వారా పంపించాడు. అనుమానం వచ్చి నగదును విత్ డ్రా చేసుకుంటానని ఫణి కుమార్ ఆమెను కోరగా ఈ నగదును విత్ డ్రా చేయడం కుదరదని ఆమె తెలిపింది. మీరు మూడు టాస్క్ లను పూర్తి చేస్తేనే మీ డబ్బులు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. దీంతో మళ్ళీ 90,000/- పంపించాలని ఆమె చెప్పగా రూ. 40,000/- ఒకసారి, రూ.50,000/- రెండవసారి మొత్తం రూ. 90,000/- లను అదే రోజు ఫణి కుమార్ పంపాడు. మరో టాస్క్ కు రూ.3,50,000/- పంపించాలని ఆమె సూచించగా అదే రోజు ఆమె పంపించిన బ్యాంకు అకౌంటుకు రూ.3,50,000/- లను ఫణి కుమార్ ట్రాన్స్ఫర్ చేశారు. ఇలా అనేక టాస్కుల పేరుతో మొత్తం 7.80 లక్షల రూపాయలను ఫణి కుమార్ ఆమె అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేశారు. మరలా అమౌంట్ ను ట్రాన్స్ఫర్ చేయాలని ఆమె ఫణి కుమార్ ను ఒత్తిడి చేసింది. దీంతో అనుమానం వచ్చిన ఫణి కుమార్ విచారణ చేయగా అది నకిలీ వెబ్సైట్ అని తేలింది. తాను మోసపోయానని గ్రహించిన ఫణి కుమార్ సైబర్ క్రైమ్ కాల్ సెంటర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసాడు. అనంతరం సైబర్ క్రైమ్ అధికారులకు తాను నగదు ట్రాన్సాక్షన్ చేసిన అకౌంట్ నెంబర్ వివరాలను పంపాడు. ఈ విషయమై ఫణి కుమార్ మంగళవారం వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో సర్పంచ్ తనయుడు మృతి

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలం పాతకారయ్య గూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ చీకటి చిట్టెమ్మ తనయుడు మురళి(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మురళికి సోమవారం సాయంత్రం గుండెపోటు రావడంతో హుటాహుటిన హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కన్నుమూశాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా తిరిగే మురళి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ సభ్యులు మృతి

పార్థివ దేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన మద్దినేని రామారావు (63) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పార్టీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి కోటేశ్వరరావు, నాగులవంచ వెంకట్రామయ్య, లగడపాటి అప్పారావు, బుర్రి రవికుమార్, మాదల వెంకట నరసయ్య, కొండపాటి గురవయ్య, కొం డపాటి శివయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణంలోని జవహర్నగర్లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సంఘ సభ్యులకు మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. వరంగల్ శరత్ కంటి ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స నిమిత్తం ముగ్గురిని వరంగల్ తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కేశవరెడ్డి, బద్రుద్దీన్, జిల్లా నాయకులు చెంచిరెడ్డి బోడేపూడి బాబు, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి, వైద్య సిబ్బంది సాయిపవన్, వంశీ పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

మున్సిపాలిటీ పరిధిలోని జవహర్నగర్లో నిరుపేద వృద్ధులకు, దివ్యాంగులకు పట్టణానికి చెందిన సనాతన ఆయుర్వేద వైద్యురాలు, సుధాహెర్బల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమకు చేతనైనంతలో ఇతరులకు సహాయపడాలని కోరారు. సరుకులు అందుకున్న పేదలు మాట్లాడుతూ వృద్ధులను సొంతవాళ్లే భారమనుకుంటున్న ఈ రోజుల్లో తమ స్థితిని చూసి చలించి సహాయపడేందుకు ముందుకు వచ్చిన సుధారాణి దాతృత్వాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని కొనియాడుతూ సుధారాణికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి కూలీలకు గాయాలు

నవతెలంగాణ-కారేపల్లి

మిర్చి కూలీలతో వెళ్తుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో దానిలో ప్రయాణిస్తున్న కూలీలు తీవ్రగాయాలైన ఘటన కారేపల్లి మండలం భాగ్యనగర్తండాలో మంగళవారం జరిగింది. భాగ్యనగర్తండాకు చెందిన మహిళలు జర్పుల బాలాజీ అనే రైతు మిర్చితోట కూలీ పనికి వెళ్ళి ఇంటికి తిరిగివస్తున్నారు. ట్రాక్టర్ మిర్చి లోడ్పై 36 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. భాగ్యనగర్తండా రైల్వే ట్రాక్ సమీపంలోని డొంక రోడ్డు గుంత పరి సరిగా లేక పోవటంతో ట్రాక్టర్ ట్రాక్ అదుపు తప్పి పడి పోయింది. దానిలో ప్రయాణిస్తున్న 25 మందికి గాయాలు అయ్యాయి. వారిలో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలైనాయి. గాయాలైన కూలీలను ఇల్లందు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. తీవ్రగాయాలైన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన కూలీలను ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరి నందరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, సోసైటీ డైరక్టర్ మర్సకట్ల రోశయ్య, నాయకులు గుగులోత్ హారులు పరామర్శించారు.

బాధిత కుటుంబానికి సీపీఐ నేతల పరామర్శ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం భాగ్యనగర్తండాకు చెందిన అమృ ను సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మంగళవారం పరామర్శించారు. అమృ గుండె జబ్బుతో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు అమృ ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అమృను పరామర్శించిన వారిలో జిల్లా నాయకులు యర్రబాబు, సీతామహాలక్ష్మి మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, నాయకులు చెరుకూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంటల నమోదు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిని వల్లభిలో ఇటివల కాలంలో అకాల గాలి, వర్షాలకు నేలవాలి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారి పెరుమాళ్ళ రఘు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగు చేసి అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతుల పేర్లను ఆయన నమోదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో పర్యటించి అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న సాగుకు ఎకరానికి పదివేల రూపాయలు రైతులకు ఇస్తానన్న విషయం విదేతమే.కాగా ఎకరానికి రూ 10 వేలు కాకుండా రూ 20 వేలు ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు, కాంగ్రెస్ పార్టీ మూడో జోన్ ఇన్చార్జి పిల్లుట్ల రాఘవ, రైతులు వందనపు రాంబాబు, కొండా వెంకటేశ్వర్లు, కొండా రామారావు, వందనపు సతీష్, కొండా సత్యనారాయణ, ఏనుగుల చిన్నరాములు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

ఎంఎల్ఏ రాములునాయక్

నవతెలంగాణ-కొణిజర్ల



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి మీరంతా ఆశీర్వదించాలని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్కి మాత్రమే దక్కుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. మండల పరిధిలోని తీగలబంజర పంచాయతీ పరిధిలోని మంగాపురం ఫంక్షన్హాల్ మంగళవారం కొణిజర్ల మండల బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వై.చిరంజీవిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైరా నియోజవర్గ ఎమ్మేల్యే లావుడ్యా రాములు నాయక్ మాట్లాడుతు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకోసం 2006లో కేసీఆర్ తెగించి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడాని అన్నారు. తెలంగాణ సాధిస్తే నీళ్ల, నిధులు, నియామకాలు వస్తాయని కేసీఆర్ చెప్పారని దాని ప్రకారం బీడుభూములను పంటపొలాలుగా మార్చేందుకుగాను కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు సీతారమా ప్రాజెక్టు ఇంకా అనేక కొత్త ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణ భూములను సస్యశ్యామలం చేశాడని అన్నారు. కేంద్రప్రభుత్వం సహకరించకున్నా అనేక నిధులు వెచ్చించి దేశంలో ఎక్కడాలేని అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. ముందుగా తీగలబంజర గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తీగలబంజర సర్పంచ్ అబ్దల్ బీ , జెడ్పీటిసి పోట్ల కవిత, బిఆర్ఎస్ కొణిజర్ల మండల అధ్యకుడు చిరంజీవి, మండల ప్రధానకార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు. సుడా డైరెకర్ బండారు కృష్ణ, చెరుకుమల్లి డేరంగుల బ్రమ్మం పొట్ల శ్రీనివాస్రావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కిలారు మాధవరావు, దోడ్డపనేని రామారావు, సర్పంచ్ల సంఘం మండలాద్యాక్షుడు చల్లా మోహన్రావు, మూడ్ సురేష్, సర్పంచ్లు, ఎంపీటీసీలు మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్వరమే పంట నష్టం సర్వే పూర్తి చేయాలి

నవతెలంగాణ-కొణిజర్ల



అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను సత్వరమే పంట నష్టం సర్వే పూర్తి చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కొణిజర్ల మండలం, మంగాపురం, లక్ష్మీపురం, పెద్ద రాంపురం గ్రామంలలో పంటల పరిస్థితిని తెలంగాణ రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సర్వేకి ఇంతవరకు వెళ్ళలేదు అన్నారు, మొక్కజొన్న మార్చి 16న అకాల వర్షాల కారణంగా కింద పడి దెబ్బతిన్న పదిహేను రోజుల అవుతుంది అని అధికారులు సర్వేకి రాకపోవడంతో అ పంట అరకొరగా ఉన్న కంకులు ఏమి చేయాలో రైతులకు అర్థం కావడం లేదన్నారు. స్థానిక వ్యవసాయ అధికారుల దృష్టికి రైతులు తీసుకుపోతే ప్రభుత్వ గైడులైన్స్ రాలేదని సమాధానం వినిపిస్తోంది అని అన్నారు. సర్వే జరిపిన వ్యవసాయ అధికారులు పంట కొలుతలు వేస్తు రైతులను ఆవేదనకు గురి చేయడం సరికాదని అన్నారు. కింద పడిన మొక్కజొన్న పంట కంకులు విరవడానికి పదివేలు రూపాయలు కూలీలు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు నిబంధనల పేరుతో పంట నష్టం తక్కువ నమోదు చేయటంకు ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళపల్లి కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు దుగ్గినేని అజయ్, కావూరి సత్యనారాయణ, బానోత్ హరిచంద్, షరీఫ్ రైతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కారేపల్లి ఎస్ఐ

తల్లి లేని పసి బిడ్డకు పాలకు సాయం

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు మానవత్వం చాటుతూ తన సేవా భావంతో మండల ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. పేద విద్యార్థులకు వికలాంగులకు, వృద్ధులకు అనేక రకాలాగు సాయం అందిస్తున్న కారేపల్లి ఎస్సైరామారావు చంటి పిల్ల పాల కొరతతో కుటుంబం ఇబ్బందులు పడుతుండగా తెలుసుకొని పసి పిల్ల పాలకు పాలపొడి డబ్బాలను అందించి తన మానవత్వం చాటుకున్నారు. కారేపల్లి మండలం పేరుపల్లి కిచెందిన ఏనుగు నవ్య చంటి పిల్లకు జన్మనిచ్చి నెల రోజులకు అనారోగ్యంతో మృతి చెందింది. చంటి పిల్ల ఏనుగు వేదశ్రీ(6నెలలు) తల్లి చనిపోవటంతో నాయనమ్మ గౌరమ్మ చంటి పిల్లను సాకటానికి అనేక ఇబ్బందులు పడుతుంది.. పేద ఆదివాసీ కుటుంబమైన గౌరమ్మ కుటుంబం కూలీకి వెళ్లితే గాని పూట గడవదు. ఈ పరిస్థితిలలో చండి పిల్లలు సాకటం వారికి భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు చంటి పిల్లకు రూ.5వేల తో నెలకు అవసరమైన పాలపోడి డబ్బాలు, ఇతర సామానులను సింగరేణి సీఐ నూనె వెంకటేశ్వర్లుచేతుల మీదిగా మంగళవారం పసి పాప అమ్మమ్మ గౌరమ్మకు అందజేశారు. ఎస్సై ఔదార్యాన్ని పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, పేరుపల్లి సర్పంచ్ అజ్మీర నాగేశ్వరావు, ఉపసర్పంచ్ బుడిగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖపై హైకోర్టులో రిట్ వేసిన వైరా మున్సిపాలిటీ చైర్మన్

విచారణ పేరుతో పోలీసులు వేధిస్తున్నారని ఆరోపణ

నవతెలంగాణ-వైరా

వైరా పోలీసులు తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరుతూ వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ రాష్ట్ర హైకోర్టులో సోమవారం లంచ్ మోషన్ రిపిటిషన్ వేశారు. దాంతో న్యాయమూర్తి దాన్ని విచారణకు స్వీకరించారు. జైపాల్ వేసిన రిట్పై పోలీసుశాఖ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. వైరా మునిసిపాలిటీలోని సోమవరం గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకును 2022 డిసెంబర్ 12న కూల్చివేశారు. ట్యాంక్ కూల్చివేతపై ఫిబ్రవరి 22వ తేదీన 16 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 15న మునిసిపల్ ఇన్చార్జ్ కమిషనర్ బి.అనిత సోమవరంలోని ట్యాంకును గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని, దీనిపై విచారణ నిర్వహించి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వైరా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంక్ను కూల్చివేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు విచారణను మొదలుపెట్టారు. ట్యాంక్ను కూల్చివేసిన తర్వాత స్థలాన్ని స్వాధీనం చేసుకున్న వ్యక్తిని, ట్యాంక్ కూల్చివేతలో కీలకంగా వ్యవహరించిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారంరోజులుగా విచారణ చేస్తున్నారు. ఈ ట్యాంక్ కూల్చివేత వెనుక ఉన్న వారి పేర్లతో పాటు, వారికి ముట్టిన నగదు వివరాలను సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. దింతో ఈకేసుకు సంబంధించి విచారణకు రావాలని చైర్మన్ జైపాల్ను పోలీసులు మౌకికంగా పలుసార్లు సమాచారం ఇచ్చారు. అయితే విచారణకు హాజరుకాని జైపాల్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి పోలీసులు వేధిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని, ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా చూడాలని కోరుతూ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మునిసిపల్ చైర్మన్గా ప్రథమ పౌరుడిగా ఉన్న తనను ప్రజలకు ఎలాంటి సేవ చేయకుండా విచారణ పేరుతో వేదిస్తున్నారని, ట్యాంక్ కూల్చివేత ఫిర్యాదులో కానీ, నమోదైన కేసులో కానీ తన పేరు ఎక్కడా లేకపోయినప్పటికీ కొంతమందిని సాక్ష్యాల పేరిట పోలీస్ స్టేషన్కు పిలిచి వారిని బెదిరించి తనపై చర్యలు తీసుకొనేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను నిలువరించి తనకు న్యాయం చేయాలని ఆ రిట్లో న్యాయస్థానాన్ని కోరారని సమాచారం. సోమవారం రాత్రి జైపాల్ రిట్కు సంబంధించిన సమాచారం పోలీస్ శాఖకు అందినట్లు తెలిసింది.

ప్రమాదవుశాత్తు రైతు మృతి

- నివాళుర్పించిన జెడ్పీటీసీ శ్రీలత

నవతెలంగాణ-బూర్గంపాడు

పోలంలో చెత్తను తగలబెడుతున్న క్రమంలో ప్రమాదవుశాత్తు రైతు మృతి చెందిన విషాద సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన కలసాని బాబు (65) అనే రైతు సోమవారం తన పోలంలో (జామాయిల్ తోటలోని చెత్తను తగలబె ట్టెందుకు సోమవారం మధ్యాహ్న సమయంలో వెళ్లాడు. సాయంత్రం సమయానికి రైతు ఇంటికి చేరుకో కపోవడంతో కుటుంబసభ్యులు పోలం వద్దకు వెళ్లారు. పోలంలో చెత్తను తగలబెట్టిన ప్రదేశానికి సమీపంలో పడి మృతి చెంది ఉండటం గుర్తించారు. మృతుడికి భార్య నాగమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మంగళవారం మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బోధన అభ్యసనాలు భేష్

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అభ్యసనాలు భేష్‌గా ఉన్నాయని స్టేట్ మానిటరింగ్ టీం ప్రశంసించింది. మండల పరిధిలోని సుభాష్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను టీం లీడర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బోధన అభ్యసన సామర్థ్యాల సాధనను పరిశీలించారు. విద్యార్థుల్లో గణితం, ఇంగ్లీష్, తెలుగు, సైన్సు సాధ్యాలను పరీక్షించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందున పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో రాష్ట్ర బృందం సభ్యులు రాజశేఖర్, వెంకటయ్య, బాలమురళి, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ ఆఫీసర్ పివిఆర్ఎస్ స్వామి పాల్గొన్నారు.

సమస్యలపై గవర్నర్‌ని కలువనున్న ఆదివాసీసేన

- జిల్లా ఉపాధ్యక్షులు వజ్జా జ్యోతిబసు

నవతెలంగాణ-మణుగూరు

ఆదివాసి సమస్యలపై గవర్నర్ తమిళ సైని ఆదివాసీసేన, ఆదివాసి సంఘాలు కలువనున్నాయని జిల్లా ఉపాధ్యక్షులు వజ్జా జ్యోతిబసు అన్నారు. మంగళవారం ఆదివాసీసేన విస్తృత సమావేశం నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి ప్రాంతాల పట్ల, ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై చిత్తశుద్ధితో వ్యవహరించట్లేదని ఆదివాసీల ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అక్రమ పద్ధతులు 11 కులాలు కలపడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షులు వజ్జ జ్యోతి బసు అన్నారు. నీళ్ళ నిధులు నియామకాలు పేరుతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసుల మనుగడును ప్రశ్నించే విధానము అవలంబిస్తుందని దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు జిల్లా, మండల నాయకులు గనిబోయిన ముత్తయ్య, పుణ్యం నాగరాజు, బండారి కృష్ణ గనిబోయిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట జీసీసీ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జీసీసీ మేనేజర్ సుగ్గలనరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. దమ్మపేట జీసీసీ ద్వారా హాస్టల్ విద్యార్థులకు మెరుగైన నిత్యవసరకులు, రెండు ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా నాణ్యమైన ఇంధనం, జీసిసి అద్భుతంగా నడుస్తుందని గిరిజన ప్రాంతాల్లో ఉండే ప్రజలు డియర్ డిపోల ద్వారా ప్రస్తుతం ఇచ్చే నిత్యవసర సరుకులు కాకుండా ఇంకా ఏమైనా నిత్యవసరసరుకులు కావాలని డిపో నుండి అందజేస్తామని తెలిపారు. అనంతరం అశ్వారావుపేట మండలంలోని ఆసుపాక గ్రామంలో గిరిజన ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు తీర్మానం చేశారు. అనంతరం మహిళలకు సన్మానం చేశారు.

సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాల విద్యకు నిలయాలు

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి పాఠశాలలో ఉన్నత ప్రమాణాలకు విద్యానిలయాలని ఇంచార్జ్ ఎస్ఓటు జీఎం వెంకటరమణ అన్నారు. ఏరియా పివి కాలనీ సింగరేణి పాఠశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వెంకట రమణ, స్కూల్ కరస్పాండెంట్ డిజీఎం(పర్సనల్) ఎస్.రమేశ్ పాల్గొని మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు వివిధ రంగాలలో రాణిస్తూ ఉన్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత చదువులు చదువుతూ, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తూ గొప్ప విద్యావంతులుగా ఎదిగి తాము చదువుకున్న పాఠశాల పేరు ప్రతిష్టలు మరింతగా పెంచాలని సూచించారు. సింగరేణి పాఠశాల హెచ్ఎం ఈజీఎస్ స్వరూప రాణి మాట్లాడుతూ..పదిలో 10/10 ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానే ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ఆర్.కల్యాణి, ఎస్.అనురాధ, ఎం.కృష్ణబాబు, ఉపాధ్యాయులు. ఉపాధ్యతర సిబ్బంది, విద్యార్థులు ఆదితరాలు పాల్గొన్నారు.





నూతన బ్రాంచ్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సీఐటీయూ యూనియన్‌లో నూతన బ్రాంచ్ కమిటీ ఎన్నిక జరిగింది. మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సహాయ కార్యదర్శి గిడ్ల శ్యామ్ కుమార్, అధ్యక్షులు. మొల్లంగూరి శేఖర్, కోశాధికారిగా సూరం ఐలయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు బి.మధు, సమక్షంలో, సీఐటీయూ నాయకులు భూక్య రమేష్, వీరన్న సమక్షంలో కమిటీ మెంబర్స్ 38 మంది సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు ఈ బాధ్యతలు నిర్వహిస్తామని, నమ్మి మాకు అప్పజెప్పినందుకు, ఎల్లప్పుడూ అన్నివేళలా కార్మికులకు అండగా ఉంటామని, అందరినీ ఐక్యంగా కలుపుకుంటూ ముందుకు నడుస్తామని, నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతామని తెలిపారు.



10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు వితరణ

నవతెలంగాణ-జూలూరుపాడు

జెపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షకిట్లు వితరణగా చేశారు. మంగళవారం జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సందర్భంగా ఈ సందర్భంగా జేపిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ఇడుపుల రాజు మాట్లాడుతూ పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కిట్లు అందజేయడం జరుగుతుందన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బాలాజీ, యం.శ్రీనివాస్ రావు, బాలు, సంపత్, శ్రీనివాస్ రెడ్డి, మిరియాల రమేష్, కిరణ్ కుమార్, దొండపాటి వాసు, కరుణ, తంబర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 29 మార్చి 2023

పోలీస్ అభ్యర్థులకు మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-కొత్తగూడెం



పోలీస్ ఫిజికల్ ట్రైనింగ్‌లో అర్హత సాధించిన పలువురు అభ్యర్థులకు ఫైనల్ పరీక్ష నిమిత్తమై కాంపిటీటివ్ ఎగ్జామ్ మెటీరియల్‌ను ఏరియా జీఎం జక్కం రమేష్ అందజేశారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలంలో జరిగిన కార్యాక్రమంలో పోలీస్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జీఎం చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్ చదువుకొని అభ్యర్థులందరూ అర్హత పొందాలని, ప్రిపేర్ అవడానికి ఎక్కువ సమయం కేటాయించాలని అభ్యర్థులందరూ విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఏజీఎం పర్సనల్ పి.సామ్యూల్ సుధాకర్, సీనియర్ పిఓ జి సుధాకర్, సిఎంఓ ఏఐ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి.రామకృష్ణ, పోలీస్ ట్రైనింగ్ అర్హత పొందిన అభ్యర్థులు, త్రిబుల్ ఎస్ కో-ఆర్డినేటర్ సిహెచ్.సాగర్, కమ్యూనికేషన్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఆఫీస్ సిబ్బంది రామాల ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ జీరో వ్యర్థ దినోత్సవం ర్యాలీకి ఇల్లందు, పీర్జాదిగూడ ఎంపిక



- ఇల్లందు మున్సిపాలిటీ చైర్మెన్‌కు ఆహ్వానం
- అందరి కృషితో సాధ్యమైంది : చైర్మెన్ డివి

నవతెలంగాణ-ఇల్లందు

కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు రేపు బుధవారం ఢిల్లీలో నిర్వహిస్తున్నటువంటి అంతర్జాతీయ జీరో వ్యర్థ దినోత్సవం, వ్యర్థ రహిత నగరాల కోసం ర్యాలీకి తెలంగాణ రాష్ట్రం నుండి ఇల్లందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆహ్వానం అందుకున్నారు. ఇరువురు నేడు ఢిల్లీ బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరి హాజరై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి దేశ వ్యాప్తంగా వ్యర్థ నిర్మూలన కోసం తీసుకున్నటువంటి చర్యలు, ఉత్తమ పద్ధతుల గురించి చర్చించనున్నారు. అనంతరం చెత్త రహిత నగరాల తీర్మానన్ని (Resolve for Garbage Free Cities) ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఇల్లందు పట్టణ కీర్తిని రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజధాని ఢిల్లీలో మున్సిపాలిటీ తరఫున ఐదు నిమిషాల వీడియోని ప్రదర్శించనున్నారు.



అభినందించిన ఎమ్మెల్యే హరిప్రియ, ప్రజా ప్రతినిధులు ప్రముఖులు


అంతర్జాతీయ జీరో వ్యర్థ దినోత్సవం ర్యాలీకి ఇల్లందు మున్సిపాలిటీ ఎంపిక కావడం మున్సిపల్ చైర్మన్ డివిని కమిషనర్ అంకుల్ షావలిని ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయక్, పాలకవర్గం, ప్రజా ప్రజా ప్రతినిధులు అధికారులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

అందరి కృషితో సాధ్యమైంది : చైర్మెన్ డీవీ

బృహత్తర కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి ఆహ్వానం అందడం చాలా ఆనందంగా ఉందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. పురపాలక శాఖ మాత్యులు కేటీఆర్, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, సీడీఎంఏ కమిషనర్ సత్యనారాయణ, స్థానిక శాసన సభ్యురాలుహరిప్రియ నాయక్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కౌన్సిలర్లకు, అధికారులు, పార్టీ పెద్దలు, పట్టణ ప్రజల సహకారంతోనే ఈ రోజు ఈ అవకాశం దొరికిందని తెలిపారు.

నాణ్యతలేని బంకర్ల నిర్మాణం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి యాజమాన్యం నాణ్యతలేని బంకర్లను నిర్మించి కంపెనీకి తీవ్ర నష్టం చేకూర్చాయని సింగరేణి కాల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ విమర్శించారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి సంస్థకే తలమానికంగా పనిచేస్తున్న డివిజన్ మణుగూరు డివిజన్ అని తెలిపారు. కార్మికులు ఎంతో కష్టపడి యాజమాన్యం నిర్ణయించిన ఉత్పత్తిని కంటే అధికంగా సాధిస్తున్నారని తెలిపారు. కొండాపురం సీఎస్పీలో ఇటీవల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి బంకర్లు ఏర్పాటు శేషారన్నారు కానీ నాణ్యత లేకపోవడం వలన కంపెనీ నష్టపోతుందని తెలిపారు. పైనుంచి బొగ్గు కింద పడితే ఐరన్ షెడ్లు రాడ్లు నాణ్యత లేకపోవడం వలన ధ్వంసం అయ్యాయని, ఇంకా ప్రారంభం కాకముందే పగిలిపోయాయని తెలిపారు.

రైతుల అభివృద్ధికి సహకార సంఘం

- చైర్మెన్ మండె వీరహనుమంత రావు

నవతెలంగాణ-కొత్తగూడెం



రైతులు ఆర్థికంగా ఎదగడానికి కొత్తగూడెం సహకారం సంఘం నిరతంరం కృషి చేస్తుందని సహకార సంఘం చైర్మెన్ మండె వీర హనుమంత రావు అన్నారు. మంగళవారం చుంచుపల్లిలోని సహకారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం సహకార సంఘం అభివృద్ధి చెందుతూ, రైతులకు నిత్యం సేవ చేయటం జరుగుతుందన్నారు. సహకార సంఘం ద్వార ఎంఆర్పీ ధరలకు సుమారు రూ.1 కోటి 14 లక్షల విలువగల ఎరువులను రైతులకు అందించటం జరిగిందన్నారు. రూ.33 లక్షల విలువగల విత్తనాలను సబ్సిడిపై రైతులకు ఇచ్చామన్నారు. గత వానకాలం పంట సీజన్‌లో 1075 మంది రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించి ప్రభుత్వం కేటాయించిన మిల్లులకు పంపిచటం జరిగిందని, 1075 మంది రైతుల ఖాతలో రూ.14 కోట్ల 11 లక్షల నగదును జమ చేయటం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి రుణ మాఫీ అయిన 283 మంది రైతులకు పంట రుణాలుగా రూ.1 కోటి ఇవ్వటం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 84 మంది రైతులకు నూతన పంటరుణాలను రూ.16 లక్షలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం సహకార సంఘంలో పంట రుణం తీసుకొన్న రైతులు 31 మార్చి 2023 తేది వరకు పంట రుణం వడ్డీలను చెల్లించాలని, అలా చేలించిన రైతుల రుణాలు వాయిదా మీరి ప్రభుత్వం కల్పించే వడ్డీ రాయితీ పథకానికి అర్హులు కారని అలాగే 13 శాతం అపరాధ వడ్డీ కట్టవలసి వస్తుందని వివరించారు. సొసైటికి నూతన భవన నిర్మాణము కోసం సంఘ మహాజన సభ నందు తీర్మానము చేయటం జరిగిందిని, ప్రభుత్వం ప్రకటించిన రూ.90 వేల రుణ మాఫీ పథకను కొత్తగూడెం సంఘంనకు వర్తింప చేయాలని తీర్మానము చేయటం జరిగింది. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాథరావు, సొసైటి సీఈఓ పండ్ల సారయ్య, కార్యవర్గ సభ్యులు వేల్పుల మల్లేష్, బండి అమృత రావు, గుగులోతు చందర్, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాస్ రావు, గుగులోతు విజయ, కంటెం సత్యనారాయణ రైతులు లక్ష్మీపతి, రవిందర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దేశమంటే అంబానీ, ఆదానీల సొత్తుగా మార్చిన ఘనత మోడీదే

- 29న జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి
- బహిరంగ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



భారత దేశమంటే అంబానీ, ఆదానీల సొత్తుగా మార్చిన ఘనత మోడీదేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. గవర్నర్ల వ్యవస్థను ఆర్ఎస్ఎస్ నాయకులతో నింపి రాష్ట్రాల హక్కులను కాల రాస్తున్నాని ఇది ప్రజాస్వామ్యానికి చేటన్నారు. మతోన్మాద, కార్పోరేట్ విధానాల బిజెపిని గద్దె దించుదామని పిలుపునిచ్చారు. స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్లో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను ఆర్ఎస్ఎస్ నాయకులతో నింపి రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. అందులో భాగంగానే రాహుల్ గాంధీని కేసులో ఇరికించి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. ఇలాంటి బీజేపీ పాలకులను తెలంగాణలో రాకుండా నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అన్నారు.

జీవో నెంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వం పట్టాలివ్వాలి సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని



సీయం కేసీఆర్ ప్రకటించిన జీవో నెంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. రాజీవ్ నగర్, సున్నం రాజయ్య నగర్, సంజయ్ నగర్, ఆర్ అండ్ ఆర్ కాలనీ, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చి గుడిసె వాసులకు ఇళ్ళు నిర్మించి పేదల సొంతింటి కల నిజం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ తాళ్లూరి కృష్ణ మన్యం మోహన్ రావులు మాట్లాడారు. ఈ బహిరంగ సభలో సుల్తానా, మునిగంటి లక్ష్మి, ఎస్కే ఖాదర్, సర్వస్ పాసి, వాసం రాము, రాందాస్, విజయ,రాజు, వీరభద్రం, పాష, హుస్సేన్, కౌసల్య సుజాత, గోబ్రి య, వీరస్వామి, కాంతి, వైకుంఠం, వెంకన్న, సామ్రాజ్యం, వరలక్ష్మి, లక్ష్మీ రమాదేవి, సునీత, భీముడు, తీర్థాల కుమారి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-చుంచుపల్లి

చుంచుపల్లి మండల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీపీ బాదవత్ శాంతి శంకుస్థాపన చేశారు. మంగళవారం మండలంలో ప్రశాంతి నగర్ గ్రామ పంచాయతీ నందు మండల ప్రజా పరిషత్ ఎస్ఎఫ్‌సి నిధులతో రైతు వేదిక నందు రూ.4.46 లక్షల సీసీ రోడ్డు కోసం కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ భూక్యా రుక్మిణీ, ఎంపివో సత్యనారాయణ, ఏఈ నాగేందర్, సెక్రటరీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై శిక్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి గ్రామ పంచాయతీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వేసవి అపరాల సాగు పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ శాంతి, అగ్రికల్చరల్ ఆఫీసర్ కరుణశ్రీ, ఉపసర్పంచ్ శ్రీహరి, ఏఇఓ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ నిర్మల జ్యోతి అన్నారు. మంగళవారం చంద్రుగొండ, రవికంపాడు సెక్టార్లలో జరిగిన పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు వయసుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలన్నారు. సర్పంచ్ భానుతురానయ, సూపర్వైజర్లు రాణి, శకుంతల, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా హెల్త్ క్యాంప్ ఎలా నిర్వహించారు

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర కామేష్

నవతెలంగాణ-సుజాతనగర్



తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తన రాజకీయ ఆకాంక్షతో ఎటువంటి అనుమతులు లేకుండా హెల్త్ క్యాంప్‌ను ఎలా నిర్వహించారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర కామేష్ అన్నారు. మంగళవారం సింగభూపాలెం గ్రామంలో పర్యటించి మాట్లాడుతూ హెల్త్ క్యాంపులు నిర్వహించటానికి ప్రజాసేవ చేయుటానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని హెల్త్ క్యాంపుల పేరుతో రాజకీయం మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డీఈఓ, ఎంఈఓ, హెడ్మాస్టర్‌కి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా హెల్త్ క్యాంపు నిర్వహించారని అన్నారు. ఈ హెల్త్ క్యాంప్ పై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కొత్తగూడెం కేంద్రంగా గడల శ్రీనివాస్ పోషిస్తున్న ద్విపాత్రాభినయాన్ని బీఎస్పీ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండేటి ఆదినారాయణ, కాకటి బాబు, భీమాపోగు వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, కాకటి రవి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు కనువిప్పు కలిగించేందుకు సీపీఐ పోరుయాత్ర

నవతెలంగాణ-బూర్గంపాడు

పాలకులకు కనువిప్పు కలిగించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో పోరు యాత్రలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. బూర్గంపాడు మండలం సారపాక కపర్తి భవనంలో మంగళవారం సీపీఐ మండల కార్యవర్గ సమావేశం సబ్కా నాగేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా అయోధ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు మున్నా లక్ష్మి కుమారి, పినపాకనియోజకవర్గం కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా అయోధ్య మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుండి జిల్లాలో జరగబోయే సీపీఐ పోరు యాత్రను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సభ్యులు అలవాల సీతారామరెడ్డి, పేరాల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి ముమ్మా వెంకటేశ్వరావు, సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం, సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షులు ఎండి సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబావుల అమ్మకం దేశానికే ముప్పు

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ

నవతెలంగాణ-మణుగూరు

బొగ్గుబావుల అమ్మకం దేశానికి ముప్పు అని, స్వదేశీ బొగ్గును సమాధి చేసి విదేశీ బొగ్గు దిగుమతి అదాని కోసమేనని, జేబీసీసీఐ వేతనాలు, సౌకర్యాలు కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి జి.అనురాధ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో బొగ్గుగనులను అమ్ముకోవడం సిగ్గుచేటని, 1లక్ష 16 వేలమంది కార్మికులు, లాభాలతో నడుస్తున్న సింగరేణి కంపెనీలో నేడు 42,000 మందికి తగ్గించి 35వేల మంది కాంట్రాక్టు కార్మికులను వినియోగిస్తున్నారని, పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమని అనురాధ,ఎస్‌సీసీడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాసుద్దిన్ ఆవేదన వ్యక్తం చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 2, 3లలో కొత్తగూడెంలో నిర్వహిస్తున్నందున సభల ప్రచారంలో భాగంగా మణుగూరులో సోలార్ పవర్ ప్లాంట్, దుర్గా కంపెనీ, సివిల్ డిపార్ట్మెంట్‌లో ప్రచార సభలు నిర్వహించారు. సింగరేణి కేంద్రంలో నిర్వహించబడుతున్న ఇష్ట రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 2న వేలాది మంది కార్మికులతో మహా ప్రదర్శన ఉంటుందని అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో బహిరంగసభ నిర్వహించబడుతుందని ఈ సభలో ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, విప్లవ కార్మిక నాయకులు అమితాబ్ (బెంగాల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాసు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సింగరేణి, ఆర్టీసీ, భవన నిర్మాణ, నవభారత్, కేటీపీఎస్, హెవీవాటర్ ప్లాంటు, అసంఘటిత రంగ కార్మికులకు అనురాధ విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్టియు నాయకులు మంగిలాల్, కాంతారావు, శ్రీనివాసరావు, దేవేందర్ ప్రేమ్ కుమార్, మనోజ్, సత్యనారాయణ, సుబ్బారావు, వేణు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగు ద్వారా పామాయిల్ పంటకు సమాంతర ఆదాయం

- కొబ్బరి అభివృద్ధి మండలి స్టేట్ సెంటర్ అధికారి కిరణ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



కొబ్బరి సాగు ద్వారా ఫాం ఆయిల్ పంటకు సమాంతరంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని కొబ్బరి అభివృద్ధి మండలి రాష్ట్ర కేంద్రం అధికారి ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి, తెలంగాణ ఉద్యాన శాఖ ఉమ్మడిగా సోమవారం మండల పరిధిలోని అచ్యుతాపురంలో గల ఓ రైతు కొబ్బరి క్షేత్రంలో తెలంగాణ కొబ్బరి రైతుల ఉత్పత్తిదారులు సంఘం పర్యవేక్షణలో పలువురు ఔత్సాహిక రైతులకు క్షేత్ర దినోత్సవం పురస్కరించుకుని అవగాహణ కల్పించారు. ఈ సంఘం నాయకులు తలశిల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహణ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న కిరణ్ మాట్లాడుతూ నూతన ప్రాంతాల్లో కొబ్బరి సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా బోర్డు తగు ప్రణాళిక రూపొందించిందని, ఇందులో భాగంగా ముందుగా గ్రామ స్థాయిలో రెండోదిగా మండల స్థాయిలో అనంతరం జిల్లా స్థాయిలో అవగాహణ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏప్రియల్‌లో విస్తృత పరిధిలో సాగు పై అవగాహణ కల్పిస్తామని, ఈ కార్యక్రమాలకు బోర్డు ఉన్నతాధికారులు హాజరు అవుతారని తెలిపారు. ఉద్యాన శాఖ నియోజకవర్గం అధికారి సందీప్ మాట్లాడుతూ ఫాం ఆయిల్ మాదిరిగానే కొబ్బరి సాగుకు ఉద్యాన శాఖ రాయితీలు అందించ నున్నదని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య, పసుపులేటి ఆదినారాయణ, ఆళ్ళ నాగేశ్వరరావు, తుమ్మ రాంబాబు, నల్లపు వెంకట శివకుమార్, సంతపురి చెన్నారావు, తాడేపల్లి రవి, కొనకళ్ళ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 29 మార్చి 2023
8

రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్ల 75 లక్షల మంజూరు

- వలస ఆదివాసీ గ్రామాలకు రోడ్డు మార్గాలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ-మణుగూరు

పినపాక నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలను అభివృద్ధిపరిచి దిశలో రహదారుల అభివృద్ధి కోసం రూ.50 కోట్ల 75 లక్షల నిధులు మంజూరయ్యాయని విప్, ఎమ్మెల్యే రేగా కాంతరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం గిరిజన సంక్షేమ శాఖ నుండి ప్రత్యేక నిధులు 34 బీట్ రోడ్లకు నిధులు మంజూరయ్య అని అన్నారు. అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని ప్రధాన గిరిజన గ్రామాలలో రహదారుల అభివృద్ధి, నూతన రహదారులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా మణుగూరు మండలం రేగుల గండి ఎన్నిక సర్వయ్య గుంపు రాయన్నపేట వలస ఆదివాసి గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గానికి అధికంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నా కాంతారావుకు ప్రశంసల వర్షం ప్రజలు కురిపిస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- కొత్తగూడెం బార్ అధ్యక్షులు రమేష్ కుమార్ మక్కాడ్



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బార్ అసోసియేషన్, అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రమేష్ కుమార్ మక్కడ్, దుంద్ర రమేష్‌లను జిల్లా క్రీడా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి మాట్లాడుతూ వీరు విద్యార్థి దశలో క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో అనేక క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని, అనేక బహుమతులు గెలుపొందారని తెలిపారు. కష్టపడి చదివి లాయర్లుగా సమాజ సేవ చేస్తూ బార్ అసోసియేషన్‌కు ప్రతినిధులుగా ఎంపికవడం సంతోషకరమన్నారు. క్రీడలకు కూడా వారి సహాయ సహకారాలను అందజేయాల్సిందిగా క్రీడా సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు రమేష్ కుమార్ మక్కడ్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని కొత్తగూడెంలో జరిగే పలు క్రీడా కార్యక్రమాలకు సహాయ సహకారం అందించడంతోపాటు క్రీడా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు అవుతామన్నారు ఈ కార్యక్రమంలో నేతాజీ వ్యాయామశాల శిక్షకులు కూచన కృష్ణారావు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పి.కాశీ హుస్సేన్, పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను ఉపయోగించుకోండి

- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

మూడో విడత ఇండ్ల క్రమబద్ధీకరణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020 జూన్ వరకు సింగరేణి స్థలాల్లో గృహాలు నిర్మించుకున్న వారు అర్హులని తెలిపారు. గత రెండు విడతల్లో ఇలాంటి అవకాశం లభించిందని, మరో మారు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 58, 59 జీవోలకు సంబంధించి ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఆదేశాలు త్వరలో రానున్నాయని తెలిపారు. క్రమబద్ధీకరణ ద్వారా ప్రభుత్వమే ఇళ్ల రిజిస్ట్రేషన్ చేస్తుందని అన్నారు. ఆధారాలతో ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎవరికి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుశావళి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలియకుండా మాట్లాడటం మంచిది కాదు

నవతెలంగాణ-మణుగూరు

దళిత అధికారులపై అలెం కోటి నిందలు వేయడం సరైంది కాదని, వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం అవివేకమని మాదిగ ఐక్యవేదిక నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు రావులపల్లి రామ్మూర్తి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఒక దళిత రెవెన్యూ అధికారి పై అలెం కోటి టార్గెట్ చేసి అమ్ముడుపోయాడని, మాట్లాడటం సరిఅయిన పద్ధతి కాదని, తను మాట్లాడే పద్ధతి మార్చుకోవాలని అన్నారు. బాధితులకు అన్యాయం జరిగితే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కానీ మనసులో ఏదో పెట్టుకొని దళిత అధికారిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడతా అంటే చూస్తూ ఊరుకోము అని అన్నారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శి రావులపల్లి రామమూర్తి, గద్దల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు పొడుతూరి ప్రసాద్, విక్రమ్, ఉపాధ్యక్షుడు రమేష్, యువజన అధ్యక్షుడు బంధు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-చంద్రుగొండ

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రధాన సెంటర్లో తెలుగుదేశం పార్టీ దిమ్మె వద్ద పార్టీ జెండాను మండల అధ్యక్షుడు వారాధి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశానేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు బెల్లంకొండ పరమేశ్వరరావు, చాపలమడుగు వెంకటేశ్వరరావు, దడిగల మల్లేష్, లాలమ్మద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

ఏప్రిల్ 3, 4 తేదీలలో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలని జడ్పీటీసీ పోశం నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కురి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అడపా అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈ ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కత్తి రాము, బీఆర్ఎస్ పార్టీ మణుగూరు టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొలిశెట్టి నవీన్, సీనియర్ నాయకులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షులు రామసహాయం వెంకట్ రెడ్డి, టౌన్ మహిళా అధ్యక్షులు తుంగల చంద్రకళ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రుద్ర వెంకట్, సీనియర్ నాయకులు దామెర కుమారస్వామి, విక్రమ్, కోటేశ్వరరావు, మహిళా నాయకులు శ్యామల, భవాని, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన గెలలనే సేకరించండి

- ఆయిల్ఫెడ్ డీఓ బాలక్రిష్ణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

పక్వానికి వచ్చిన గెలలును మాత్రమే సేకరించాలని ఆయిల్ ఫాం సాగుదారుల ఆయిల్ఫెడ్ డీఓ బాలయికృష్ణ సూచించారు. ఇటీవల సంభవించిన అకాల వానలు కారణంగా పచ్చి గెలలు కూడా పండినట్లు కనిపిస్తాయని, వాటిని పరిశీలించిన తర్వాతనే కోతలు చేపట్టాలని స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పచ్చి గెలలు పరిశ్రమలకు తరలించడం వల్ల ఆయిల్ నాణ్యత పడిపోతుందని, దీని ప్రభావం గెలలు ధరపై చూపుతుందని వివరించారు. గెలలు ధర తగ్గటం వల్ల రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని చెప్పారు. అదేవిధంగా కౌలు రైతులు వారి ఎఫ్ కోడ్‌ను పునఃరుద్ధరించుకోవాలి అని, గతంలో ఇచ్చిన కార్డులను ఏప్రిల్ 1వ తేదీ నుండి పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కౌలు రైతులంతా మార్చి 31వ తేదీ లోపు ఫ్రూట్ కార్డులను పునఃరుద్ధరించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డివిజనల్ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

పిల్లల ఎదుగుదలకు చిరుధాన్యాలు

- జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



నవతెలంగాణ-ఇల్లందు

అన్ని రకాల బలవర్ధకంగా ఉండే చిరుధాన్యాలు పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడతాయని జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లందు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షము ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఏడబ్ల్యూసి, ఏడబ్ల్యూటీలు చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ముఖ్యంగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు కావాల్సిన పోషకాహారం, ఎదుగుదల తదితర అంశాల గురించి మాట్లాడారు. స్టేట్ ప్రాజెక్టు టీం సభ్యులు రాహుల్, కల్పన, రవి పోషణ లోపాలు ఎలా అధిగమించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత, వైస్ ఎంపీపీ ప్రమోద్, ఎంపీటీసీ రాము, కోఆప్షన్ సభ్యులు ఘాజి, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఎసిడిపి ఓ రత్న కుమారి,విజయ కుమారి, సూపర్వైజర్స్ జ్యోతి, రామ కల,కవితా లక్ష్మిమారి తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

తుది ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్







నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం దివ్య క్షేత్రంలో ఈనెల 30న జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, 31న జరిగే శ్రీరామ పట్టాభిషేకం వేడుకలకు సంబంధించి ఏర్పాట్లని దాదాపు పూర్తి కావచ్చాయి. దేశ నలుమూలలు నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు ఈ మహోత్సవాలకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేశారు. రామాలయం విద్యుత్ కాంతులతో శోభిల్లుతోంది. పట్టణ పలుకూడాల్లో స్వాగత ద్వారా ఏర్పాటు చేశారు. శ్రీ సీతారాముల కళ్యాణం, శ్రీ రామ పట్టాభిషేకం వేడుకలు నిర్వహించే మిధుల ప్రాంగణం ముస్తాబయింది. భక్తులు కనులారా ఈ వేడుకలను తిలకించే వీలుగా మిధుల ప్రాంగణంలో భారీ కాటన్ ఏర్పాటు చేశారు. అర్చక స్వాములు ఈ వేడుకలను నిర్వహించేందుకు కావలసిన అన్ని వైదికపరమైన ఏర్పాట్లను చేశారు.

తుది ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శ్రీరామనవమి మహాపట్టాభిషేకం వేడుకలు రంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మంగళవారం స్వామివారి వేడుకలు జరగనున్న మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ వేడుకలు వీక్షణకు 26 సెక్టార్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సెక్టార్లు భక్తులకు సౌకర్యాలు కల్పనకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. మహోత్సవాలకు వచ్చే భక్తులు మన అధితులని, వాళ్ళకు ఎలాంటి అసౌకర్యం చూడాల్సిన బాధ్యత మనందరిపైందని చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్‌లను కళ్యాణమండపంలో అందుబాటులో ఉంచాలని చెప్పారు. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. భక్తులకు 3 లక్షల మంచినీరు ప్యాకెట్లు, లక్ష మజ్జిగ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. స్వామి వారు కళ్యాణ మండపానికి వచ్చే సమయంలో భక్తుల రద్దీ లేకుండా పటిష్ట భారికేడింగ్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమీషనర్ అనిల్ కుమార్, ఎస్పీ డాక్టర్ వినీత్, దేవస్థానం ఈఓ రమాదేవి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో నవమి ఏర్పాట్లు పరీశీలించిన కలెక్టర్

దుమ్ముగూడెం :ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా జరిగే సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం ఏర్పాట్లను కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ మంగళవారం పరీశీలించారు. గోదావరి ప్రాంతంలో సీతమ్మ సాగర్ కరకట్ట పనులు జరుతున్నందున గోదావరి ప్రాంతంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నానఘట్టాల రేవును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. గోదావరి ప్రాంతంలో భారీ కేడ్ల ఏర్పాటు చేయడంతో పాటు గజీతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. గోదావరి స్నానానికి వెళ్లే భక్తులను ఎప్పటికప్పుడు మైక్ ద్వారా అప్రమత్తం చేయాలన్నారు. గోదావరి ప్రాంతంలో మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన డ్రెస్సింగ్ గదులు పరీశీలించారు. పర్ణశాలకు వచ్చే భక్తులకు శాశ్వత మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళికి సూచించారు. గవర్నర్ తమిళసై ఈ నెల 31వ తేదీన పర్ణశాలకు రానున్నారని బందోబస్తు ఏర్పాట్ల గురించి సీఐ దోమల రమేష్‌తో మాట్లాడారు. ఆలయ ఆవరణ చుట్టూ ఉన్న షాపు లను తొలగించాలని సూచించారు. అనంతరం ఆయన కళ్యా ణ కట్ట ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ ఏర్పాటు చేస్తున్న చలు వ పందిళ్లు పరిశీలించారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని అవసరమైతే భక్తులకు ఫ్యాన్లు ఏర్పాటు చేయా లని సూచించారు. పర్ణశాల దేవస్థానం వారు విద్యుత్ శాఖకు డీడీ కట్టక పోవడం వలన ఉదయం నుండి విద్యుత్ నిలిపి వేశారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు పోవడంతో వెంటనే ఆయన విద్యుత్ పునరుద్ధరించాలని సూచించారు. ఈ ఏడాది పర్ణశాలకు భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ మంచినీటిని 24 గంటలు అందించాలని, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్ణశాల ఆరోగ్య ఉపకేంద్రం వద్ద వైద్యశిభిరం ఏర్పాటు చేయాలని ఎక్కువ మొత్తం ఏఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారి రేణుకారెడ్డికి సూచించారు. నవమి ఏర్పాట్ల పై నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందని అధికారులు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిఓ ముత్యాలరావు, ఆర్ఐ లక్ష్మయ్య, పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డి తదితరులు ఉన్నారు.





కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి

- గ్రీన్ ఎర్త్ సొసైటీ మున్సిపల్ కమిషనర్‌కి వినతి
- స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు కమిషనర్‌కు సన్మానం

నవతెలంగాణ-పాల్వంచ

పట్టణ పరిధిలో ఉన్న ప్రజలకు హాని కలిగించే కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ రాథోడ్ కమిషనర్కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు వచ్చినందుకు కమిషనర్ శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఈ సందర్భంగా రమేష్ రాథోడ్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని, మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం రోడ్లు తవ్వి అలానే వదిలివేశారని, వాటిని పునః నిర్మాణం చేయుటకు, అలాగే పైప్ లైన్ లికేజి చాలా చోట్లా ఉందని, నీటి కలిషితం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున వాటి నిర్వహణ కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఆహార విక్రయ కేంద్రాలు (హోటల్స్ అండ్ రెస్టారెంట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్) వెనిగర్‌లో ముంచి రోజుల తరబడి ఉన్న వాటిని అమ్ముతున్నారని, ప్రతి హోటల్ రెస్టారెంట్ ముందు ఫుడ్ సేఫ్టీ అధికారి నెంబర్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ వ్యర్థం రీసైక్లింగ్‌కు యూనిట్ ఏర్పాటు, స్థల సేకరణ చేయుగలరు విజ్ఞప్తి వేశారు. తదితర సమస్యలను మున్సిపల్ కమిషనర్‌కు వివరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షులు బాలినేని సత్యనారాయణ, ట్రెజరర్ దాసరి కిరణ్ కుమార్, సపావట్ బాలకృష్ణ, జనార్ధన్ రెడ్డి, నాగూర్ వలి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించకుంటే
పోరాటాన్ని ఉద్ధృతం చేస్తాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, వినతి



నవతెలంగాణ-పాల్వంచ

హమాలీల సమస్యలను ప్రభుత్వం పట్టించు కోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్ హెచ్చరించారు. మంగళవారం హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ తెలంగాణ హాల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా వ్యాప్తంగా వందల మంది అమరులు పాల్గొని భారీ ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం అల్ హమాలి ఫెడరేషన్ జిల్లా నాయకులు అధ్యక్షతన జరిగిన సభలో ఆయనే మాట్లాడుతూ క్లిష్టమైన కరోనా కాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహణ చేయడంలో, ప్రజలకు నిత్యావసరాలు సకాలంలో అందించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఇటువంటి హమాలిలు శ్రమ దోపిడీకి గురవుతూ ఎండ నకా, వాననకా పని చేస్తూ, ఆరోగ్యాలను కూడా లెక్క చేయకుండా పని చేస్తున్నారని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అనేక రకాలు పనులు చేస్తూ రోజుకు 10 నుండి 12 గంటలకు ప్రజలకు ప్రభుత్వానికి అనేక రకాల సేవలు చేస్తున్నారని అన్నారు. హమాలిలందరికీ భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేసి 55 ఏళ్ల వయసు పైబడిన వారందరికీ నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, గుర్తింపు కార్డులు, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 కేజీలకు మించిన బరువుని నిషేధించాలని డిమాండ్ చేశారు. హమాలీల్లో అర్హులైన ప్రజలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని, పని ప్రదేశాలలో టాయిలెట్స్, బాత్ రూం సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీలు కోరుతున్న ప్రకారం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుపై తగిన చొరవ రాష్ట్ర ప్రభుత్వం చూపకపోతే భవిష్యత్తులో దశల వారి ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహా య కార్యదర్శి డి.వీరన్న, ఉపాధ్యక్షులు కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, బర్ల తిరుపతయ్య, ఆల్ హమాలి యూనియన్ నాయకులు గట్టయ్య, రాము లు, సాయి, సుబ్రహ్మణ్యం, ఉప్పలయ్య, పోలయ్య, నాగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీకి న్యాయం జరిగేంత వరకు పోరాటం

- డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య



నవతెలంగాణ-బూర్గంపాడు

కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని డీసీసీ అధ్యక్షులు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని సారపాకలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంకల్ప సత్య గ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దును నిరసిస్తూ సారపాక పట్టణ కేంద్రంలో సంకల్ప సత్యాగ్రహ నిరసన దీక్షను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ దీక్షను మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గింపూడి కృష్ణారెడ్డి నాయకత్వంలో నిర్వహించారు. టీఎస్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మారం వెంకటేశ్వర రెడ్డి, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, భోగల శ్రీనివాసరెడ్డి, భద్రాచలం టౌన్ అధ్యక్షులు సరేళ్ల నరేష్‌లు మాట్లాడారు. ఈ సంకల్ప సత్యాగ్రహదీక్షను మండల తెలుగు దేశం అధ్యక్షులు తాళ్లూరి జగదీష్, మండల మహిళ ఆకుల పద్మ, సీనియర్ నాయకులు కాకర్ల సత్యనారాయణ, నెట్టెం బాస్కర్‌లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తాళ్లూరి చక్రవర్తి, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, జిల్లా మైనారిటి కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ ఖాన్, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, నియోజకవర్గ యువజన నాయకులు పోలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లకు అండగా బీజేపీ : నాగా సీతారాములు

కొత్తగూడెం : దేశంలో ఆర్థిక నేరగాళ్లకు అండగా బీజేపి కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, గుజరాతి దొంగలకు వత్తాసు పలుకుతున్నారని టీపీసీసీ సభ్యులు నాగా సీతా రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నాగా సీతారములు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం నిరసన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షను ఉద్దేశించి నాగా సీతారాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మడిపల్లి శ్రీనివాసులు, జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.కరీం పాషా, సుజాతనగర్ మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగార్జున, కిసాన్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ అజ్మీర మోహన్, ఓబీసీ జిల్లా కార్యదర్శి బాలు భద్రరావు, సుజాతనగర్ మండలం మైనార్టీ అధ్యక్షులు సైపుద్దిన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : రాహుల్ గాంధీని రాజకీయాలకు దూరంగా ఉంచాలని, అనైతికంగా అనర్హత వేటు వేయడాని నిరసిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చంద్రుగొండ ప్రధాన సెంటర్లో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఒకరోజు ధర్నా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకండ్ల కొడకండ్ల వెంకట రెడ్డి, మాజీ ఎంపీపీ గూగులోత్ బాబు, సర్పంచులు పద్దం వినోద్ దారావత్ పార్వతి , మాజీ సర్పంచ్ రుక్మిణి, మండల కాంగ్రెస్ నాయకులు కేశ బోయిన నరసింహారావు, నరసింహారావు ఇంజమ్ అప్పారావు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొర్రా సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షులు అన్వర్, బీసీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాములు, బడుగు చిన్ని, బద్రు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పతనం ప్రారంభమైంది : తాటి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పతనము ప్రారంభమైందని అశ్వరావుపేట మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ అనర్హత నిరసనగా దీక్షను మండల కాంగ్రెస్ చేపట్టింది. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కొనకళ్ళ వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాబు కేశ బోయిన నర్సింహారావు, మదర్ సాహెబ్, అంతటి రామకృష్ణ, అప్పారావు, పార్వతి బడుగు కృష్ణవేణి, వినోద్, సురేష్, రెడ్డి సురేష్ రాజేశ్వరరావు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప సత్యాగ్రహ దీక్ష

మణుగూరు : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ఎంపీ పదవికి అనర్హుడుగా ప్రకటిస్తూ లోక్ సభ సెక్రెటేరియట్ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ సంకల్ప దీక్ష నిర్వహించారు. మంగళవారం అంబేద్కర్ సెంటర్లో పినపాక నియోజకవర్గం స్థాయి దీక్ష మంగళవారం ప్రారంభించారు. ఈ దీక్షలకు సీపీఐ, తెలుగుదేశం, వైయస్సార్ టీపీ, తుడుం దెబ్బ, వివిధ ప్రజా సంఘాలు నాయకులు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చందా లింగయ్య, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, సుధాకర్ రెడ్డి, పిరినాకి నవీన్, కేశ్వవ రెడ్డి, ఇక్బాల్, హుస్సేన్, సర్వేశ్వరరావు, గొడిశాల రామనాథం, ఓరుగంటి బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షులు నవీన్ ఆధ్వర్యంలో

కేంద్రంలో మోడీ నిరంకుశ పాలను చరమగీతం పాడాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పీరీనాకి నవీన్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దును వ్యతిరేకిస్తూ టీపీసీసీ సభ్యులు డాక్టర్ చందా సంతోష్ కుమార్, పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు సంకల్ప సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి సర్వేశ్వరరావు, కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, పినపాక మండల అధ్యక్షులు రామనాధం, మండల అధ్యక్షులు బీక్షమయ్య, బీ బ్లాక్ అధ్యక్షురాలు నాగమణి, కరకగూడెం మండల యువజన అధ్యక్షులు కునుసోత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.





"సాహితీ సృజన చేయడానికి వెనుక నేనేం చేసాను అంటే చేయాల్సిందెంతో ఉందని మాత్రం చెప్పగలను. సాహిత్యమనే సంద్రంలో ఈత నేర్చుకుని తొలి అడుగుల్లో ఉంటూ సముద్రపు అందాలను చూస్తున్నాను. లోతులను గమనిస్తున్నాను. అద్భుతాలను అవలోకనం చేసుకుంటున్నాను. ఆటుపోట్లను తెలుసుకుంటున్నాను" అంటారు ప్రముఖ రచయిత్రి డా.సమ్మెట విజయ. పెండ్లయి పిల్లలు పుట్టిన తర్వాత ఇటు కుటుంబాన్ని చూసుకుంటూనే నాటక రంగంలో పరిశోధన చేశారు. కవితలు, కథలు రాస్తూ తన ఆలోచనలు ప్రపంచం ముందు పెడుతున్నారు. అక్షరయాన్‌తో మమేకమై ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

'నన్ను నేను మలుచుకున్నా'

అమ్మ లక్ష్మీ తులసి, గృహిణి. నాన్న సమ్మెట పోతరాజు. అసిస్టెంబర్ లెబర్ ఆఫీసర్‌గా చేసేవారు. ఆయన ఉద్యోగ రీత్యా అనేక ప్రాంతాలు తిరిగాము. నేను హైదరాబాద్‌లో పుట్టాను. నాకు ఇద్దరు అక్కలు, అన్నా, చెల్లి ఉన్నారు. అందరం సాహిత్యం పట్ల అభిమానం వున్న వాళ్ళమే. నాన్న ట్రాన్స్‌ఫర్ల మధ్య నా చదువు చాలా ఊర్లలో జరిగింది. నిజామాబాద్, శ్రీరాం సాగర్, కరీంనగర్, కొత్తగూడెంలో స్కూలు చదువు పూర్తి చేశా. ఇంటర్ ఖమ్మంలో, డిగ్రీ మంచిర్యాలలో, బి.యిడి మహబూబాబాద్‌లో, ఎం.ఎ, ఎంఫిల్, పి.హెచ్‌డీ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. స్కూల్లో చదువుతూనే లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చుకొని చదువుకునే దాన్ని. నాన్న కూడా అనేక పత్రికలు, పుస్తకాలు ఇంటికి తీసుకొచ్చేవారు. వాటిని కూడా ఇంట్లో మేమందరం చదివేవాళ్ళం. నేనూ మా చిన్నక్క ఉమాదేవి రచనా రంగంలో వున్నాం. తను వయసులో పెద్దదైనా ఇద్దరం మంచి స్నేహితులం.

సాహిత్యానికి చేరువ చేసింది చదువే

చిన్నతనం నుంచి నాకు చదువంటే పిచ్చి. చదువే లోకంగా పెరిగాను. ఆ చదువే నన్ను సాహిత్యానికి చేరువ చేసింది. ఆ చదువే గొప్ప రచయితలను, రచనలను, మనుషుల మనస్తత్వాలను పరిచయం చేసింది. నన్ను నడిపించి నా చదువును కొనసాగించేలా చేసిన వారు నా తల్లిదండ్రులు. వివాహానంతరం నాకు తోడుగా నిలిచి ముందుకు పంపింది నా భర్త, అత్తమామలు. అలాగే పెద్దక్క దేవకీదేవి ప్రోత్సాహం నన్ను నన్నుగా నిలబెట్టింది. చదువుకోవాలనే పట్టుదల వివాహం అయినా, పిల్లలు పుట్టినా ఎం.ఏ, బి.ఇడితో ఆగక ఎం.ఫిల్, పి.జి డిప్లమా పబ్లిక్ రిలేషన్స్, ఎం.ఇడి, పి.హెచ్‌డి వరకు కొనసాగింది.


నా లక్ష్యం నెరవేర్చుకున్నాను


నా సబ్జెక్ట్ తెలుగు కనుక తెలుగు ఉపాధ్యాయురాలిగా జీవనం మొదలైంది. కుటుంబం కోసం కళాశాలకు వెళ్లకుండా (వేరే ఊర్లకు వెళ్ళలేక) బడి ఉద్యోగానికే పరిమితమయ్యాను. సాహిత్యం తెలుసుకోవాలంటే ముందు బాగా చదవాలని తెలుసుకున్నాను. అందుకు మామయ్య అంగీకారంతో, భర్త సహకారంతో చేస్తున్న ఉద్యోగానికి సెలవుపెట్టి (జీతం లేకుండా) ఒకటిన్నర వయసున్న బాబుకు పాలు, బట్టలు సర్ది అత్తవారింట వదిలి మూడు బస్సులు మారి తార్నాకా నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చి బాబును చూసుకుంటూ చదువుకున్నాను. ఇక పి.హెచ్.డి కి ఎన్ని బస్సు లెక్కానో, నాటక రంగంలో పరిశోధనకు ఎందరిని కలిసి ఇంటర్వ్యూలు చేసానో లెక్కలేదు. ఉద్యోగం చేస్తూ, కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూ నా లక్ష్యం నెరవేర్చుకున్నాను. ఈ ప్రయత్నంలో ఇంకా చదువంటూ తిరుగుతుందనే విమర్శను ఎదుర్కున్నా.



'సమ్మెట విజయ సౌజన్య'

ఇంటర్ నుంచి రచనలు చేస్తున్నాను. స్త్రీల సమస్యలపై 'సమ్మెట విజయ సౌజన్య' పేరుతో 40కి పైగా రాసిన వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. తొలి కథ 'అమ్మాయి ప్రయాణం' భారతి పత్రికలో చూసుకున్నప్పుడు ఆనందం కలిగించింది. ఆ తర్వాత పరిశోధకురాలిగా ఉస్మానియా, తెలుగు, ఆదికవి నన్నయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయాలలో పత్రసమర్పణలు చేశాను. ఒకప్పుడు డాక్టర్ కావాలని బైపీసీ తీసుకున్న నేను తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ చేసాను. నాకు లభించిన మరో అద్భుతమైన అవకాశం నా పి.హెచ్‌డి. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కాన్వకేషన్ ముఖ్యఅతిథి ఎ.పి.జె.అబ్దుల్ కలామ్, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సమక్షంలో డాక్టరేట్ తీసుకోవడం. నా జన్మలో మరిచిపోలేని రోజు అది. అబ్దుల్ కలామ్ ప్రసంగం నాలుగడుగుల దూరంలో వినడంతో ఆత్మవిశ్వాసం, పట్టుదల ఆ రోజు నుంచే అలవరుచుకున్నాను. ఆయన మాటలను ఆదర్శంగా తీసుకున్నాను.





కవితలు విరివిగా రాశాను

పి.హెచ్‌డి అయ్యాక ఆ పుస్తకం "తెలుగులో నాటక రచన 1991-2000" అభినయ జాతీయ నాటక రంగ సంస్థ అభినయ శ్రీనివాస్ నిర్వహణలో డా.సి.నారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. తర్వాత నా తొలి కవితా సంపుటి 'భావనాంజలి' వచ్చింది. నేను రచించిన వ్యాసాలతో ఒక వ్యాస సంకలనంగా తేవాలన్నది నా కోరిక. కానీ పుస్తక ప్రచురణకు అయ్యే ఖర్చు భరించలేక ఆగిపోయాను. ఇంతకు ముందు రాసి సిద్ధంగా ఉన్న 'తెర వెనుక', మరి రెండు పుస్తకాలు కూడా అలాగే ఉండిపోయాయి. కవయిత్రిగా కవితలు విరివిగా రాసాను. అనేక కవి సమ్మేళనాలలో పాల్గొన్నాను. హైదరాబాదుతో పాటు యానాం, ఖమ్మంలోనూ బహుమతులు అందుకున్నాను. నేను పనిచేస్తున్న రైల్వే మిశ్రమోన్నత పాఠశాలలో కవితల పరంపర కొనసాగుతూనే ఉంది.

నాటక రంగం పరిశోధకురాలిగా...

అబ్బూరి ఛాయాదేవి కథల మీద ఎం.ఫిల్ చేసిన నేను కథలు చదవడం, రాయడంపై ఆసక్తిని పెంచుకున్నాను. నేను రచించిన ఓ కథ అర్చనా ఫైన్ ఆర్ట్స్ అకాడమి వారి బహుమతికి ఎంపికైంది. వివిధ కథా సంకలనాలలో నా కథలున్నాయి. వ్యాస రచయిత్రిగా భూమిక నుంచి బహుమతులు గెలుచుకున్నాను. నవతెలంగాణలో, సారంగలో నా వ్యాసాలు, పుస్తక సమీక్షలు వచ్చాయి. డా.ప్రభాకర్ జైని రచించిన 'హీరో' నవలపై నేను రచించిన సమీక్ష ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. నాటకరంగ పరిశోధకురాలిగా ఎన్నో వ్యాసాలు రచించాను. తెలంగాణ నాటక సాహిత్యం గ్రంథంలో తెలంగాణ నాటక రంగంలో మహిళల గురించి వ్యాసం రాసాను. బడి నేపథ్యంలో రచించిన 'బడే నా లోకం' నవల ముద్రణలో ఉంది.

భాషకు సేవ చేయగలిగాను

అక్షరయాన్ రూపొందినప్పటి నుంచి నేటి వరకూ మహిళా కవయిత్రులను సంఘటితంగా ఒక విశిష్ట సంస్థగా రూపొందాలని తపించాము. అందుకోసం వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మితో కలిసి పలు సాహితీ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. హైదరాబాద్‌కు జిల్లా ప్రతినిధిగా రెండు సంవత్సరాలు చేసి ఆ తర్వాత పత్రికా ప్రతినిధిగా నా వంతు సహకారాన్ని అందిస్తున్నాను. అక్షరయాన్ వెలువరించిన పుస్తకాలలో నా రచనలు కూడా చోటు చేసుకున్నాయి. లైంగిక దాడుల వల్ల గురైన స్త్రీల కుటుంబాలను కలిసి ఉమెన్ సేఫ్టీ వింగ్ సహకారంతో ప్రత్యక్షంగా మాట్లాడి కథలు రాసాము. కరోనా పై యుద్ధం కవితలతో సంకలనం తీసుకొచ్చాము. విత్తన సదస్సు నిర్వహించాము. పూలసింగిడి పేరుతో బతుకమ్మ కవితలు రాసాము. పరమవీరచక్ర సైనిక వీరులకు కవితల హారతినిచ్చాము. సీనియర్ రచయిత్రులకు మాతృవందనం చేసాం. సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో మక్కువ ఉన్న నాకు తెలుగు భాషకు సేవచేసే అవకాశం కలిగించింది. అందుకు అక్షరయాన్ బాసటగా నిలిచింది. నా ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు అప్పుడప్పుడూ రచనలు చేసే విషయంలో కొంత విరామం కలిగించినా నాటకరంగం, కథలు, కవితలు అన్ని మాధ్యమాల్లో పరిశీలించి అధ్యయనం చేస్తూనే ఉంటాను. ఆయా రచయితల రచనలకు స్పందన తెలియజేస్తాను. కనుక సాహిత్యంతో నా జీవితం మమేకం. అక్షరయాన్ ద్వారా సాహిత్యానికి ఈ జీవనం అంకితం. మరిన్ని మంచి రచనలు చేయడానికి నన్ను నేను మెరుగులు దిద్దుకుంటాను.

– సలీమ

ఆత్మీయ సంగమంగా మార్చింది



తెలుగు సాహిత్యం పట్ల మక్కువ ఎందుకు అంటే అమ్మ మీద మక్కువ ఎందుకు అని ప్రశ్నించినట్లే. తెలుగు నా మాతృభాష, ప్రాణం ఉన్నంత వరకు తెలుగు భాషకు నా వంతు సేవ చేయాలి. తెలుగు వెలుగులను దశదిశలా చాటాలి. ఇటీవల సరోజిని నాయుడు జయంతి సందర్భంగా సరోజిని నాయుడు పురస్కారం లభించడం కవిత్వం పట్ల నా బాధ్యత మరింత పెంచింది. కర్ణాటక తెలుగు సమాఖ్య, బెంగుళూరు వారి ఉగాది పురస్కారం దేశ వ్యాప్తంగా పలు సాహితీ సంస్థలలో చేసిన సేవలకు ఎంపిక చేసిన వారికి ఇచ్చే పురస్కారం. మార్చి 19, 2023న అక్షరయాన్ సంస్థ నుంచి నాకు లభించడం నన్ను మాత్రమే కాదు అక్షరయాన్ రచయిత్రులందరినీ దేశంలోని సాహితీ సంస్థల మధ్య సగర్వంగా నిలబెట్టింది. అలాగే సాహిత్యానికి 'తెలంగాణ సాహితి' చేస్తున్న కృషి సర్వదా ప్రశంసనీయం. తెలంగాణ సాహితితో విడదీయరాని అనుబంధం ఖమ్మం నుంచీ ఉంది. అనేక సాహితీ సమావేశాల్లో పాలుపంచుకుని కవితలు చదివి, పత్రసమర్పణ చేసి ఆత్మీయ సంగమంగా మార్చింది.

నేడే జనచైతన్య యాత్ర ముగింపు సభ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన జనచైతన్య యాత్ర ముగింపు సభ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ హాజరవుతున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు యాత్రకు నాయకత్వం వహించిన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ ఇతర బృంద సభ్యులు పాల్గొంటారు. ఈనెల 17న వరంగల్‌లో, 23న ఆదిలాబాద్‌లో, 24న నిజామాబాద్‌లో మూడు ప్రాంతాల నుంచి బస్సుజాతాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా జనం జేజేలు పలికారు. ఎర్రజెండాలు కట్టుకుని బైక్ ర్యాలీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర జయప్రదంగా సాగింది. రాజ్యాంగాన్ని రక్షిద్దాం, దేశాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రజలను జాగృతం చేసింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతో నిరుద్యోగులు రిజర్వేషన్లతోపాటు ఉద్యోగాలు ఎలా కోల్పోతారో నాయకులు వివరించారు. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతం అయిన మనువాద భావజాలాన్ని చాతుర్వర్ణ వ్యవస్థను, కులవ్యవస్థను కొనసాగించడం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టింది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల సామాన్యులు ఎంత సతమతమవుతున్నారో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రజాసంక్షేమానికి కోతలు పెడుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పించే మోడీ ప్రభుత్వ ద్వంద్వ విధానాలను వివరించింది. వామపక్ష, అభ్యుదయ భావజాలం బలంగా ఉన్న తెలంగాణలో ప్రజల ఐక్యతకు చిచ్చుపెట్టి రాజకీయంగా బలపడాలన్న బీజేపీ గుట్టును చిత్తుచేసింది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనూ సీపీఐ(ఎం) నాయకులు ఈ యాత్రలో ప్రస్తావించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు, పోడు భూములకు పట్టాలు, కార్మికులకు కనీస వేతనాలు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంట నష్టపరిహారమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ఆయన ఆదేశించారు. ఆయా జిల్లా కలెక్టర్లు తమ తమ జిల్లా పరిధిలో, క్లస్టర్ల వారీగా స్థానిక వ్యవసాయ అధికారులతో (ఏఈవో) సర్వే చేయించి జరిగిన పంట నష్టం వివరాలను పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి అందజేయాలని తెలిపారు. ఈమేరకు తక్షణ చర్యలు ప్రారంభించాలని సీఎస్ శాంతికుమారికి, వ్యవసాయశాఖకార్యదర్శి రఘునందన్‌రావును ఆదేశించారు. పంట దెబ్బతిన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ నిధులను జమ చేయాలన్నారు.

గృహలక్ష్మి విధివిధానాలు ఖరారు చేయాలి

అర్హులైన పేదలకు 'గృహలక్ష్మి' పేరిట రూ.మూడు లక్షల ఆర్థిక సాయం చేసేందుకు విధివిధానాలు ఖరారు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

గొర్రెల పంపిణీ

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోనే గొర్రెల కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఆ ప్రకారమే గొర్రెల కొనుగోలు పంపిణీ వ్యవహారాలు సాగాలన్నారు.

పోడు భూముల పంపిణీకి సంసిద్ధత

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో...అర్హులైన వారికి పోడు పట్టాల పంపిణీకి అధికార యంత్రాంగం సంసిద్ధంగా వుందా అనే అంశానికి సంబంధించి సీఎస్‌తో చర్చించారు. నాలుగు లక్షల ఎకరాలకు సంబంధించి.. ఒక లక్షా 55 వేల మంది అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు.. పాస్ బుక్కులు ముద్రించి సిద్ధంగా వున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నేపథ్యంలో.. అర్హులకు పోడు భూముల పట్టాల పంపిణీ కోసం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని సీఎం తెలిపారు.

మెట్రో విస్తరణపై కేంద్రం వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

ముందుకొచ్చిన నిర్మాణ రంగ సంస్థలు వరల్డ్ సిటీ స్థాయిలో పనులు చేపట్టాలని కోరారు.

హైదరాబాద్ నగరానికి అధునాతన సదుపాయాలు కల్పించడానికి రూ.2,400 కోట్లతో లింక్ రోడ్లు, రూ.10 వేల కోట్లతో మూసీ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామోజీ ఫిలిం సిటీ లాంటి ఫిలిం సిటీని రాచకొండలో అత్యంత ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం అబ్బురపడేలా తీసుకొస్తామని, ఒలంపిక్ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్ కృష్ణా బేసిన్‌లో ఉన్నదని, 94 శాతం నీరు గ్రావిటీ ద్వారా మూసీ నదిలోకే ప్రవహిస్తుందన్నారు. సీఎస్‌ఆర్ పద్ధతి ద్వారా చేపట్టే చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, సేద తీరడానికి కుర్చీల ఏర్పాటు, వ్యాయామశాల, ఆట స్థలం, థీమ్ పార్కు, టాయిలెట్స్, లైటింగ్, సెక్యూరిటీ గార్డ్ వంటి అధునాతన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. చెరువులలో ప్రయివేట్ ల్యాండ్ ఉన్నచో వాటికి టీడీఆర్ జారీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 13 చెరువుల్లో ఉన్న 115 ఎకరాల ప్రయివేటు భూములను సేకరించి 200 శాతం విలువతో టీడీఆర్‌లను జారీ చేసినట్టు తెలిపారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను సంప్రదించొచ్చని సూచించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను డీమార్క్ చేసి మ్యాప్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

2022లో మన హైదరాబాద్‌కు ఆఫీస్ ఫేస్‌లో నెంబర్ 1 వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం వ్యాక్సిన్ నగరంగా పేరుగాంచిందని, భవిష్యత్‌లో 1400 కోట్ల వ్యాక్సిన్‌లను ప్రపంచ దేశాలకు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. దుర్గం చెరువును డెవలప్ చేయడం ద్వారా టూరిస్ట్ అట్రాక్షన్, సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 185 చెరువుల అభివృద్ధి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సుందరీకరణ, మెయింటెనెన్స్‌కు ఎంఓయూ చేసుకునేందుకు ఆసక్తి గల వారు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా 51 చెరువులకు సంబంధించి ఎంఓయూ పత్రాలను వారికి అందజేశారు. ఇటీవల ఫాక్స్‌ఖాన్ చైర్మెన్ హైదరాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు హైదరాబాద్ సిటీ అద్భుతంగా ఉందని కితాబు ఇచ్చారని గుర్తు చేశారు. కొంగరకలాన్‌లో ఆ సంస్థ పెట్టుబడులు పెట్టడం ద్వారా 30వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఆకులలలిత, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కమిషనర్ డిఎస్.లోకేష్‌కుమార్, సీసీపీ దేవేందర్‌రెడ్డి, సీఈ సురేష్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, గంగాధర్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఇంజినీరింగ్ విభాగం అధికారులు, నిర్మాణ రంగ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

20 ఏండ్లు విధులకు రాకున్నా...

- ఓ టీచర్‌కు ఉద్యోగమిచ్చిన జగిత్యాల డీఈవో

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని తాట్లవాయి ఎంపీపీఎస్‌లో పనిచేసిన టి శ్రీనివాస్ అనే టీచర్ 2003, సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు అంటే 20 ఏండ్లపాటు విధులకు హాజరు కాలేదు. అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యారు. అయినప్పటికీ జగిత్యాల డీఈవో బి మదన్‌మోహన్ ఆయనకు ఉద్యోగమివ్వడం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ ఎంపీయూపీఎస్‌లో ఆయనకు పోస్టింగ్ ఇస్తూ గతనెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే క్లాసిఫికేషన్, కంట్రోల్ అప్పీల్ (సీసీఏ) రూల్ ప్రకారం ఓ ఉద్యోగి సంబంధిత శాఖ ఉన్నతాధికారుల అనుమతితో గరిష్టంగా ఐదేండ్లపాటు సెలవు తీసుకునే అవకాశమున్నది. అధికారులకు చెప్పకుండా ఏడాదిపాటు విధులకు గైర్హాజరైతే ఆ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. కానీ 20 ఏండ్లపాటు విధుల్లో లేకపోయినా టి శ్రీనివాస్ అనే టీచర్‌కు మళ్లీ ఉద్యోగమివ్వడం గమనార్హం.

40 శాతం టికెట్లు యువతకే

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదీర్ఘ మంతనాల అనంతరం పొలిట్‌బ్యూరో పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పార్టీని ఇరు రాష్ట్రాల్లో బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్టీఆర్ శతజయంతి కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. బుధవారం మే 28 వరకు శతజయంతి ఉత్సవాలను 42 పార్లమెంట్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై వైసీపీ పిచ్చి ప్రేలాపణలు ఆపాలని పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు. సైకిల్‌గుర్తుపై గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలను ఎంతకు కొన్నాడో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, యువగళం పాదయాత్ర విజయవంతంగా సాగుతున్నదని చెప్పారు. ఏపీకి చెంది 13, తెలంగాణకు సంబంధించి నాలుగు మొత్తం 17 అంశాలపై తీర్మానాలు చేసినట్టు ప్రకటించారు. అకాల వర్షాలపై సీఎం ఇప్పటివరకు కనీసం సమీక్ష చేయకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. జీవో నెంబరు ఒకటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ వచ్చాకే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. నాలుగేండ్లుగా రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. కొత్త పరిశ్రమల సంగతి పక్కబెడితే, ఉన్నవి మూతపడుతున్నాయని గుర్తు చేశారు.

ఘనంగా ఆవిర్భావ దినం: కాసాని

తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని ప్రకటించారు. ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఏపీలో



ఎమ్మెల్సీ ఎన్నికల విజయంతో క్యాడర్‌తో ఉత్సాహం ఉరకలేస్తున్నదని చెప్పారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కేసీఆర్ ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్స్ గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం మూడు గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది హాజరవుతున్నారని చెప్పారు. ఈమేరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సన్నాహాలు చేసినట్టు తెలిపారు.

పీఎఫ్‌పై 5 పైసల వడ్డీ పెంపు

న్యూఢిల్లీ : ఉద్యోగ, కార్మికుల పీఎఫ్‌పై కేవలం 5 పైసలు వడ్డీ పెంచారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను 8.15 శాతం వడ్డీ చెల్లించడానికి మంగళవారం జరిగిన ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖకు ట్రస్టీ ప్రతిపాదనలు పంపించనున్నది. ఇంతక్రితం 2021-22లో 8.10 శాతం వడ్డీని అందించారు. గత నాలుగు దశాబ్దాల్లో పీఎఫ్‌పై ఇదే తక్కువ వడ్డీ రేటు కావటం గమనార్హం. దీంతో పోల్చితే అతి స్వల్పంగా 0.05 శాతం లేదా 5 పైసల పెంపుదల చోటు చేసుకుంది. కేంద్రం నుంచి ఆమోదం లభించిన తర్వాత ఈపీఎఫ్ఓ వడ్డీ రేటును అధికారికంగా గెజిట్‌ను విడుదల చేయనుంది. ఆ తర్వాత వడ్డీని ఖాతాదారుల ఖాతాల్లో జమ చేయనుంది. మోడీ సర్కార్ అధికారంలోకి రాక ముందు 2013-14లో పీఎఫ్‌పై గరిష్టంగా 8.75 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. క్రమంగా దీన్ని తగ్గిస్తూ వచ్చింది. ఈపీఎఫ్ఓలో 5 కోట్ల పైగా ఖాతాదారులు ఉన్నారు.

ఈడీ లేఖకు ఎమ్మెల్సీ కవిత సమాధానం



న్యూఢిల్లీ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తరఫున ఆ పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ ఈడీ కార్యాలయానికి వెళ్లారు. కె.కవితకు ఈడీ జాయింట్ డైరెక్టర్ లేఖ రాశారు. తాము కవిత అందించిన మొబైల్ ఫోన్లను తెరిచేందుకు సిద్ధమయ్యామని లేఖలో తెలిపారు. ఫోన్లు ఓపెన్ చేసేటప్పుడు స్వయంగా హాజరుకావడం, లేదా తన ప్రతినిధిని పంపాల్సిందిగా లేఖలో ఈడీ పేర్కొంది. అందువల్ల కవిత తరపున ఈడీ కార్యాలయానికి బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ మంగళవారం వెళ్లారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన ఈడీ కార్యాలయంలోనే ఉన్నారు.

దేశం అప్పు 155.8 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

విలువ రూ.82కి పడిపోయిందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రూ. 82.4845కి రూపాయి విలువ పతనం అయిందని తెలిపారు.

దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇచ్చిన సమాధానంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదల స్పష్టమైంది. 2022-23 (ఏప్రిల్- ఫిబ్రవరి) మధ్య 6.75 శాతం వినియోగదారు ధరల సూచిక-కంబైన్డ్ (సీపీఐ-సీ) ద్రవ్యోల్బణం ఉన్నదని కేంద్ర మంత్రి తెలిపారు. 2021-22లో సీపీఐ-సీ ద్రవ్యోల్బణం 5.51 శాతం ఉందని పేర్కొన్నారు.

విద్వేష ప్రసంగాలపై చర్యలేవి?

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకొచ్చారు. అయితే, కేవలం కేసుల నమోదుతో ఈ సమస్య పరిష్కారం కాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని సొలిసిటర్ జనరల్ మెహతాను ప్రశ్నించింది. తదుపరి విచారణ నిమిత్తం కేసును బుధవారానికి వాయిదా వేసింది. విద్వేష ప్రసంగాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సర్వోన్నత న్యాయస్థానం గతంలోనూ పేర్కొంది. ఫిర్యాదు కోసం ఎదురుచూడకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఎంతో తీవ్రమైన ఈ సమస్యపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం ఏదైనా జాప్యం చేస్తే.. కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని కూడా హెచ్చరించింది.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886